25-7Pg1exHMNWJQE:25-7Pg1exHMNWJQE.qxd 7/25/2026 12:36 AM Page 1




ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ



తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

epaper.vaartha.com WWW.VAARTHA.COM

అన్నమయ్య : fb.com/vaartha Digital

Published from Tirupathi, Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Guntur, Ongole, Nizamabad, Warangal, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

25-7-2026 శనివారం సంపుటి: 32 సంచిక: 175 పేజీలు: 10+4 వెల: 6.50




## ఎపి, కర్ణాటకకు 'రైలు' వరాలు

రూ. 1264 కోట్లతో మల్టీ ట్రాకింగ్ రైలు ప్రాజెక్టు 5లో

2028-29 నాటికి పూర్తి: కేంద్ర కేబినెట్ నిర్ణయం

రూ. 3030 కోట్లతో భవ్య రసాయన స్కీమ్‌కి ఆమోదం

వివరాలు వెల్లడించిన కేంద్రమంత్రి అశ్వినీ వైష్ణవ్



## యువత స్పందనకు మోడీ ధన్యవాదాలు

### ఇన్‌స్టా విడియోలో ప్రధాని

**న్యూఢిల్లీ,జులై 24:** పేపర్ లీకేజీలను అరికట్టేందుకు ప్రభుత్వం చేపట్టనున్న చర్యలపై యువత నుంచి వచ్చిన సానుకూల స్పందనకు ప్రధాని మోడీ కృతజ్ఞతలు తెలిపారు. పేపర్ లీకేజీల నివారణకు కేంద్ర ప్రభుత్వం రూపొందిస్తున్న కార్యాచరణపై తాను ఇన్‌స్టాగ్రామ్‌లో విడుదల చేసిన వీడియోకు యువత విశేష స్పందన తెలిపిందని ప్రధాని మోడీ అన్నారు. ఈ సందర్భంగా తమ విలువైన సూచ >>2

## పేపర్ లీక్ కేసుల్లో కఠిన శిక్షలు 2లో

పదేళ్ల జైలు, పదికోట్ల జరిమానా

బిల్లుకు కేంద్ర కేబినెట్ ఆమోదం

## రైల్వే సహాయ మంత్రి రవ్‌నీత్ సింగ్ రాజీనామా 2లో

# ధర్మేంద్ర ప్రధాన్‌పై నేడు నిర్ణయం!



శుక్రవారం న్యూఢిల్లీలో సిజెపి ప్రతినిధులు సారవ్‌దాస్, అశుతోష్‌లతో చర్చలు జరిపిన కేంద్రమంత్రులు నడ్డా, జితేంద్ర

## సిజెపి రెండు డిమాండ్లకు కేంద్రం ఓకే

### ఢిల్లీలో తీవ్రస్థాయి ఆందోళనల మధ్య కీలక చర్చలు జరిపిన కేంద్రమంత్రులు నడ్డా, జితేంద్ర

### విద్యామంత్రి రాజీనామా చేస్తేనే ఆందోళన విరమిస్తామన్న సిజెపి

**న్యూఢిల్లీ,జులై 24:** దేశవ్యాప్తంగా కొనసాగుతున్న నీట్ యూజీ ప్రశ్నాపత్రం లీక్ వ్యవహారంపై నిరసనల నేపథ్యంలో, పరీక్షలలో జరిగిన అవకతవకలకు సంబంధించిన డిమాండ్లపై పరిష్కారం కనుగొనే ప్రయత్నంలో భాగంగా శుక్రవారం ఢిల్లీలోని విఠల్‌భాయ్ పటేల్ హౌస్‌లో కేంద్ర ప్రభుత్వం, కాక్‌రోచ్ జనతా పార్టీ (సిజెపి) ప్రతినిధుల మధ్య కీలక సమావేశం జరిగింది. ప్రభుత్వం తరపున >>2

# ఎన్‌టిఎలో భారీ ప్రక్షాళన



## 47 మంది అధికారుల తొలగింపు

### పరీక్షల నిర్వహణలో సంస్కరణలకు కేంద్రం శ్రీకారం

### చర్యలపై సుప్రీం ప్రశ్నించడంతో వెంటనే ప్రకటించిన ప్రభుత్వం

### కొందరిపై క్రిమినల్ చర్యలు మొదలైనట్లు వెల్లడి

**న్యూఢిల్లీ,జులై 24:** జాతీయ స్థాయిలో పరీక్షల నిర్వహణలో పారదర్శకత, విశ్వసనీయతను పెంపొందించే దిశగా కేంద్ర ప్రభుత్వం కీలక చర్యలు చేపట్టింది. వరుస పేపర్ లీక్ ఆరోపణలతో విమర్శలు ఎదుర్కొంటున్న నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ)లో భారీ ప్రక్షాళనకు శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా ఎన్‌టీఏలో పనిచేస్తున్న 47 మంది అధికారులు, సిబ్బందిని సేవల నుంచి తొలగించినట్లు సమాచారం. వీరిలో కాంట్రాక్ట్ ఉద్యోగులు కూడా ఉన్నట్లు తెలుస్తోంది. కొందరిపై చట్టపరమైన, క్రిమినల్ చర్యలు కూడా ప్రారంభించనున్నట్లు విశ్వసనీయ వర్గాలు వెల్లడించాయి. ఎన్‌టిఏ సంస్థలో పూర్తిస్థాయి పునర్వ్యవస్థీకరణ చేపట్టనున్నారు. సంస్థ యొక్క పరిపాలనా నిర్మాణాన్ని పూర్తిగా మార్చి, నిపుణుల కమిటీ సిఫారసుల మేరకు కొత్త సంస్కరణలను అమలు చేయాలని కేంద్రం నిర్ణయించింది. వచ్చే ఒక నెలలో ఈ పునర్వ్యవస్థీకరణ ప్రక్రియ పూర్తవుతుందని తెలుస్తోంది. ఇటీవల రాజ్యసభలో కేంద్ర విద్యాశాఖ సహాయ మంత్రి డాక్టర్ సుకాంత మజుందార్ ఎన్‌టీఏలో ప్రస్తుతం మొత్తం 39 శాశ్వతపోస్టులే ఉన్నాయని, అందులో 16 కొత్త పోస్టులు కూడా ఉన్నాయని వెల్లడించారు. అవసరానికి అనుగుణంగా సంస్థ తాత్కాలిక ప్రాతిపదికన అధికారులు, సిబ్బందిని నియమించుకుం టుందని ఆయన తెలిపారు. ఎన్‌టిఏ ఒక స్వయం ప్రతిపత్తి కలిగిన సంస్థగా పనిచేస్తోందని పేర్కొన్న మంత్రి సంస్థను మరింత బలోపేతం చేసేందుకు డైరెక్టర్ స్థాయిలో 8, జాయింట్ డైరెక్టర్ స్థాయిలో 8 పోస్టులను కేంద్ర స్టాఫింగ్ పథకం ద్వారా భర్తీ చేసేందుకు సృష్టించినట్లు రాజ్యసభలో లిఖితపూర్వక సమాధానంలో వివరించారు.కేంద్ర విద్యాశాఖ పరిధిలోని ఉన్నత విద్యా విభాగానికి అనుబంధంగా పనిచేస్తున్న ఎన్‌టిఏను 2017లో స్థాపించారు. దేశవ్యాప్తంగా ప్రవేశ పరీక్షల నిర్వహణ బాధ్యతలను ఈ సంస్థ నిర్వహిస్తోంది.ఇదిలా ఉండగా, ఎన్‌టీఏ పనితీరుపై కేంద్ర ప్రభుత్వం సమగ్ర సమీక్ష నిర్వహిస్తున్నట్లు సమాచారం. పరీక్షల నిర్వహణలో ఉన్న అన్ని లోపాలను గుర్తించి, వాటిని నెల రోజుల్లో సరిదిద్దే కార్యాచరణ చేపట్టనున్నట్లు తెలుస్తోంది. నీట్ యూజీ-2026 ప్రశ్నపత్రం లీక్ వివాదం నేపథ్యంలో కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేసే అవకాశం లేదని ప్రభుత్వ వర్గాలు స్పష్టం చేస్తున్నాయి.కాగా, నీట్ యూజీ-2026 పరీక్ష >>2

## పార్లమెంటులో ఐదోరోజునా ప్రతిష్టంభన

### రాజ్యసభలో ప్రవేశపెట్టిన 'వందేమాతరం' బిల్లు, విపక్షాల నిరసన 2లో



# ముందు ముందు ఎఐ టీచర్ వస్తున్నారు..

### డ్రగ్స్ రహిత సమాజానికి ప్రతి ఒక్కరు కృషి చేయలి

### లీప్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోండి: మంత్రి లోకేష్

**పోలవరం జిల్లా ప్రతినిధి, జులై 24 ప్రభాతవార్త:** రాష్ట్రంలో ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలను తీర్చిదిద్దుతున్నట్టు రాష్ట్ర విద్య ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ ప్రకటించారు. పోలవరం జిల్లా (రంపచోడవరం)లో శుక్రవారం నిర్వహించిన పిటిఎం కార్యక్రమానికి మంత్రి నారా లోకేష్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యావ్యవస్థలో సమూల మార్పులకు శ్రీకారం చుట్టి, ప్రైవేటు పాఠశాలల నుంచి విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలలకు క్యూ కట్టేలా చర్యలకు శ్రీకారం చుట్టినట్టు ఆయన ప్రకటించారు.ఈ విద్యా సంవత్సరంలో వివిధ ప్రైవేటు పాఠశాల నుంచి 1,10,000 మంది విద్యార్థినీ విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లో అదనంగా చేరినట్లు ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. పోలవరం జిల్లాలో వివిధ మారుమూల గ్రామాల్లో 200 పాఠశాలలకు శాశ్వత భవనాలను నిర్మించి, పాఠశాలల్లో మౌలిక సౌకర్యాలను అభివృద్ధి చేస్తామని ఈ సందర్భంగా ఆయన ప్రకటించారు. తల్లికి వందనం ద్వారా విద్యార్థులు వారి తల్లిదండ్రులకు ప్రభుత్వ విద్య పట్ల జోష్ నింపినట్టు ఆయన ప్రకటించారు. మెగా డీఎస్సీ ద్వారా 16 వేల ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేశామని, మళ్ళీ డి ఎస్ సి నిర్వహించి 3వేల ఉపాధ్యాయుల పోస్టులు భర్తీ చేస్తామని ఆయన ప్రకటించారు. విద్యార్థులకు పలు ప్రశ్నలను స్పందించి భవిష్యత్తులో కలెక్టర్, ఐపీఎస్ ఇంజనీర్,టీచర్ ఇలా విద్యార్థుల మక్కువను బట్టి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ప్రోత్సహిం >>2

# సర్కారీ బడులకు రాజయోగం

### యేడాదిలో ప్రైవేటు స్కూళ్ల నుంచి వచ్చి చేరిన 1.10లక్షల మంది విద్యార్థులు

### హాస్టళ్లు, గురుకులాల్లో డైట్ ఛార్జీలు 10శాతం పెంపు, గిరిజన విద్యార్థులకు ఐఐటి కోచింగ్

### పోలవరం జిల్లాను రాష్ట్రంలో నం.1 చేస్తా: మెగాపేరెంట్స్, టీచర్స్ మీటింగ్‌లో సిఎం చంద్రబాబు

**పోలవరం జిల్లా ప్రతినిధి,జులై 24 ప్రభాత వార్త:** పోలవరం జిల్లాను రాష్ట్రంలో నెంబర్ 1 జిల్లాగా అభివృద్ధి చేస్తామని, రాష్ట్ర ముఖ్య మంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రకటించారు. అల్లూరి సీతా రామరాజు నాదయాడిన ఈ నేల భారత స్వాతంత్రోద్యమములో ఒక మైలు రాయి అని, అందుకే ఈ ప్రాంతం పై ప్రత్యేక దృష్టి సారించి రాష్ట్రంలోనే నెంబర్ వన్ జిల్లాగా అభివృద్ధి చేస్తామని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు హామీ ఇచ్చారు. శుక్రవారం పోలవరం జిల్లా పర్యాటనకు వచ్చిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు హెలిప్యాడ్ వద్ద రంపచోడవరం యం. ఎల్ ఏ.మిరియాల శిరీష దేవి, జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్ స్వాగతం పలికారు.అక్కడ నుండి నేరుగా రంపచోడవరం జిల్లా పరిషత్ పాఠశాల వద్దకు చేరుకున్న ముఖ్య మంత్రికి విద్యార్థులు, వారి తల్లి దండ్రులు, ఉపాధ్యాయులు ఘనస్వాగతం పలికారు. పాఠశాల ఆవరణలో ఉన్న తెలుగుతల్లి విగ్రహానికి, అల్లూరి సీతా రామరాజు విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో సమావేశం అయిన ముఖ్యమంత్రి చంద్రబాబు,



శుక్రవారం రంపచోడవరం జిల్లా పరిషత్ పాఠశాలలో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న సిఎం చంద్రబాబు, సభకు హాజరైన విద్యార్థులు, తల్లిదండ్రులు

మంత్రి లోకేష్ విద్యార్థుల చదువు, విద్యాబోధన్, మధ్యాన భోజనం, మొక్కల పెంపకం వంటి అంశాలను చర్చించారు. ప్రభుత్వం అందిస్తున్న తల్లికి వందనం డబ్బులు ఖాతాల్లో జమా అయింది లేనిది అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు నాటి సంరక్షి స్తున్న మొక్కలను పరిశీలించి చిన్నారులను అభినందించారు. ఈ సం దర్భంగా జరిగిన కార్యక్రమములో సిఎం మాట్లాడుతూ గిరిజన ప్రాంతాల విద్యార్థులు మట్టిలో మాణిక్యాలని, అవకాశాలు కల్పిస్తే అద్భుతాలు >>2

# 8 కొత్త డ్రై పోర్టులకు ఓకే

### శ్రీసిటీ, చిట్యాల సహా 9 ప్రతిపాదనలపై కేంద్రం పరిశీలన

**విజయవాడ, జులై24,ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక ప్రగతి, ఎగుమతి లాజిస్టిక్స్ మౌలిక సదుపాయాల కల్పనపై విజయవాడ పార్లమెంట్ సభ్యులు (ఎంపీ) శ్రీ కేశినేని శివనాథ్ (చిన్ని) పార్లమెంట్‌లో ప్రశ్నించారు. దేశవ్యాప్తంగా ఇన్‌ల్యాండ్ కంటైనర్ డిపోలు కంటైనర్ ఫ్రైట్ స్టేషన్ల సాధారణంగా డ్రై పోర్టులు (పొడి రేవులు) అని పిలిచే అంతర్గత రేవుల విస్తరణ, వాటి మంజూరు ప్రమాణాలపై ఎంపీ శ్రీ కేశినేని శివనాథ్ ఈరోజు లోక్‌సభలో అడిగిన ప్రశ్నకు కేంద్ర ఓడరేవులు, నౌకాయానం మరియు జలమార్గాల శాఖ మంత్రి శర్బానంద సోనోవాల్ ఎంతో సానుకూలమైన లిఖితపూర్వక సమాధానాన్ని ఇచ్చారు. ఎంపీ కేశినేని శివనాథ్ అడిగిన ప్రశ్నల ఆధారంగా, దేశవ్యాప్తంగా కస్టమ్స్ (దిఠీది) అంతర్ మంత్రిత్వకమిటీ 8కొత్త డ్రై పోర్టుల ప్రతిపాదనలకు అధికారికంగా ఆమోదం



కేశినేని శివనాథ్

తెలి పిందని, మరో 9 నూతన ప్రతిపాదనలను కేంద్ర ప్రభుత్వం చురుగ్గా పరిశీలిస్తోందని కేంద్ర మంత్రి సభకు వివరించారు. ఎంపీ కేశినేని శివనాథ్ తెలుగు రాష్ట్రాల పారిశ్రామిక అవసరాలను దృష్టిలో ఉంచుకుని లేవనెత్తిన ఈ ప్రశ్న ద్వారా కేంద్ర భవిష్యత్తు ప్రణాళికలు వెలుగులోకి వచ్చాయి. తెలంగాణలోని ఫతేపూర్ డ్రై పోర్టు ప్రాజెక్టుకు కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే అధికారికంగా ఆమోద ముద్రవేసింది. ఆంధ్రప్రదేశ్ ఆర్థిక రంగానికి అత్యంత కీలకమైన శ్రీసిటీ (ఆంధ్ర ప్రదేశ్) ప్రతిపాదనతో పాటు చిట్యాల (తెలంగాణ) డ్రై పోర్టు ప్రతిపాదనలు ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వ చురుకైన పరిశీలన మరియు మూల్యాంకనంలో ఉన్నాయని మంత్రి తెలిపారు.

**నిబంధనల సడలింపు జోనింగ్ విధానం:** కొత్త డ్రై పోర్టుల ఏర్పాటుకు >>2



## ఎఎంసి వైద్య విద్యార్థి ఆత్మహత్య

**విశాఖపట్నం, జులై 24 ప్రభాతవార్త:** ఆంధ్రా వైద్య కళాశాలలో మొదటి సంవత్సరం ఫొరెన్సిక్ మెడిసిన్ చదువుతున్న పోస్ట్ గ్రాడ్యుయేట్ వైద్య విద్యార్థి కాశీ మళ్ల ఠాకూర్ నాథ్ (30) పీజీ హాస్టల్‌లో శుక్రవారం మధ్యాహ్నం ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడినట్లు వన్ టౌన్ పోలీస్‌లు తెలిపారు. విజయవాడ పడమటకు చెందిన హైకోర్టు న్యాయ వాది కుమారుడు ఠాకూర్‌నాథ్ ఈఏడాది ఫిబ్రవరిలో ఫస్ట్ ఇయర్ ఫొరెన్సిక్ పీజీలో చేరారు.లోగడ సిద్దార్ధ మెడికల్ కాలేజీలో యంబీబీయస్ చదువుతున్నప్పటి నుంచి ఠాకూర్ నాథ్ మానసిక అనారోగ్యంతో బాధ పడుతూ మందులు వాడుతూ >>2

## అమరావతి నిర్మాణం వేగంగా జరపండి

### కేంద్రమంత్రి పెమ్మసాని

**విజయవాడ.జూలై 24,ప్రభాతవార్తప్రతినిధి:** కేంద్ర కమ్యూనికేషన్స్ గ్రామీణాభివృద్ధి శాఖ సహాయ మంత్రి డా. పెమ్మసాని చంద్రశేఖర్, కేంద్ర ప్రజా నిర్మాణ శాఖ చీఫ్ ఇంజనీర్ సి.ఎన్. సురేష్, సూపరింటెండింగ్ ఇంజనీర్ శ్రీనివాస్ మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా అమరావతిలో పైప్‌లైన్‌లో ఉన్న కేంద్ర ప్రభుత్వ నిర్మాణ పనుల పురోగతి, టెండర్ల ప్రక్రియ, నిర్మాణ పనుల కార్యాచరణపై విస్తృతంగా చర్చించారు. అమరావతిలో నిర్మించనున్న సెంట్రల్ గవర్నమెంట్ జనరల్ పూల్ ఆఫీస్ అకమోడేషన్ ప్రాజెక్టుకు రూ.1,299.08 కోట్ల అంచనా వ్యయంతో రాయపూడి గ్రామంలో 5.53 ఎకరాల విస్తీర్ణంలో 2,16,032 చదరపు మీటర్ల నిర్మాణం చేపట్టనున్నట్లు అధికారులు తెలిపారు. ఈ ప్రాజెక్టుకు సంబంధించిన టెండర్లను సెప్టెంబర్ మొదటి వారంలో పిలవనున్నట్లు వెల్లడించారు. ఇందులో జీ+13 అంతస్తులతో ఒక బ్లాక్, బి+10 అంతస్తులతో మరో బ్లాక్ నిర్మించనుండగా, సుమారు 8,000 మంది అధికారులు, ఉద్యోగులకు అవసరమైన కార్యాలయ వసతులు కల్పించనున్నారు.జనరల్ పూల్ రెసిడెన్షియల్ అకమోడేషన్ ప్రాజెక్టుకు రూ.1,234.91 కోట్ల అంచనా వ్యయంతో ఇనవోలు గ్రామంలో 17 ఎకరాల విస్తీర్ణంలో 2,90,762 చదరపు మీటర్ల నిర్మాణం చేపట్టనున్నట్లు అధికారులు వివరించారు. ఈ ప్రాజెక్టుకు సంబంధించిన టెండర్లను ఆగస్టు మొదటి వారంలో పిలవనున్నట్లు తెలిపారు. ఇందులో రెండు బేస్‌మెంట్‌లతో 11 టవర్లు, మొత్తం 1,504 నివాస గృహాలు నిర్మించనున్నారు. ఈ రెండు ప్రాజెక్టులను 2029 ఫిబ్రవరి నాటికి పూర్తి చేయడమే లక్ష్యంగా నిర్ణయించినట్లు తెలిపారు. అలాగే ఈ భవనాలు 4స్టార్ గ్రీన్ బిల్డింగ్ ప్రమాణాలకు అనుగుణంగా నిర్మించబడనున్నాయని పేర్కొన్నారు. అదేవిధంగా ఇందిరా గాంధీ నేషనల్ >>2

## ఎన్‌హెచ్ 42 అభివృద్ధికి కేంద్రం నుంచి రూ.679 కోట్లు: డి.సిఎం పవన్

**విజయవాడ,జులై24,ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్‌లో జాతీయ రహదారి మౌలిక వసతుల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలోని ఎన్‌హెచ్ 42 అభివృద్ధి పనుల కోసం రూ.679.71 కోట్లను కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసింది. ఈ విషయాన్ని ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఎక్స్ వేదికగా ప్రకటించారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీకి కృతజ్ఞతలు తెలిపారు.ఎన్‌హెచ్42 అప్‌గ్రేడేషన్‌కు భారీగా నిధులు కేటాయించడంతో ఏపీలో రహదారి కనెక్టివిటీ మరింత మెరుగుపడుతుందని పవన్ కల్యాణ్ పేర్కొన్నారు.

ఈ ప్రాజెక్ట్ పూర్తయిన తర్వాత ప్రయాణ సమయం తగ్గడంతో పాటు రవాణా వ్యవస్థ మరింత సమర్థవంతంగా మారుతుందని అభిప్రాయపడ్డారు.ప్రాంతీయ ఆర్థికాభివృద్ధికి కూడా ఈ ప్రాజెక్ట్ కీలకంగా మారనుందని పేర్కొన్నారు. మెరుగైన రహదారి సౌకర్యాల వల్ల పరిశ్రమలు, వ్యాపార కార్యకలాపాలు, వ్యవసాయ ఉత్పత్తుల రవాణా, పర్యాటక రంగం వేగంగా అభివృద్ధి చెందే అవకాశాలు ఉన్నాయని తెలిపారు. లక్షలాది మంది ప్రజలకు సురక్షితమైన, వేగవంతమైన ప్రయాణ సౌకర్యం అందించడమే ఈ ప్రాజెక్ట్ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు.

# ప్రధాని పర్యటనకు విస్తృత ఏర్పాట్లు

### డిజిపి హరీష్ కుమార్ గుప్తా

**విజయనగరం, జులై 24 ప్రభాతవార్త:** భోగాపురంలో నూతనంగా నిర్మించిన అల్లూరి సీతారామరాజు ఇంటర్నేషనల్ ఎయిర్ పోర్టు ప్రారంభోత్సవానికి ఆగస్టు 1న విచ్చేస్తున్న సందర్భంగా జిల్లా పోలీసుశాఖ ఏర్పాటు చేసిన భద్రత ఏర్పాట్లను రాష్ట్ర డీజీపీ హరీష్ కుమార్ గుప్తా శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధాని మోడీ పర్యటనలో భాగంగా ఏర్పాటు చేసిన ఎయిర్ పోర్టు టెర్మినల్, ట్రంపెట్, మీటింగ్ నిర్వహించే ప్రజా వేదిక, వీఐపీ వాహనాలు పార్కింగ్ చేసేందుకు ఏర్పాటు చేసిన పార్కింగ్ స్థలం, మీటింగ్ హాజరయ్యేందుకు ఇతర ప్రాంతాల నుండి వచ్చే వాహనాల పార్కింగ్ కు కేటాయించిన పార్కింగ్ స్థలాలను, సందర్శించి, ఏర్పాట్లును పరిశీలించి, సంబంధిత అధికారులకు డిజిపి పలు సూచనలు చేసారు. ప్రధాన మంత్రి పర్యటనలో ఎటువంటి అవాంఛనీయ ఇబ్బందులు తలెత్తకుండా భద్రత చర్యలు



శుక్రవారం ఏర్పాట్లను పరిశీలిస్తున్న డిజిపి హరీష్‌కుమార్ గుప్తా

చేపట్టాలన్నారు. వాహనాల రాకపోకలకు ఎటువంటి ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా వాహనాలను రెగ్యులేట్ చేసేందుకు, వాహనాలకు పార్కింగ్ స్థలాల్లో నిలిపేందుకు ప్రత్యేకంగా పోలీసు సిబ్బందిని నియమించాలన్నారు. ఇతర ప్రాంతాల నుండి వచ్చే వాహనాలను ఏ ప్రాంతంలోని పార్కింగ్ చేయాలో స్పష్టంగా మార్గ నిర్దేశం చేయాలన్నారు. ఎయిర్ పోర్టు పరిసరాలు, సభా స్థలం, పార్కింగ్ స్థలాలను మరియు ఎయిర్ పోర్టు పరిసరాల్లోని ఇతర ప్రాంతాలను క్షుణ్ణంగా యాంటీ సెబిటేజ్ తనిఖీలు చేపట్టాలన్నారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కమాండ్ కంట్రోల్, ఎస్.పి.జి. భద్రత సిబ్బందితో సమన్వయంతో పని చెయ్యాలని అధికారులను డిజిపి ఆదేశించారు. జిల్లా ఎస్పీ ఎఆర్ దామోదర్ మాట్లాడుతూ ఇతర ప్రాంతాల నుండి వచ్చే వాహనాలు పార్కింగ్ కు ప్రత్యేకంగా ఐదు పార్కింగ్ స్థలాలు ఏర్పాటు చేసినట్లు, వీటికి అదనంగా మరో 9 పార్కింగ్ స్థలాలను ఏర్పాటు చేసామని జిల్లా ఎస్పీ డిజిపికి పవర్ పాయింట్ ద్వారా వివరించారు. ప్రధాని పర్యటనకు భద్రత ఏర్పాట్లను 17 విభాగాలుగా విభజించి, భద్రత ఏర్పాట్లు చేపట్టామని, భద్రత పర్యవేక్షణకు సీనియర్ పోలీసు అధికారులను నియమిం చామన్నారు. ప్రారంభోత్సవంకు విజయనగరం, >>2

25-7pg2exHMNWJQE:25-7pg2exHMNWJQE.qxd 7/25/2026 12:34 AM Page 1



# సర్కారీ బడులకు రాజయోగం



శుక్రవారం రంపచోడవరంలో విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న సిఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేష్

>> సమూల మార్పులకు శ్రీకారం చుట్టామని అన్నారు. పాఠశాల విద్యాశాఖ రూపొందించిన 'డ్రగ్స్ వద్దు బ్రో' హ్యాండ్‌బుక్‌ను ఆయన ఆవిష్కరించారు. ఐడి కోసం డోనర్ వెబ్ పోర్టల్‌ను ప్రారంభించారు. పోర్టల్ ప్రారంభించిన వెంటనే రంపచోడవరం ఉన్నత పాఠశాల అభివృద్ధికి మీ సేవా ఆపరేటర్ పూర్వ విద్యార్థి చిట్టిబోయిన ఉదయ్ కుమార్ రూ.లక్ష విరాళాన్ని ప్రకటించారు. నెల్లూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు పారిశ్రామికవేత్త పూర్ణచంద్రరావు రూ.4 కోట్ల విరాళాన్ని ప్రకటించిన ముఖ్య మంత్రికి చెక్కును అందజేశారు.మెగా పేరెంట్-టీచర్స్ మీటింగ్ ప్రతిజ్ఞ చేయించారు. జిల్లాలో వివిధ శాఖల పనితీరును సభలో చదివి వినిపించి, చక్కటి పనితీరు కన బరిచిన అధికారులను అభినందించారు. వారికి సభిలోనే చప్పట్లు కొట్టించారు. తల్లిదండ్రులిద్దరూ పిల్లల బాధ్యత తీసుకోవాలని అన్నారు. కొత్తగా జిల్లా ఏర్పడిన తర్వాత మొదటి సారి పోలవరం జిల్లాకు వచ్చానని, అందరూ ఎంతో ఉత్సాహంగా ఉన్నారని అన్నారు. మెగా పేరెంట్-టీచర్స్ మీటింగ్‌లో పాల్గొంటూ తాను కూడా ఒక టీచర్‌గా మారానని, నేర్చుకోవడానికి విద్యార్థిగా, తల్లిదండ్రులకు చెప్పడానికి మెంటర్‌గా వ్యవహరిస్తున్నానని పేర్కొన్నారు. పిల్లల బాధ్యతను తల్లి, తండ్రి ఇద్దరూ తీసుకోవాలని, తల్లిదండ్రులిద్దరూ పిల్లల భవిష్యత్తుపై శ్రద్ధ పెడితే వారి భవిష్యత్తు ఉజ్వలంగా ఉంటుందని అన్నారు. పేరెంట్-టీచర్స్ సమావేశాలకు తల్లులతో పాటు తండ్రులు కూడా తప్పనిసరిగా హాజరు కావాలని సూచిం చారు. ప్రభుత్వ పాఠశాలలకు ప్రజల ఆదరణ పెరుగుతోందని, ప్రభుత్వ విద్యా వ్యవస్థలో మార్పులు ప్రారంభమయ్యాయని సీఎం అన్నారు. విద్యార్థుల మార్కులు తగ్గితే విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌కు మార్కులు తగ్గినట్లేనని అన్నారు. ప్రభుత్వ పాఠశాలల నుంచి ప్రైవేటు పాఠశాలలకు విద్యార్థులు వెళ్లే పరిస్థితి ఉన్నప్పటికీ, ప్రైవేటు పాఠశాలల నుంచి సుమారు 1.10 లక్షల మంది విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లో ఈ ఏడాది చేరారని తెలిపారు.

గిరిజన విద్యార్థులకు ఐటిలో కోచింగ్ అందిస్తున్నామని, గిరిజన ప్రాంతాల్లో రెసిడెన్షియల్ పాఠశాలలను మరింత పెంచుతామని తెలిపారు. హాస్టళ్లు, గురుకులాల్లో విద్యార్థుల డైట్ ఛార్జీలను 10 శాతం పెంచామని చెప్పారు. విద్యే పిల్లలకు తల్లిదండ్రులు ఇచ్చే ఆస్తి అని, విద్య ద్వారానే తెలుగు వారు ప్రపంచవ్యాప్తంగా వివిధ రంగాల్లో రాణిస్తున్నారని తెలిపారు. ఒకప్పుడు పిల్లలని భారంగా భావించే పరిస్థితి ఉండేదని, ఇప్పుడు పిల్లలే కుటుంబానికి సంపద, ఆదాయ వనరులుగా మారుతున్నారని అన్నారు. ఎక్కువ మంది పిల్లలు ఉన్న తల్లుల ఖాతాల్లో ఎక్కువ మొత్తంలో తల్లికి వందనం నిధులు జమ అవుతున్నాయని అన్నారు.ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరిస్తూ సూపర్ సిక్స్ హామీలను అమలు చేస్తున్నామని, ప్రతి నెలా మొదటి తేదీన ఎన్టీఆర్ భరోసా పింఛన్లు అందిస్తున్నామని తెలిపారు. స్త్రీశక్తి ద్వారా ఉచిత బస్సు ప్రయాణం, దీపం-2.0 ద్వారా ఉచిత గ్యాస్ సిలిండర్లు, సోలార్ విద్యుత్ వంటి కార్యక్రమాలను అమలు చేస్తున్నామని అన్నారు. ప్రజల జీవన ప్రమాణాలను పెంచడంతో పాటు ఆర్థిక అసమానతలను తగ్గించేలా చర్యలు తీసుకుంటున్నామని, సంక్షేమ పథకాలతో పాటు ప్రజలు ఆర్థికంగా స్వయం సమృద్ధి సాధించేలా పీ4 విధానాన్ని అమలు చేస్తున్నామని అన్నా రు. కార్యక్రమంలో విద్యాశాఖ మంత్రి నారా లోకేష్, రంపచోడవరం ఎమ్మెల్యే మిర్యాల శిరీష దేవి, విద్యాశాఖ కమిషనర్ కోన శశిధర్, జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్, ఎస్టీ కమిషన్ చైర్మన్ బుజ్జి రెడ్డి, విద్యార్థులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.



శుక్రవారం కుంకీ ఏనుగులకు పచ్చజెండా ఊపి పార్వతీపురం జిల్లాకు పంపిస్తున్న డి.సిఎం పవన్

### కుంకీ ఏనుగులు జయంత్, అభిమన్యుకు

## స్వాగతం పలికిన డి.సిఎం పవన్

### విజయనగరం, పార్వతీపురం జిల్లాల్లో పంట పొలాలను ధ్వంసం చేస్తున్న ఏనుగులు తరిమేందుకు 'కుంకీ'లు రంగప్రవేశం

**విజయవాడ, జులై 24,ప్రభాతవార్తప్రతినిధి:** విజయ నగరం, పార్వతీపురం మన్యం జిల్లాల్లో పంట పొలాలను ధ్వంసం చేస్తూ రైతులను భయాం దోళనలకు గురిచేస్తున్న అడవి ఏనుగుల గుంపును అదుపు చేసేందుకు అటవీశాఖ కుంకీ ఏనుగులను రంగంలోకి దించింది. ఈ నేపథ్యంలో పలమనేరు నుంచి పార్వతీపురం మన్యం జిల్లాకు బయలుదేరిన జయంత్, అభిమన్యు అనే రెండు కుంకీ ఏనుగులకు మంగళగిరిలోని తన క్యాంపు కార్యాలయం వద్ద ఉపముఖ్యమంత్రి, అటవీశాఖ మంత్రి పవన్ కల్యాణ్ ప్రత్యేకంగా స్వాగతం పలికారు.కుంకీ ఏనుగులకు పూలమాలలు వేసి, స్వయంగా చెరుకు గెడలను ఆహారంగా తిని పించిన పవన్ వాటికి వీడ్కోలు పలికారు. ఈ రెండు కుంకీ ఏనుగులను మొదట పార్వతీపురం మన్యం జిల్లాలోని గుచ్చిమి క్యాంపునకు తరలించి, అక్కడి నుంచి అడవి ఏనుగులు తిరుగుతున్న ప్రాంతాలకు తీసుకెళ్లి వాటిని నియంత్రించేందుకు అటవీ అధికారులు పక్కా ప్రణాళిక రూపకల్పన చేశారు. జయంత్, అభిమన్యులకు గతంలో కూడా ఇలాంటి క్లిష్టమైన ఆపరేషన్లు నిర్వహించిన అనుభవం ఉండటంతో అధికారులు మొదట వీటినే రంగంలోకి దించారు.ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ అధికారులకు పలు కీలక ఆదేశాలు జారీ చేశారు.

ముఖ్యంగా ఒడిశా సరిహద్దుల నుంచి ఏనుగులు రాష్ట్రంలోకి వచ్చి పం టలను నాశనం చేస్తున్నందున, ఆ రాష్ట్ర ప్రభు త్వంతో మాట్లాడి సమన్వయం చేసుకోవాలని సూచించారు. అవసరమైతే ఒడిశా నుంచి కూడా మరి కొన్ని కుంకీ ఏనుగులను రప్పించి ఏనుగుల దాడులకు శాశ్వత పరిష్కారం చూపాలని ఆదేశించారు. ఆలోగా మన వద్ద ఉన్న కుంకీలతోనే జనవాసాల్లోకి వచ్చిన ఏనుగులను వీలైనంత త్వరగా తిరిగి అడవుల్లోకి మళ్లించేలా చర్యలు వేగవంతం చేయాలని అధికారులకు స్పష్టం చేశారు.

# పార్లమెంట్‌లో ఐదో రోజూ ప్రతిష్టంభన

### రాజ్యసభలో ప్రవేశపెట్టిన 'వందేమాతరం' బిల్లు

### సోమవారానికి సభలు వాయిదా

**న్యూఢిల్లీ,జులై 24:** ప్రశ్నాపత్రం లీక్ వివాదం, కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా డిమాండ్ తదితర అంశాలపై పార్లమెంట్ ఉభయ సభల్లో శుక్రవారం వరుసగా ఐదో రోజూ తీవ్ర ప్రతిష్ఠంభన నెలకొంది. లోక్‌సభ, రాజ్యసభల్లో ప్రతిపక్ష సభ్యుల నిరసనలతో సమావేశాలు సజావుగా సాగకుండా వాయిదా పడ్డాయి.మధ్యాహ్నం 12 గంటలకు లోక్‌సభ తిరిగి సమావేశమైన సందర్భంగా పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరెన్ రిజిజు ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీని ఉద్దేశించి మాట్లాడారు. నీట్ పేపర్ లీక్ అంశంపై పార్లమెంట్‌లో చర్చ జరపడానికి ప్రభుత్వం పలుమార్లు ప్రతిపక్షంతో సంప్రదింపులు జరిపిందని తెలిపారు. ప్రతిపక్షంలోని పలువురు సభ్యులు చర్చకు సిద్ధంగా ఉన్నప్పటికీ, కాంగ్రెస్ సభ్యులను కూడా చర్చకు ఒప్పించాలని రాహుల్ గాంధీకి సూచించారు. చర్చకు ముందస్తు షరతులు విధించడం, సాకులు చెప్పడం దేశ ప్రజలకు తప్పుదోవ పట్టించే సంకేతాలను పంపుతుందని రిజిజు వ్యాఖ్యానించారు. ప్రశ్నాపత్రాల లీకేజీలను అరికట్టేందుకు కఠినమైన చట్టాన్ని తీసుకురావాలని ప్రధాని నరేంద్ర మోడీ హామీ ఇచ్చారని, నిందితులపై ఫాస్ట్‌ట్రాక్ కోర్టుల్లో విచారణ జరిగేలా చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. ఈ ప్రతిపాదిత చట్టంపై కేంద్ర మంత్రివర్గం శుక్రవారం నిర్ణయం తీసుకునే అవకాశముందని తెలిపారు. సామాజిక కార్యకర్త సోనం వాంగ్‌చుక్ తన నిరాహార దీక్షను విరమించుకున్న విషయాన్ని కూడా ప్రస్తావించారు. కాంగ్రెస్‌తో పాటు ఇతర ప్రతిపక్ష పార్టీలు ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాపై తమ డిమాండ్‌ను కొనసాగించాయి. "ఇస్తీఫా దో" అంటూ సభలో నినాదాలు చేశారు. ఈ సందర్భంగా రాహుల్ గాంధీ మాట్లాడేందుకు ప్రయత్నించగా, సభాధ్యక్ష స్థానంలో ఉన్న జగదాంబికా పాల్ ముందుగా మంత్రులు సభ పత్రాలను టేబుల్‌పై ఉంచిన అనంతరం అవకాశం ఇస్తానని చెప్పారు. అయితే ఆ తర్వాత సభను సోమవారం వరకు వాయిదా వేయడంతో రాహుల్ గాంధీకి మాట్లాడే అవకాశం లభించలేదు.గత ఐదు రోజులుగా నీట్ పేపర్ లీక్ వ్యవహారంపై ప్రతిపక్ష నిరసనల కారణంగా లోక్‌సభ సమావేశాలు పదేపదే వాయిదా పడుతున్నాయి.

## 8 కొత్త డ్రైపోర్టులకు ఓకే

>> కేంద్రం అనుసరిస్తున్న వ్యూహాత్మక మార్గదర్శకాలను మంత్రి వివరించారు. లాజిస్టిక్స్ సాంద్రత ఆధారంగా రాష్ట్రాలను మూడు జోన్‌లుగా వర్గీకరించినట్లు పేర్కొన్నారు.

**గ్రీన్ జోన్:** లాజిస్టిక్స్ విస్తరణకు అపార అవకాశాలున్న తెలంగాణ వంటి రాష్ట్రాలను గ్రీన్ జోన్‌లో చేర్చారు. ఇక్కడ సరికొత్త పరిశ్రమలను ప్రోత్సహించేందుకు డ్రై పోర్టుల కనీస విస్తీర్ణ పరిమితిని 7హెక్టార్ల నుండి 3 హెక్టార్లకు సడలిస్తూ కేంద్రం సానుకూల నిర్ణయం తీసుకుంది.

**బ్లూ జోన్:** పారిశ్రామికంగా ముందంజలో ఉన్న ఆంధ్రప్రదేశ్ ఈ జోన్‌లో ఉంది. ఇక్కడ పారిశ్రామిక డిమాండ్ ఎక్కువగా ఉండి, వసతులు తక్కువగా ఉన్న ప్రత్యేక ప్రాంతాలలో (శ్రీసిటీ వంటి పొజిషన్స్) కొత్త డ్రై పోర్టుల ఏర్పాటుకు ప్రాధాన్యత ఇస్తారు.

**దూర పరిమితి:** డ్రై పోర్టుల ఆర్థిక మనుగడను కాపాడటానికి ఒకదానికి ఒకటి 100 కిలోమీటర్ల పరిధిలో కొత్త గ్రీన్‌ఫీల్డ్ ప్రాజెక్టులను అనుమతించరు. సముద్ర ఓడరేవు నుండి 200 కిలోమీటర్లకంటే ఎక్కువ రవాణా దూరం ఉంటేనే రైల్వే అనుసంధాన ఐసీడీలకు ప్రాధాన్యత ఇస్తారు.

## రైల్వే సహాయ మంత్రి రవ్‌నీత్‌సింగ్ రాజీనామా: ఆమోదించిన రాష్ట్రపతి

**న్యూఢిల్లీ,జులై 24:** దేశ వ్యాప్తంగా కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలంటూ ఢిల్లీ వేదికగా పెద్ద ఎత్తున విద్యార్థులు ఆందోళన చేస్తుండగా అనూహ్యంగా కేంద్ర రైల్వే శాఖ సహాయ మంత్రి రవ్‌నీత్ సింగ్ బిట్టు రాజీనామా చేయడం ఆమోదించడం కూడా జరిగిపోయింది. ప్రధాని మోడీ సూచన మేరకు వెంటనే రాష్ట్రపతి ద్రౌపది ముర్ము రవ్‌నీత్ సింగ్ రాజీనామాను ఆమోదించారు. ఆకస్మిక పరిణామంలో రైల్వే శాఖ సహాయ మంత్రి రవ్‌నీత్ సింగ్ బిట్టు కేంద్ర మంత్రివర్గం నుంచి తన రాజీనామాను సమర్పించారు. రాజ్యసభ ఎంపీగా ఉన్న రవ్‌నీత్ సింగ్ పదవీకాలం జూన్‌లో ముగిసింది. మరోసారి అవకాశం దక్కలేదు. ఇదిలా ఉంటే వచ్చే ఏడాది పంజాబ్‌లో అసెంబ్లీ ఎన్నికలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో పంజాబ్‌లో పోటీ చేసేందుకు రాజీనామా చేసినట్లుగా తెలుస్తోంది. ప్రస్తుతం పంజాబ్‌లో ఆప్ అధికారంలో ఉంది. అయితే పంజాబ్‌లో అధికారంలోకి వచ్చేందుకు రవ్‌నీత్ సింగ్‌ను బీజేపీ రంగంలోకి దింపుతున్నట్లుగా తెలుస్తోంది. పంజాబ్‌లో బీజేపీ వ్యూహంలో భాగంగానే జరిగినట్లుగా సమాచారం.

## మోడీ ధన్యవాదాలు

>> నలు అందించిన ప్రతి ఒక్కరికీ ఆయన ధన్యవాదాలు తెలిపారు. ఇన్‌స్టాగ్రామ్‌లో విడుదల చేసిన తాజా వీడియోలో ప్రధాని మాట్లాడుతూ, "నిన్న రాత్రి మీతో మాట్లాడే అవకాశం లభించింది. నిన్న నేను పోస్ట్ చేసిన వీడియోకు మీరు ఇచ్చిన స్పందన ఎంతో సానుకూలంగా ఉంది. చాలా మంచి సూచనలు అందాయి. స్పందించిన ప్రతి ఒక్కరికీ నా హృదయపూర్వక ధన్యవాదాలు" అని పేర్కొన్నారు.పరీక్షల్లో పేపర్ లీకేజీలను పూర్తిగా అరికట్టేందుకు కేంద్ర ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకునే దిశగా ముందుకు సాగుతోందని, ఈ అంశంపై యువత నుంచి వచ్చిన అభిప్రాయాలు, సూచనలు ప్రభుత్వానికి మరింత దోహద పడతాయని ప్రధాని మోడీ తెలిపారు. యువత భాగస్వామ్యంతో పారదర్శకమైన, నమ్మకమైన పరీక్షా వ్యవస్థను నిర్మించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆయన సంకేతమిచ్చారు. తాను ఇన్‌స్టా విడియోలు విడుదలచేయడమే కాకుండా ప్రధాని మోడీ కేబినెట్ సమావేశంలో మంత్రివర్గ సహచరులను కూడా ఇన్‌స్టా వినియోగించుకుని యువత, జన్‌జీకి చేరువకావాలనిపిలుపునివ్వడం గమనార్హం.

## ధర్మేంద్ర ప్రధాన్‌పై నేడు నిర్ణయం!

>> కేంద్ర ఆరోగ్య మంత్రి జెపి నడ్డా, ప్రధానమంత్రి కార్యాలయ సహాయ మంత్రి జితేంద్ర సింగ్ పాల్గొనగా, సిజెపి తరఫున అధికార ప్రతినిధులు సౌరవ్ దాస్, ఆశుతోష్ రంకా హాజరయ్యారు.నీట్ యూజీ ప్రశ్నాపత్రం లీక్ అంశంపై కొనసాగుతున్న ఆందోళనల మధ్య కేంద్రం ముందుంచిన మూడు ప్రధాన డిమాండ్లలో కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామానే అత్యంత కీలకమని సిజెపి వెల్లడించింది. సమావేశం అనంతరం మీడియాతో మాట్లాడిన సిజెపి ప్రతినిధులు, మిగిలిన రెండు డిమాండ్లకు కేంద్ర ప్రభుత్వం సూత్రప్రాయంగా అంగీకారం తెలిపిందన్నారు. నీట్ పరీక్షకు సిద్ధమైన విద్యార్థుల ఆత్మహత్యలతో బాధపడుతున్న కుటుంబాలకు నష్టపరిహారం చెల్లించడం, ఆందోళనల్లో పాల్గొన్న విద్యార్థులపై నమోదు చేసిన ఎఫ్ఐఆర్‌లు, ఇతర న్యాయపరమైన కేసులను ఉపసంహరించుకోవడం వంటి అంశాలకు ప్రభుత్వం సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. సిజెపి ప్రతినిధి సౌరవ్ దాస్ మాట్లాడుతూ, "ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా డిమాండ్‌పై ప్రభుత్వం రేపు మధ్యాహ్నం వరకు గడువు కోరింది. ఆయనను త్వరలోనే పదవి నుంచి తప్పిస్తారని ఆశిస్తున్నాం. నష్టపరిహారం, విద్యార్థులపై నమోదైన కేసుల ఉపసంహరణ అంశాలకు ప్రభుత్వం సూత్రప్రాయంగా అంగీకరించింది. స్పష్టమైన నిర్ణయం వెలువడే వరకు మా ఆందోళన కొనసాగుతుందని తెలిపారు. మరోవైపు కేంద్ర మంత్రి జెపి నడ్డా మాట్లాడుతూ, దాదాపు రెండు గంటలపాటు సమావేశం జరిగినట్లు చెప్పారు. వారి నుంచి మూడు ప్రధాన డిమాండ్లు, పరీక్షల సంస్కరణలకు సంబంధించిన ఐదు సూచనలు వచ్చాయి. వాటిపై ప్రభుత్వంలో చర్చించి, రేపు మధ్యాహ్నం మరోసారి సమావేశమై మానిర్ణయాన్ని వారికి తెలియజేస్తామని వెల్లడించారు.ఇదిలా ఉండగా, ప్రభుత్వ హామీల నేపథ్యంలో సామాజిక కార్యకర్త సోనమ్ వాంగ్‌చుక్ 26 రోజులుగా కొనసాగించిన నిరాహార దీక్షను గురువారం అర్ధరాత్రి విరమించిన కొన్ని గంటలకే ఈ సమావేశం జరిగింది.కేంద్ర ప్రభుత్వం, సిజెపి మధ్య ఇది మూడో అధికారిక సమావేశం. అంతకుముందు జూలై 20న కేంద్ర మంత్రి నడ్డా నివాసంలో వరుసగా రెండు సమావేశాలు నిర్వహించగా, వాటిలో కూడా సౌరవ్ దాస్, ఆశుతోష్ రంకా పాల్గొన్నారు

## భారీ ప్రక్షాళన

>> ప్రశ్నపత్రం లీక్ అయినట్లు ఆరోపణలు రావడంతో, మే 3న నిర్వహించిన పరీక్షను మే 12న ఎన్‌టిఎ రద్దు చేసింది. అనంతరం కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ జూన్ 21న తిరిగి పరీక్ష నిర్వహిస్తామని ప్రకటించారు. ఈ వ్యవహారంతో ఎన్‌టిఎ పనితీరుపై దేశవ్యాప్తంగా తీవ్ర విమర్శలు వెల్లువెత్తగా, ఇప్పుడు సంస్థలో చేపడుతున్న భారీ సంస్కరణలు కీలకంగా మారాయి.

## పేపర్ లీక్ కేసుల్లో కఠిన శిక్షలు

**న్యూఢిల్లీ, జులై 24:** ప్రధానమంత్రి నరేంద్ర మోడీ గతంలో ఇచ్చిన హామీ మేరకు, పేపర్ లీక్‌లు, పరీక్షల అవకతవకల కేసుల్లో ఫాస్ట్‌ట్రాక్ కోర్టులను ఏర్పాటు చేయడం, కఠిన శిక్షలు విధించడం లక్ష్యంగా రూపొందించిన ఒక బిల్లుకు, దానికి సంబంధించిన నిబంధనలకు కేంద్ర కేబినెట్ శుక్రవారం ఆమోదం తెలిపింది. ప్రతిపాదిత ఈ చట్టాన్ని వచ్చే వారం పార్లమెంటులో ప్రవేశపెట్టే అవకాశం ఉందని వర్గాలు తెలిపాయి. కఠిన చర్యలకు సంబంధించిన నిబంధనలతో కూడిన బిల్లును పార్లమెంటులో ప్రవేశపెట్టనున్నట్లు గురువారం ప్రధానమంత్రి మోడీ ప్రకటించగా, మరుసటి రోజే కేబినెట్ సంబంధిత బిల్లును ఆమోదించడం విశేషం. బిల్లులో సూచించినట్లుగా, ప్రతిపాదిత ఫాస్ట్‌ట్రాక్ కోర్టులు మూడు నెలల్లోగా విచారణలను పూర్తి చేసి, తీర్పులను వెలువరించాల్సి ఉంటుందని వర్గాలు తెలిపాయి. అలాగే వ్యవస్థీకృత పేపర్ లీక్ సిండికేట్‌లకు పాల్పడిన వారికి గరిష్ఠంగా 10 సంవత్సరాల జైలు శిక్షతో పాటు రూ.10 కోట్ల వరకు జరిమానా విధించేలా నిబంధనలు తీసుకురానున్నారు.

### నీట్ పేపర్ లీక్‌కు వ్యతిరేకంగా

## విద్యాసంస్థల బంద్

**విజయవాడ,జూలై 24,ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్‌లో నీట్ పేపర్ లీక్ వివాదానికి వ్యతిరేకంగా శుక్రవారం వివిధ విద్యార్థి సంఘాలు పిలుపు మేరకు రాష్ట్రవ్యాప్తంగా విద్యాసంస్థల బంద్ జరిగింది. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ ఈ ఆందోళనలు చేపట్టారు.ఎస్ఎఫ్ఐ పీడీఎస్‌యూ , ఏఐఎస్ఏ , ఎన్ఎస్‌యూఐ, డీవైఎఫ్ఐ ఏఐవైఎఫ్ తదితర సంఘాల ఆధ్వర్యంలో ఈ బంద్ నిర్వహించారు. విజయవాడలో విద్యార్థులు లోక్‌భవన్‌ను ముట్టడించే ప్రయత్నం చేయగా పోలీసులు అడ్డుకున్నారు. గుంటూరు హిందూ ఫార్మసీ కళాశాలలో ఎస్ఎఫ్ఐ నాయకులు ధర్నా నిర్వహించారు. శ్రీకాకుళం విశాఖ,మచిలీపట్టణం, నగరం,ఏలూరు,కాకినాడ,రాజమహేంద్రవరం, గుడివాడ,విజయనగరం, తిరుపతి,ఒంగోలు, నెల్లూరు ప్రాంతాల్లో ఢిల్లీలో విద్యార్థులకు మద్దతుగా ఆందోళనలు చేపట్టారు.

## ఆత్మహత్య

>> పలుమార్లు కౌన్సిలింగ్ తీసుకునే వాడని. మందులు సక్రమంగా వడకుండా మధ్య మధ్యలో ఆపేసేవాడని సహచర వైద్య విద్యార్థులు తెలిపారు. ఏఎంసీ లో చేరిన తర్వాత కూడా విశాఖ మానసిక ఆసుపత్రి లో చికిత్స పొందుతున్నట్టు తెలిపారు గత మే నెల నుంచి ఇప్పటి వరకు రెండుసార్లు అతడు ఆత్మహత్యాయత్నంకు పాల్పడ్డాడని వారి తల్లి దండ్రులుకు తెలియజేసామని ఫారెన్సిక్ విభాగం అధిపతి డాక్టర్ వెంకట రమణతెలిపారు. శుక్రవారం ఠాకూర్ నాథ్ విధులకు హాజరు కాకపోవడంతో తన రూమ్ మేట్ డాక్టర్ సూర్య ను పీజీ హాస్టల్ కు పంపగా రూమ్ తలుపులకు గడవేసుకొని బెడ్ షీట్ తో సీలింగ్ ఫ్యాన్ కు ఉరి వేసుకో వ్రేలాడుతూ కనించే సరికి సహచర విద్యార్థుల సాయంతో తలుపు లు బద్దలు కొట్టి ఫ్యాన్ కు వేరేలాడుతున్న ఠాకూర్ నాథ్ ను క్రింద కు దించి పరీక్షించగా అప్పటికే అతడు మృతి చెందినట్టు తెలిపారు. తన గదిలో ఎవరు లేనప్పుడు సుమారుగా పదకొండు పన్నెడు గంటల ప్రాంతలో అతడు ఆత్మ హత్య కు పాల్పడినట్టు వన్ టౌన్ సీఐ వరప్రసాద్ తెలిపారు. మెడికల్ కాలేజీ ఇంచార్జి ప్రిన్సిపాల్ పిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృత దేహాన్ని పోస్టు మార్టంకు తరలిచి దర్యాప్తు చేస్తున్నట్టు సి ఐ చెప్పారు.

## ప్రధాని పర్యటనకు విస్తృత ఏర్పాట్లు

>> విశాఖపట్నం, అనకాపల్లి, అరకు, పార్వతీపురం మన్యం జిల్లాల నుండి సుమారు రెండు లక్షల మంది ప్రజలు పాల్గొనే అవకాశం ఉన్నందున క్రౌడ్ మేనేజ్మెంట్ కు ప్రత్యేకంగా చర్యలు చేపట్టినట్లుగా జిల్లా ఎస్పీ తెలిపారు. సుమారు 5 వేల మందితో బందోబస్తు ఏర్పాటు చేసినట్లుగా జిల్లా ఎస్పీ వివరించారు.

ఈ కార్యక్ర మంలో శాంతిభద్రతల అడిషనల్ డీజీ ఎన్. మధుసూదన రెడ్డి, విశాఖ కమీషనర్ శంకుబ్రత బాగ్చి, విశాఖ రేంజ్ ఐజీ గోపినాథ్ జట్టి, ఐజీ కే.శ్రీకాంత్, ఈగల్ ఐజీ ఆకె రవికృష్ణ, శాంతి భద్రతల డీఐజీ ఫకీరప్ప, రోడ్డు సేఫ్టీ డీఐజీ సిహెచ్.విజయారావు, డీజీ పర్సనల్ డీఐజీ అన్బురాజన్, గ్రేహౌండ్స్ డీఐజీ అట్టాడ బాపూజీ, విజయనగరం ఎస్పీ ఎఆర్ దామోదర్, శ్రీకాకుళం ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి, పార్వతీపురం ఎస్పీ ఎస్.వి.మాధవ రెడ్డి, అనకాపల్లి తుహీర్ సిన్హా, అదనపు ఎస్పీలు పి.సౌమ్యలత, ఎఆర్ అదనపు ఎస్పీ పి.కిరణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## పారిశ్రామిక వ్యవహారాల పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ సభ్యుడిగా ఎంపి చింతకాయల విజయ్

**విశాఖపట్నం, జులై 24 ప్రభాతవార్త:** పారిశ్రామిక వ్యవహారాల పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ సభ్యుడిగా రాజ్యసభ సభ్యులు చింతకాయల విజయ్ నియమితులయ్యారు. ఈ మేరకు రాజ్యసభ సచివాలయం అధికారిక ఉత్తర్వులు జారీ చేసింది.రాజ్యసభ నిబంధనావళిలోని రూల్ 269(1) ప్రకారం రాజ్యసభ ఛైర్మన్ ఈ నియామకాన్ని చేపట్టినట్లు సచివాలయం ప్రకటనలో తెలిపింది. 2026 జూలై 23వ తేదీ నుండి ఈ నియామకం అమలులోకి వచ్చినట్లు పేర్కొంది. దేశంలో పారిశ్రామిక రంగానికి సంబంధించి కీలకమైన విధానపరమైన నిర్ణయాలు, సమీక్షలు నిర్వహించే ఈ కమిటీలో చింతకాయల విజయ్ సభ్యుడిగా వ్యవహరించనున్నారు. కమిటీ సభ్యుల జాబితాతో పాటు అవసరమైన సమాచారాన్ని రాజ్యసభ డైరెక్టర్ నియాంగ్ ఖాన్నేమ్ గుయ్తే ఎంపీకి పంపారు.



### అమరావతి నిర్మాణం వేగంగా జరపండి

>> ఓపెన్ యూనివర్సిటీ భవన నిర్మాణం పూర్తై ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉందని అధికారులు తెలిపారు. అలాగే బ్యాంక్ ఆఫ్ బరోడా, పంజాబ్ నేషనల్ బ్యాంక్, ఐడీబీఐ బ్యాంక్, కెనరా బ్యాంక్ భవనాలను 2028 జనవరి నాటికి, నాబార్డ్, బ్యాంక్ ఆఫ్ ఇండియా నిర్మాణాలను త్వరలో ప్రారంభించి అదే గడువులో పూర్తి చేయనున్నట్లు తెలిపారు. కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ కార్యాలయం, విదేశ్ భవన్ (ప్రాంతీయ పాస్‌పోర్ట్ కార్యాలయం), న్యూ ఇండియా అష్యూరెన్స్ కంపెనీ భవనాలను 2028 జూలై నాటికి సిద్ధం చేయనున్నట్లు వివరించారు.

ఈ సందర్భంగా మంత్రి డా. పెమ్మసాని చంద్రశేఖర్ మాట్లాడుతూ, అమరావతి అభివృద్ధికి ఈ కేంద్ర ప్రభుత్వ నిర్మాణ ప్రాజెక్టులు చారిత్రాత్మకమని పేర్కొన్నారు.

## తూర్పులో పెరుగుతున్న కరోనా

**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రతినిధి,జూలై 24, ప్రభాతవార్త:** తూర్పుగోదావరి జిల్లాలో కరోనా కేసులుపెరుగుతున్నాయి. రాజమహేంద్రవరం జి జి హెచ్ లో శుక్రవారం 19 మందికి రాపిడ్ టెస్ట్ చేయగా ఒక్కరికి కూడా కోవిడ్ లక్షణాలు లేవని డీఎంహెచ్ ఓ కోమలి తెలిపారు. ఈనెల 19న ఒకటి 21న రెండు 22న మూడు 23న ఐదు చొప్పున కేసులు నమోదు అయ్యాయి. కేసులు పెరుగుతున్నందున ప్రజల అప్రమత్తంగా ఉండాలని మాస్కులు భౌతిక దూరం పాటించాలనిసూచించారు. జ్వరము దగ్గు ఒళ్ళు నొప్పులు గొంతు నొప్పి వంటి లక్షణాలు ఉంటే వెంటనే కోవిడ్ టెస్ట్ చేయించుకోవాలని కోరారు.

## వారం - వర్జ్యం

25-07-2026, శనివారం
శ్రీ పరాభవ నామ సంవత్సరం,
ఆషాఢమాసం, దక్షిణాయణం
గ్రీష్మ ఋతువు, శుక్లపక్షం, పుష్యమి కార్తె
ఏకాదశి ఉ.11.34, జ్యేష్ఠ పూర్తి
వర్జ్యం : ఉ.10.54-మ.12.42
దు.తె.5.45-ఉ.7.25
శుభసమయం : ఉ.7.00-8.00
రాహుకాలం - ఉ.9.00-10.30

## వార్తాఫలం

**మేషం:** కొన్ని విషయాలలో తొందరపాటు వద్దు. కుటుంబ సభ్యుల నుండి ప్రోత్సాహం లభిస్తుంది. సాంకేతిక విద్యావకాశాలు వస్తాయి.

**వృషభం:** ఉద్యోగులకు బదిలీల సూచన. ఆరోగ్యం పట్ల మెలుకువ అవసరం. ఆర్థికంగా చెప్పుకోదగిన ఒడిదుడుకులుండవు.

**మిథునం:** పట్టుదలతో ముందుకుసాగి పనులు చక్కబెట్టుకుంటారు. విలువైన వస్తువులు, వస్త్రాలు కొనుగోలు చేస్తారు.

**కర్కాటకం:** ప్రయాణాలలో నూతన వ్యక్తులతో పరిచయాలు పెరుగుతాయి. దైవ చింతన కలిగివుంటారు.బంధువుల కలయిక

**సింహం:** బంధువులతో ఏర్పడిన వివాదాలు పరిష్కారమవుతాయి. కోపతాపాలకు దూరంగా ఉండండి.

**కన్య :** చర్చలు, శుభకార్యాలలో ఎక్కువగా పాల్గొంటారు. సంతానంపట్ల ప్రత్యేక శ్రద్ధకనబరుస్తారు. వాహనసౌఖ్యం.

**తుల:** పెట్టుబడులు కొద్దికాలం వాయిదా వేయటం మంచిది. దూరప్రాంతాల నుండి కీలక సమాచారం అందుకుంటారు.

**వృశ్చికం:** సభలు, సమావేశాలలో పాల్గొంటారు. వృత్తిలో ఏర్పడిన వివాదాలు పరిష్కారమవుతాయి. సాహిత్యాలపై ఆసక్తి చూపుతారు.

**ధనుస్సు:** భూముల క్రయవిక్రయాలలో లాభాలు పొందుతారు. చిన్ననాటి మిత్రుల నుండి కీలక సమాచారం అందుకుంటారు.

**మకరం:** ఎదుటివారికి సైతం మీ సహాయ సహకారాలు అందిస్తారు. మీలోని ప్రతిభకు గుర్తింపు లభిస్తుంది.

**కుంభం:** అమ్మకాలు, కొనుగోలు వ్యవహారాలకు దూరంగా ఉండండి. ఎదుటి వారి మాట సావధానంగా ఆలకించండి.

**మీనం:** పొదుపు పథకాలు అవలంభిస్తారు. మీ తొందరపాటు తనంవల్ల కాంట్రాక్టులు చేజారిపోయే పరిస్థితి వుంది.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# కూటమి పరిధిలోనే 'స్థానిక' పోటీ

### యువత, మహిళల చైతన్యంతో జనసేన పార్టీ తొలి అడుగులు: మంత్రి నాదెండ్ల

**విజయవాడ,జులై24,ప్రభాతవార్తప్రతినిధి:** యువతను, మహిళలను చైతన్య పరిచేలా జనసేన పార్టీ తొలి అడుగులు వేసిందని ఆ పార్టీ రాజకీయవిభాగ సంచాలకులు , మంత్రి నాదెండ్ల మనోహర్ స్పష్టం చేసారు.తమ పార్టీలో ఎటువంటి వర్గాలుండవని ఉన్నందల్లా పవన్ గ్రూపు మాత్రమేనన్నారు. కూటమి ప్రభుత్వ ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకునే స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ పోటీ చేస్తుందన్నారు.సార్వత్రిక ఎన్నికల నాటి పొత్తులు అప్పటి పరిస్థితులను బట్టి జరిగాయన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో పొత్తులు ఆయా అంశాల ఆధారంగా ఉంటాయన్నారు.జనసేన పార్టీ బలోపేతం కోసం ఎంతోమంది పని చేస్తున్నారని అన్నారు. శుక్రవారం విజయవాడలోని తూర్పు, సెంట్రల్, పశ్చిమ నియోజకవర్గాల జనసేన నేతలు, కార్యకర్తలతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో మంత్రి పాల్గొన్నారు. 2021 స్థానిక సంస్థల ఎన్నికల్లో అప్పటి ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికలను అప్రజాస్వామిక పద్ధతిలో ఏకగ్రీవాలు చేసుకోవాలని ప్రయత్నిస్తే, ఎదురొడ్డి నిలబడిన కార్యకర్తలు జనసేనలోనే ఉన్నారన్నారు. రాష్ట్రంలో ప్రజాస్వామ్యాన్ని నిలబెట్టిన పార్టీ జనసేన అని పునరుద్ఘాటించారు. విజయవాడ జనసేన పార్టీ సమీక్ష సమావేశం శుక్రవారం ఎన్టీఆర్ జిల్లా పార్టీ అధ్యక్షులు సామినేని ఉదయభాను అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశాన్ని ఉద్దేశించి నాదెండ్ల మనోహర్ పాల్గొని, ప్రసంగించారు. కార్యకర్తలతో స్వయంగా మాట్లాడి, వారి సూచనలను విన్నారు. పార్టీ ప్రత్యేకంగా రూపొందించిన అప్లికేషన్ ఫాంను అందరికీ పంచి, వివరాలను సేకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత స్థానిక సంస్థల ఎన్నికలలో పోటీ చేయడానికి చాలా మంది భయపడ్డారని, జనసేనలో వీర మహిళలు, జన సైనికులు ధైర్యంగా నిలబడ్డారన్నారు. విజయవాడ కార్పొరేషన్‌లో 34 స్థానాల్లో నిలబడ్డారని, క్లిష్ట పరిస్థితిని ఎదుర్కొని నిలబడిన తీరు ఆదర్శమని కొనియాడారు. ఎవరూ నోరు జారవద్దని, అనవసర రాద్ధాంతాలు చేయవద్దని సూచించారు. సోషల్ మీడియాలో వచ్చే అసత్య ప్రచారాన్ని బలంగా తిప్పి కొట్టాలి. మనకు పత్రికలు, ఛానళ్లు లేవు.. కార్యకర్తలే మన మీడియా. పవన్ ఆలోచనలు ప్రజల్లోకి తీసుకువెళ్లండి అంటూ పిలుపునిచ్చారు.ఇప్పుడు పంచాయతీ రాజ్ శాఖను దేశంలోనే రెండో స్థానంలో పవన్ కల్యాణ్ నిలబెట్టారని మంత్రి తెలిపారు. విజయవాడలోని 64 డివిజన్లలో జనసేన బలోపేతం కావాలన్నారు.




## ముందు ముందు ఎఐ టీచర్ వస్తున్నారు..

>> చాలని ఈ సందర్భంగా గుర్తు చేశారు. విద్యార్థులు డ్రగ్స్ దూరంగా ఉండాలని, డ్రగ్స్ రహిత సమాజమే లక్ష్యంగా ప్రతి ఒక్కరు కృషి చేయాలనీ పిలుపునిచ్చారు. లీప్ యాప్ ను ప్రతి తల్లిదండ్రులు వారి వారి మొబైల్ ఫోన్లో డౌన్లోడ్ చేసుకోవాలని, మీ పిల్లల హాజరు, విద్య ప్రమాణాలు మీరే నేరుగా తెలుసుకోవచ్చు అని సూచించారు. భవిషత్తులో ఏ ఐ టీచర్ ను అందుబాటులో కి తెస్తామని అన్నారు. అనంతరం విద్యార్థుల చేత తల్లిదండ్రులకు పాద నమస్కారం చేయించారు. వేధికమీద తన తండ్రి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కాళ్ళకు నమస్కారించి ఆశీర్వాదం తీసుకున్నారు. కార్యక్రమం అనంతరం ముఖ్యమంత్రిచంద్రబాబు నాయుడు,రాష్ట్ర విద్య ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ విద్యా ర్థులతో కలిసి భోజనం చేశారు. చిన్నారులను ఆప్యాయంగా పలకరించి, చిన్నారుల కళ్ళలో ఆనందాన్ని నింపారు.పోలవరంజిల్లా ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేష్

# రూ.25 వేలు లంచం తీసుకుంటూ ఎసిబికి పట్టుబడ్డ దేవాదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్

## మరో ఐదు రోజుల్లో పదవీ విరమణ



**అనంతపురం క్రైమ్, జులై 24 ప్రభాతవార్త:** అనంతపురం జిల్లా దేవాదాయ శాఖ కార్యాలయంలో శుక్రవారం సాయంత్రం అవినీతి నిరోధక శాఖ అధికారులు దాడులు నిర్వహించారు. దేవాదాయ శాఖ కార్యాలయంలో అసిస్టెంట్ కమిషనర్‌గా పనిచేస్తున్న మల్లికార్జున ప్రసాద్‌ను లంచం తీసుకుంటున్న సమయంలో రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఈ సందర్భంగా ఎసిబి డిఎస్పీ ప్రసాద్ మాట్లాడుతూ పుట్లూరు మండలం రామలింగేపల్లిలో గుడి నిర్మాణం కోసం తిరుమల తిరుపతి దేవస్థానం శ్రీవాణి ట్రస్ట్ రూ.10 లక్షలు మంజూరు చేసింది. అందులో రూ.2 లక్షల మంజూరు కోసం అసిస్టెంట్ కమిషనర్ మల్లికార్జున ప్రసాద్ రూ.25 వేలు లంచం అడిగారన్నారు. ఈ మేరకు ఆలయ కమిటీ చైర్మన్ వెంకట్రామిరెడ్డి నుంచి రూ.25 వేలు లంచం తీసుకుంటుండగా రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నామన్నారు. అయితే అసిస్టెంట్ కమిషనర్ మల్లికార్జున ప్రసాద్ ఈ నెల 31న రిటైర్డ్ అవుతున్నట్లు సమాచారం ఉన్నారు. మల్లికార్జున ప్రసాద్‌పై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. నిందితున్ని కర్నూలు ఎసిబి కోర్టుకు తరలిస్తున్నట్లు వివరించారు. ఈ దాడుల్లో ఎసిబి డిఎస్పీ ప్రసాద్ రెడ్డి, సిఐ హమీద్ ఖాన్, సిబ్బంది పాల్గొన్నారు.

## జోగి రమేష్ కుటుంబీకులపై గృహహింస కేసు

**విజయవాడ, జులై 24 ప్రభాతవార్త ప్రతినిధి:** మాజీ మంత్రి జోగి రమేష్ కుటుంబ సభ్యులపై ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్‌లో పలు సెక్షన్ల కింద కేసు నమోదైంది. జోగి రమేష్ కుమారుడు జోగి రాజీవ్ భార్య మేఘన ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. కుటుంబ సభ్యుల నుంచి తనకు నిరంతరం వేధింపులు ఎదురయ్యాయని, మానసికంగా, శారీరకంగా ఇబ్బందులకు గురిచేశారని మేఘన తన ఫిర్యాదులో పేర్కొన్నట్లు సమాచారం. మేఘన ఫిర్యాదులో గృహ హింస వరకట్న వేధింపులు హత్యాయత్నం వంటి తీవ్రమైన ఆరోపణలు చేశారు. ఈ ఫిర్యాదు ఆధారంగా మాజీ మంత్రి జోగి రమేష్, జోగి రాము కుటుంబాలకు చెందిన మొత్తం 11 మంది సభ్యులపై పోలీసులు కేసు నమోదు చేశారు. కేసులో పేర్కొన్న ఆరోపణలపై అన్ని కోణాల్లో విచారణ జరుపుతున్నట్లు పోలీసులు వెల్లడించారు. ఇబ్రహీంపట్నం పిఎస్‌లో జోగి రమేష్ కుటుంబసభ్యులపై జోగి రాజీవ్ భార్య మేఘన ఫిర్యాదు చేసారు.

## రౌడీషీటర్ డిస్కో వెంకీపై పిడి యాక్ట్

**నెల్లూరు (క్రైం), జులై 24 ప్రభాతవార్త:** నెల్లూరు రూరల్ మండలం సుందరయ్య కాలనీకి చెందిన దేవళ్ల వెంకటేష్ అలియాస్ డిస్కో వెంకీపై వేదాయపాళెం పోలీస్ స్టేషన్‌లో రౌడీ షీట్ వుంది. ఓ వ్యక్తికి కత్తి చూపించి నగదు దోచుకున్న ఘటనలో డిస్కో వెంకీని గత నెల 21న వేదాయపాళెం ఇన్స్పెక్టర్ కె. శ్రీనివాసరావు అరెస్ట్ చేసారు. అప్పటి నుంచి డిస్కో వెంకి జిల్లా కేంద్ర కారాగారంలో రిమాండ్‌లో వున్నారు. జిల్లా కలెక్టర్ అనుమతితో వెంకీపై పిడి యాక్ట్ నమోదు చేసి 23న కడప కేంద్ర కారాగారానికి తరలించినట్లు ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు శుక్రవారం తెలిపారు.

### భూ పోరాట యోధుడు, సిపిఐ సీనియర్ నాయకులు

## పముజుల దశరధ రామయ్య కన్నుమూత



**నెల్లూరు(అగ్రికల్చర్), జులై 24 ప్రభాతవార్త:** ఉద్యమాలే ఊపిరిగా పేదల పక్షాన నిలిచి అనేక పోరాటాలు సాగించి తన సర్వస్వాన్ని అణగారిన వర్గాల కోసం ధారబోసిన కామ్రేడ్ పముజుల దశరథ రామయ్య శుక్రవారం కన్నుమూశారు. ఒక్కసారిగా అస్వస్థతకు గురై కారులో హాస్పటల్‌కు తరలిస్తుండగా మార్గ మధ్యంలో సాయంత్రం 6:10 నిమిషాలకు తుది శ్వాస విడిచారు. అయినా ఆయన బతికి ఉన్నాడన్న చివరి ఆశతో కుటుంబ సభ్యులు, సిపిఐ నేతలు అపోలో హాస్పిటల్‌కి తరలించారు. అక్కడి వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు ధ్రువీకరించారు. ఈ వార్త నెల్లూరు జిల్లాలో దావానలంలా వ్యాపించింది. ఆయన స్వగ్రామం సౌత్ మోపూరు శోకసంద్రంలో మునిగిపోయింది. అనేక సమస్యల పరిష్కారానికి ముందుండి నిలిచి పోరాడి నెల్లూరు రూరల్‌లో వేల ఎకరాల భూమిని, ఇళ్ల స్థలాలను పేదలకు పంచిన తమ నేత లేడన్న వాస్తవం తెలుసుకొని పేద ప్రజలు కన్నీరు మున్నీరయ్యారు. ఆయన మృతదేహం వద్దకు చేరి గ్రామస్తులు పెద్ద ఎత్తున పూలమాలలు వేసి నివాళి అర్పించారు.

## కాలువలో మునిగి ముగ్గురు బాలురు మృతి

**ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా ప్రతినిధి, జులై 24 ప్రభాతవార్త:** డాక్టర్ బిఆర్ అంబెడ్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపురం మండలం వెంకటాయపాలెంలో కాలువలో మునిగి ముగ్గురు బాలురు ప్రాణాలు కోల్పోయిన విషాద ఘటన చోటుచేసుకుంది. స్థానిక పంట కాలువలో స్నానానికి దిగిన ముగ్గురు మునిగి మృతి చెందారు.మృతులను కనికెళ్ల రంజిత్ (15), బొక్క వీరేంద్ర (19), వేమన పావని (14)గా గుర్తించారు. ఈ ఘటనతో ఆయా కుటుంబాలు శోకసంద్రంలో మునిగిపోయాయి. సమాచారం అందుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. విద్యార్థుల మృతి పట్ల కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. బాధిత కుటుంబాలను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ప్రభుత్వ పరంగా అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామని మంత్రి తెలిపారు.

## పలమనేరు నుండి విజయవాడ వరకు డ్రగ్స్ నియంత్రణపై యువకుడు సైకిల్ యాత్ర



సైకిల్‌యాత్రను ప్రారంభిస్తున్న డిఎస్పీ దేగల ప్రభాకర్

**పలమనేరు, జులై 24 ప్రభాతవార్త:** డ్రగ్స్ నియంత్రణపై ప్రజలను చైతన్య వంతులను చేయడానికి బషీర్ అనే యువకుడు పలమనేరు నుండి విజయవాడ వరకు సుమారు 700 కి.మీలు సైకిల్ యాత్ర చేపట్టాడు. శుక్రవారం ఈ యాత్రను పలమనేరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల వద్ద డిఎస్పీ దేగల ప్రభాకర్ జెండా ఊపి ప్రారంభించారు. సిఐ మోహన్‌రెడ్డి, ఎస్ఐ లోకేష్ సంఘీభావం తెలిపారు. పలమనేరుకు చెందిన బషీర్ డ్రగ్స్ నియంత్రణకు తన వంతు సహకారం అందించడానికి శ్రీకారం చుట్టాడు. ఎంతో మంది యువత మత్తు పదార్థాలకు అలవాటుపడి జీవితాలు నాశనం చేసుకుంటున్నారు. దీనిపై సైకిల్ యాత్ర ద్వారా వాడవాడలా తిరిగి ప్రజలకు అవగాహన కల్పించాలని నిర్ణయించాడు. ఈ విషయం తెలుసుకున్న డిఎస్పీ దేగల ప్రభాకర్ వెన్ను తట్టి ప్రోత్సహించారు. దీంతో బషీర్ పలమనేరు నుండి సైకిల్ యాత్ర ప్రారంభమైంది. నెల రోజుల పాటు సైకిల్ యాత్ర పూర్తి చేసి తిరిగి పలమనేరుకు చేరుకుంటాడు.





ఆషాడం సారె సమర్పించి దుర్గమ్మకి మొక్కుతున్న భక్తులు

# యేటా డిఎస్సీ... ఉపాధ్యాయ ఖాళీలన్నీ భర్తీ చేస్తాం

- విద్యావ్యవస్థ బలోపేతానికి చర్యలు
- మెగా డిఎస్సీపై వైసిపి అసత్య ప్రచారం
- మెగా పేరెంట్స్, టీచర్స్ సమావేశంలో మంత్రి గొట్టిపాటి రవికుమార్



**జె. పంగులూరు, జులై 24 ప్రభాతవార్త:** ముఖ్యమంత్రి చంద్రబాబు ఆధ్వర్యంలోని కూటమి ప్రభుత్వం విద్యా వ్యవస్థ బలోపేతానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. జె.పంగులూరు మండలం రేణింగవరం ఉన్నత పాఠశాలలో ఎంఈఓ ఎస్.కె.కాలేషావలి ఆధ్వర్యంలో మెగా పేరెంట్స్, టీచర్స్ మీటింగ్‌కి ముఖ్యఅతిథిగా మంత్రి గొట్టిపాటి రవికుమార్ హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో మంత్రి మాట్లాడుతూ రేణింగవరం ఉన్నత పాఠశాలలో 88 మంది విద్యార్థిని, విద్యార్థులకు దాతల సహాయంతో ఉచితంగా సైకిళ్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా తల్లిదండ్రులతో ప్రత్యేకంగా మాట్లాడిన మంత్రి గొట్టిపాటి విద్యా రంగ సమగ్ర అభివృద్ధికి కూటమి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను వారికి వివరించారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన ఏడాది కాలంలోనే మెగా డిఎస్సీ ద్వారా 16,000కు పైగా టీచర్ పోస్టులను భర్తీ చేశామని గుర్తు చేశారు. ప్రతి సంవత్సరం డిఎస్సీ ద్వారా మంత్రి లోకేష్ ఉపాధ్యాయ ఖాళీలను భర్తీ చేస్తూ విద్యా వ్యవస్థ బలోపేతానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. తల్లికి వందనం ద్వారా పేద విద్యార్థుల చదువులకు సుమారు రూ.8,500 కోట్లను వ్యయం చేస్తున్నది దేశంలో ఏ ఒక్క ప్రభుత్వం కూడా ఇంత పెద్ద మొత్తం ఇచ్చిన దాఖలు లేవు లేవని, ఒక్క కూటమి ప్రభుత్వంలో సిఎం చంద్రబాబుకే సాధ్యమైందన్నారు. మంత్రి లోకేష్ మెగా డిఎస్సీ ద్వారా ఉపాధ్యాయ ఖాళీలను భర్తీ చేశారన్నారు. విద్యా వ్యవస్థలో అనేక సంస్కరణలతో ప్రభుత్వ పాఠశాలలను ప్రైవేటు పాఠశాలలకు ధీటుగా అభివృద్ధి చేస్తున్నామని, అధ్యాపకులు విద్యార్థిని, విద్యార్థులను ఉత్తమ స్థాయి ఉత్తీర్ణులుగా తీర్చిదిద్దాలని మంత్రి కోరారు. విద్యార్థిని, విద్యార్థులందరూ బాగా చదవాల న్నారు. విద్యా వ్యవస్థకు నష్టం కలిగించేలా మెగా డిఎస్సీపై వైఎస్సార్ కాంగ్రెస్ నేతలు... అసత్యాలు, అబద్ధాలు ప్రచారం చేస్తున్నారని మంత్రి గొట్టిపాటి మండి పడ్డారు. దీని వలన విద్యా వ్యవస్థతో పాటు సమాజానికి నష్టం జరిగిందన్నారు. విద్యా వ్యవస్థ బలోపేతమైతే అన్ని వ్యవస్థలూ గాడిన పడతాయని ఆయన వివరించారు. ఉపాధ్యాయులు, తల్లిదండ్రులే పిల్లలను మంచి విద్యార్థులుగా, భావి భారత పౌరులుగా తీర్చిదిద్దాలని పిలుపునిచ్చారు. త్వరలోనే ఇంధన శాఖలో 630కు పైగా ఖాళీలను భర్తీ చేస్తున్నామన్నారు. దీనికి సంబంధించిన నోటిఫికేషన్ ప్రక్రియ కూడా పూర్తయిందని ఆయన తెలిపారు. చివరగా మంత్రి గొట్టిపాటి గ్రీవెన్స్ కార్యక్రమాన్ని నిర్వహించి ప్రజల పలు సమస్యల అర్జీలను స్వీకరించి సంబంధిత అధికారులకు సమస్యలను వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.

## ప్రభుత్వ పాఠశాలలను అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్తాం: మంత్రి నారాయణ



**నెల్లూరు(వైద్యం), జులై 24 ప్రభాతవార్త:** ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యతో పాటు విద్యార్థుల సమగ్ర అభివృద్ధే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తోందని పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ అన్నారు. నెల్లూరు నగరంలోని డీఎస్ఆర్ ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో శుక్రవారం నిర్వహించిన మెగా పేరెంట్‌టీచర్స్ మీట్ 4.0లో ఆయన పాల్గొన్నారు. విద్యార్థినులు, వారి తల్లిదండ్రుల వద్దకు వెళ్లి ఆత్మీయంగా మాట్లాడి పిల్లల చదువు, భవిష్యత్తు లక్ష్యాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, 2024 ఎన్నికల సమయంలో వీఆర్ పాఠశాల అభివృద్ధికి ఇచ్చిన హామీని అధికారంలోకి వచ్చిన వెంటనే నిలబెట్టుకుని అంతర్జాతీయ స్థాయిలో పునర్నిర్మించామని చెప్పారు. వీఆర్ పాఠశాలలో చదివిన ఎంతో మంది ఉన్నత స్థానాల్లో ఉన్నారని గుర్తుచేశారు. పిల్లల చదువుపై ఉపాధ్యాయులు ప్రత్యేక బాధ్యత తీసుకోవాలని సూచించిన మంత్రి, విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ విద్యా వ్యవస్థ బలోపేతంపై ప్రత్యేక దృష్టి సారించారని చెప్పారు. పేరెంట్‌టీచర్స్ మీటింగ్ ఉద్దేశం విద్యార్థుల ఆసక్తులు, సామర్థ్యాలను తల్లిదండ్రుల ద్వారా తెలుసుకుని వాటికి అనుగుణంగా ప్రోత్సహించడమేనని వివరించారు. ప్రతి పాఠశాలలో తరగతి గదులతో పాటు విద్యార్థుల ప్రతిభ, వికాసానికి అవసరమైన 18రకాల ప్రత్యేక గదులు ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. చదువుతో పాటు సంగీతం, క్రీడలు తదితర రంగాల్లో విద్యార్థులకు ఆసక్తి ఉన్న వాటిలో శిక్షణ అందిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో మేయర్ దేవరకొండ సుజాత, డిఇఓ బాలాజీ రావు, ఎంఇఓ తిరుపాల్, ప్రిన్సిపాల్ పద్మావతి, డివిజన్ టిడిపి నేతలు అనంగి ప్రసాద్, బిజెపి నేత మిడతల రమేష్, టీచర్స్, పేరెంట్స్ పాల్గొన్నారు.

## 'తల్లికి వందనం'తో పేద కుటుంబాల్లో ఆనందం నింపాం: ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి

**కోవూరు, (నెల్లూరు), జులై 24 ప్రభాతవార్త:** ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని కూటమి ప్రభుత్వం నిలబెట్టుకుంటోందని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి పేర్కొన్నారు. నియోజకవర్గంలో 34,253 మంది విద్యార్థులకు రూ.51.38 కోట్ల ఆర్థిక సాయం అందిందని అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ సంక్షేమం, అభివృద్ధికి సమాన ప్రాధాన్యం ఇస్తూ రాష్ట్రాన్ని ముందుకు తీసుకెళ్తోందని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి అన్నారు. తల్లికి వందనం పథకం అమలు, ప్రజల నుంచి వస్తున్న స్పందనపై ఆమె శుక్రవారం సాయంత్రం నెల్లూరులోని వీపీఆర్ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను అమలు చేసి వాటిని సూపర్‌హిట్‌గా మార్చామని తెలిపారు. పిల్లల చదువులకు తోడ్పాటుగా కూటమి ప్రభుత్వం ఇటీవలే రెండో ఏడాది తల్లికి వందనం పథకం కింద తల్లుల ఖాతాల్లో నగదు జమ చేసిందన్నారు. తల్లిదండ్రులు తమకు అందిన సాయంపై సంతోషం వ్యక్తం చేస్తూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకి, తనకు స్వయంగా ధన్యవాదాలు చెప్పేందుకు వస్తుండటం ఆనందంగా ఉందన్నారు. పేద కుటుంబాల్లో ఆనందం నింపుతున్న ముఖ్యమంత్రి చంద్రబాబుకి, విద్యాశాఖ మంత్రి లోకేష్‌కి ప్రజల తరఫున కృతజ్ఞతలు తెలిపారు.

### రేబలా హైస్కూల్ అభివృద్ధికి కృషి చేస్తా

**బుచ్చి (నెల్లూరు), జులై 24 ప్రభాతవార్త:** బుచ్చిరెడ్డిపాళెం మండలం రేబాలలోని జిల్లా పరిషత్ హైస్కూల్‌లో శుక్రవారం నిర్వహించిన మెగా పేరెంట్స్ టీచర్స్ మీటింగ్‌లో కోవూరు శాసనసభ్యులు రాలు వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి మాట్లాడుతూ రేబాల జడ్‌పి హైస్కూల్‌లో అసంపూర్తిగా ఉన్న గదులు త్వరలో పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. ఈకార్యక్రమంలో సీనియర్ నాయకులు కోడూరు కమలాకర్‌రెడ్డి, యగ్రంరెడ్డి గోవర్ధన్‌రెడ్డి, బుచ్చిరెడ్డి పాళెం రూరల్ బ్యాంకు చైర్మన్ ఏటూరు శివరామకృష్ణారెడ్డి, వవ్వేరు బ్యాంకు చైర్మన్ దొడ్ల విజయలక్ష్మి, ఎంపిపి మన్నెపల్లి శ్రీనివాసులు, నీటి సంఘం అధ్యక్షులు నెల్లూరు రమణారెడ్డి, నాటరరాణి ప్రసాద్, తూపిలి వెంకటరమణారెడ్డి, లఘుంతోటి మస్తానయ్య, పాఠశాల ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## 'నీట్' వివాదం సాకుతో విద్వేషాలు రెచ్చగొట్టే కుట్ర

### - బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్

**విజయవాడ, జులై 24 ప్రభాతవార్త ప్రతినిధి:** ప్రధాని మోడీ నేతృత్వంలో కేంద్ర ప్రభుత్వం యువత భవిష్యత్తును పరమావధిగా చేసుకుని పనిచేస్తోందని బిజెపి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షుడు పివిఎన్ మాధవ్ స్పష్టం చేశారు. గతంలో ఎన్నడూ లేని విధంగా విద్యా రంగంలో మోడీ ప్రభుత్వం విప్లవాత్మక సంస్కరణలు తీసుకువచ్చిందని, దేశవ్యాప్తంగా ఐఐటిలు, ఐఐఎంలు, గిరిజన విశ్వవిద్యాలయాలను నెలకొల్పడంతో పాటు మెడికల్ సీట్లను భారీగా పెంచిందని వివరించారు. గత ప్రభుత్వాల హయాంతో పోలిస్తే తమ పాలనలోనే విద్యా పేపర్ లీకేజీలు గణనీయంగా తగ్గాయని, నీట్ వ్యవహారంలో సమస్య వెలుగుచూడగానే కేంద్రం తక్షణమే కఠిన చర్యలు తీసుకుందని తెలిపారు.

నీట్ వివాదాన్ని సాకుగా చూపి కొందరు విపక్ష నేతలు ఢిల్లీ వేదికగా మత విద్వేషాలను రెచ్చగొట్టేందుకు కుట్రలు చేస్తున్నారని ఆయన ఆరోపించారు. నీట్ సాకుతో ప్రధానితో పాటు అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టుపై అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నారని, నటుడు ప్రకాశ్‌రాజ్ సహా కొందరు విద్రోహకర, దేశ వ్యతిరేక వ్యాఖ్యలకు పాల్పడటం దారుణమని ఆగ్రహం వ్యక్తం చేశారు.

కొన్ని విద్యా సంఘాలు విద్యార్థుల ప్రయోజనాలను పక్కనబెట్టి వారి భవిష్యత్తును నాశనం చేసేలా వ్యవహరిస్తున్నాయని విమర్శించారు. కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీకి దమ్ముంటే తమ సొంత పాలనలో జరిగిన పేపర్ లీకేజీలపై పార్లమెంట్‌లో మాట్లాడాలని, సభలో చర్చల్లో పాల్గొనే ధైర్యం లేకనే ఆయన దాటవేత ధోరణి ప్రదర్శిస్తున్నారని బిజెపి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షుడు పివిఎన్ మాధవ్ సవాల్ విసిరారు.

## అమరావతి ఎన్‌జిఒ టవర్స్ నిర్మాణ పనుల్లో కీలక అడుగు

**విజయవాడ, జులై 24 ప్రభాతవార్త ప్రతినిధి:** రాజధాని అమరావతిలో నాన్ గెజిటెడ్ ఆఫీసర్స్ (ఎన్‌జీఓ) టవర్స్ నిర్మాణ పనుల విషయంలో మరో కీలక అడుగు పడింది. నాన్ గెజిటెడ్ ఆఫీసర్స్ టవర్స్ తుది దశ నిర్మాణ పనుల కోసం రూ. 83.99 కోట్ల విలువైన కాంట్రాక్టును ఎల్ అండ్ టీ సంస్థకు అమరావతి ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అండ్ గ్రీన్‌ఫీల్డ్ సిటీస్ లిమిటెడ్ అందజేసింది. శుక్రవారం రాయపూడిలోని సీఆర్డీఏ కార్యాలయంలో ఎల్ అండ్ టీ సంస్థకు ఎల్ఓఏను ఎజిఐసిఎల్ ఎండీ అభిషేక్ కుమార్ అందజేశారు. టెండర్ ప్రక్రియలో ఎల్ 1 బిడ్డర్‌గా నిలిచిన ఎల్ అండ్ టీకి ఈ పనులను అప్పగించారు. ఈ ఒప్పందం ప్రకారం ఎన్‌జీఓ టవర్స్‌లో మిగిలిన తుది దశ పనులను ఈ సంస్థ పూర్తి చేయనుంది. ముఖ్యంగా భవనాల అంతర్గత పనులతోపాటు ఫినిషింగ్ పనులు, మురుగునీటి శుద్ధి కేంద్రాల నిర్మాణం, కాంపౌండ్ వాల్స్, అంతర్గత మౌలిక వసతులతోపాటు ఇతర అనుబంధ పనుల నిర్మాణం చేపట్టనుంది.రాజధాని అమరావతిలో ప్రభుత్వ కాంప్లెక్స్‌తోపాటు వివిధ నిర్మాణ పనులు వేగంగా కొనసాగుతున్నాయి. కూటమి ప్రభుత్వం కొలువుదీరిన తర్వాత ఈ నిర్మాణ పనుల వేగం ఊపందుకుంది. ఎన్‌జీఓ టవర్స్ నిర్మాణాన్ని కూడా త్వరితగతిన పూర్తి చేసి ఉద్యోగులకు అందుబాటులోకి తీసుకురావాలని ప్రభుత్వం లక్ష్యంగా నిర్దేశించుకుంది.

## ఎస్వీయూలో న్యూట్రి-టెక్ అంతర్జాతీయ సదస్సు

**తిరుపతి (విద్య), జులై 24 ప్రభాతవార్త:** శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం హోమ్ సైన్స్ విభాగం, రూసా-2.0 సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ సంయుక్త ఆధ్వర్యంలో న్యూట్రి-టెక్-2026, ప్రిసిషన్ న్యూట్రిషన్ అండ్ స్మార్ట్ అండ్ సస్టైనబుల్ ఫుడ్ టెక్నాలజీస్ ఫర్ గ్లోబల్ హెల్త్ అంశంపై రెండు రోజుల అంతర్జాతీయ సదస్సు శుక్రవారం ఎస్వీయూ సెనేట్ హాల్‌లో ప్రారంభమైంది. ఉపకులపతి ఆచార్య టాటా నరసింగ రావు సదస్సును ప్రారంభించి మాట్లాడుతూ, వ్యవసాయం, ఆరోగ్యం, సాంకేతికత, సుస్థిర అభివృద్ధి వంటి రంగాలను అనుసంధానించడంలో ఆహార శాస్త్రం కీలక పాత్ర పోషిస్తోందన్నారు. ప్రపంచ ఆరోగ్య సవాళ్లను ఎదుర్కొనే పరిశోధనలకు ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. రెక్టార్ ఆచార్య సి.హెచ్. అప్పారావు మాట్లాడుతూ, ప్రజలకు సురక్షి త మైన, నాణ్యమైన ఆహారం అందించేందుకు ఆహార కల్తీ, కాలుష్య నివారణపై శాస్త్రవేత్తలు మరింత దృష్టి సారించాలని సూచించారు. ఆహార భద్రతలో ఆధునిక సాంకేతికత పాత్ర కీలకమని చెప్పారు. సదస్సు కన్వీనర్, హోమ్ సైన్స్ విభాగాధిపతి ఆచార్య కె.వి.సుచరిత మాట్లాడుతూ, ప్రపంచం సాధారణ పోషకాహార విధానాల నుంచి ప్రిసిషన్ న్యూట్రిషన్ వైపు అడుగులు వేస్తోందన్నారు. వ్యక్తిగత ఆరోగ్య అవసరాలకు అనుగుణంగా స్మార్ట్ ఫుడ్ టెక్నాలజీల అభివృద్ధి అవసరమని వివరించారు. జాతీయ పోషకాహార సంస్థకు చెందిన డా. జి. సుబ్బారావు అల్ట్రా ప్రాసెస్డ్ ఆహారాల వల్ల పెరుగుతున్న అంటు వ్యాధేతర వ్యాధులపై ప్రసంగించగా, సిఎఫ్‌టిఆర్ఐ శాస్త్రవేత్త డా.రాజగోపాల్ సాంప్రదాయ ఆహారాల ప్రాధాన్యాన్ని వివరించారు. ప్రధానోపన్యాసకు రాలు డా. లావణ్య పేగు చిన్న జీవ వ్యవస్థ ఆరోగ్యంపై పాలీఫినాల్స్ ప్రభావాన్ని వివరించారు.

రెండు రోజుల సదస్సులో స్మార్ట్ ఫుడ్ టెక్నాలజీలు, సుస్థిర ఆహార వ్యవస్థలు, ప్రిసిషన్ న్యూట్రిషన్, ప్రపంచ ఆరోగ్యానికి వినూత్న ఆవిష్కరణలపై జాతీయ, అంతర్జా తీయ నిపుణుల ఉపన్యాసాలు, సాంకేతిక సమావేశాలు, పరిశోధనా పత్రాల సమర్పణలు జరగనున్నాయి. మొత్తం 66 మౌఖిక పరిశోధనా పత్రాలు, 22 పోస్టర్ ప్రజెంటేషన్లు ప్రదర్శించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

## ఆషాఢం సారె తెచ్చిన భక్తులతో ఇంద్రకీలాద్రి రద్దీ

**ఇంద్రకీలాద్రి, జులై 24 ప్రభాతవార్త:** దుర్గమ్మకి ఆషాఢం సారె తెచ్చిన భక్తజనంతో ఆలయంలో రద్దీ నెలకొంది. శ్రీ కనకదుర్గమ్మని ఇంటి ఇలవేల్పుగా, ఆడపడుచుగా భావిస్తూ పసుపు, కుంకుమలు, గాజులు, చీర, సారెలతో ఇంద్ర కీలాద్రికి 10వ రోజు శుక్రవారం సాయంత్రం 5 గంటల వరకు 42 సారె బృందాలకు చెందిన 16890 మంది భక్తులు సారె సమర్పణ చేశారు.

దుర్గమ్మ దర్శనానంతరం 6వ అంతస్తులోని శ్రీ అమ్మవార్లకు సారెను సమర్పించి పూజాధికాలు నిర్వహించారు. భవానీ అనుగ్రహ దర్శన్ రూ.100లు క్యూ లైన్ దర్శనం సారె భక్తులకు కేటాయించారు.

**వేదవిద్య విద్యార్థులకు ధ్రువపత్రాలు:** బెజవాడ దుర్గమ్మ ఆలయ నిర్వహణలోని పోరంకి వేదపాఠశాలలో వేదవిద్యనభ్యసించి విజయవంతంగా పూర్తిచేసుకున్న విద్యార్థులకు చైర్మన్ బొర్రా రాధాకృష్ణ, ఇఓ వికె శీనా నాయక్ శుక్రవారం ధ్రువపత్రాలు అందించారు. ఈ కార్యక్రమంలో స్థానాచార్య వి శివప్రసాద్ శర్మ, ముఖ్య అర్చకులు శ్రీనివాసశాస్త్రి, వేదపాఠశాల అధ్యాపక బృందం పాల్గొన్నారు.

## కోనలో నృసింహ స్వామికి తిరుప్పావడ సేవ



**రాపూరు (నెల్లూరు), జులై 24 ప్రభాతవార్త:** ప్రముఖ పుణ్యక్షేత్రమైన పెంచలకోనలో శ్రీ పెనుశిల లక్ష్మీనృసింహ స్వామి వారికి శుక్రవారం అన్నకూటోత్సవం (తిరుప్పావడ సేవ) శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉదయం 5 గంటలకు శ్రీ ఆదిలక్ష్మీ అమ్మవారికి అభిషేకం, 9 గంటలకు స్వామి వారి సన్నిధిలో ఆలయ ప్రధానార్చకులు, వేదపండితుల మంత్రోచ్ఛరణల మధ్య, మంగళవాయిద్యాల నడుమ శాస్త్రోక్తంగా తిరుప్పావడ సేవ నిర్వహించారు. భక్తుల తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు చేయించుకున్నారు.

## కన్నుల పండువగా అర్జున తపస్సు



అర్జున తపస్సుకు హాజరైన జనం

**శ్రీకాళహస్తి, జులై 24 ప్రభాతవార్త:** శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా నిర్వహిస్తున్న ద్రౌపదీ సమేత ధర్మరాజుల స్వామి తిరునాళ్ళలో ప్రధాన ఉత్సవాలు శుక్రవారం నుంచి ప్రారంభమయ్యాయి. సాయంత్రం అర్జున తపస్సు కార్యక్రమాలు కన్నుల పండువగా జరిగింది. ఆలయంలో అర్జునుని చక్కగా అలంకరించారు. ఏర్పాట్లను ఇఓ బికె వెంకటేశులు స్వతహాగా పర్యవేక్షించారు. ఉత్సవాలు నుంచి ఊరేగింపు వరకు అలంకారాలను ఆయనే దగ్గరుండి పర్యవేక్షిస్తున్నారు. అర్జున తపస్సు సందర్భంగా ఆలయంలో అర్జుని ఉత్సవ మూర్తికి చక్కగా అలంకారం జరిపారు. అలంకారాల్లో సిద్ధహస్తులైన రాజేష్‌గురుకుల్ పర్యవేక్షించారు. ఆలయం నుంచి ఊరేగింపు జరిపారు. ఆలయ ఆవరణలో తాటి చెట్టును ఏర్పాటు చేసారు. ఇక్కడ విశేష పూజలు జరిపారు. గుమ్మడికాయను కొట్టి కర్పూర హారతులిచ్చి అర్జునుడు పాశుపతాస్త్రాన్ని చేసిన తపస్సును నిర్వహించారు. అర్జున్ పాత్రధారి నాగేశ్వరరావు, శివుడుగా అశోక్, పార్వతి దేవిగా కృష్ణమూర్తి చక్కగా అభినయించారు. తాటిమొక్కపై నుంచి విసిరే నిమ్మకాయలతో సంతాన ప్రాప్తి కలుగుతుందనే నమ్మకం ఉండటంతో జనం ఎగబడ్డారు. కార్యక్రమాల నిర్వహణలో ఈ ఏడాది ఇఓ బికె వెంకటేశు, డిప్యూటి ఇఓ ఎన్ఆర్ కృష్ణారెడ్డి, చిన్న ఆలయాల ఇన్‌చార్జి లక్ష్మయ్య, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ సుబ్రమణ్యం, ఇన్‌చార్జి దుర్గా ప్రసాద్‌లు దగ్గరుండి పర్యవేక్షించారు. ఈ కార్యక్రమాల్లో ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి, చైర్మన్ కొట్టె సాయిప్రసాద్, సభ్యుడు గుర్రప్పశెట్టి, మహాలక్ష్మమ్మ, తదితరులు పాల్గొన్నారు.

## గోసంరక్షణకు హైదరాబాదువాసుల విరాళం



**శ్రీకాళహస్తి, జులై 24 ప్ర భా త వా ర్త:** శ్రీకాళహస్తీశ్వరాలయంలో నిర్వహిస్తున్న వివిధ పథకాలకు భక్తుల నుంచి విరాళాలు అందుతున్నాయి. ఈ నేపథ్యంలో శుక్రవారం గోసంరక్షణకి హైదరాబాదు వాసులు కోడాలి వెంకటేశ్వరరావు రూ.1,01,516లు విరాళంగా అందించారు. కుటుంబ సభ్యులతో శ్రీకాళహస్తీశ్వరుని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమాల్లో ఆలయ ఇఓ బికె వెంకటేశులు, బోర్డు సభ్యులు వాకచర్ల గుర్రప్పశెట్టి, పి.హేమావతి, కడప శ్రీను పాల్గొన్నారు. విరాళం అందించిన కొడాలి వెంకటేశ్వరరావుకు ఆలయంలో వేదపండితులతో ప్రత్యేకాశీర్వచనాలు అందించారు. స్వామి అమ్మవార్ల అంతరాలయ దర్శనం ఏర్పాటు చేసారు.

## విజయవాడలో ఎంఎస్ఎంఇ కాన్‌క్లేవ్

**విజయవాడ, జులై 24 ప్రభాతవార్త:** యువపారి శ్రామికవేత్తలను ప్రోత్సహించాలనే లక్ష్యంతో బిఎన్ఐ ఆధ్వర్యంలో విజయవాడలో యంఎస్‌యంఈ ఎక్స్‌పో కాన్‌క్లేవ్ శుక్రవారం ఎన్‌టిఆర్‌జిల్లా కలెక్టర్ లక్ష్మీశా, విజయవాడ తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ ప్రారంభించారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన వివిధ పరిశ్రమల స్టాళ్ళను అతిథులు స్టాళ్ళను పరిశీలించి ఉత్పత్తుల తయారీ విధానం, బ్రాండింగ్, ప్యాకింగ్, మార్కెటింగ్, వ్యాపార విస్తరణ అవకాశాలను అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా కలెక్టర్ లక్ష్మీశా మాట్లాడుతూ వివిధ కంపెనీలు తయారు చేసిన యంత్రాలు, సాంకేతిక పరిజ్ఞానం, వ్యాపార నమూనాలు ఒకే వేదికపై అందుబాటులో ఉండటంతో పరిశ్రమలు స్థాపించాలనుకునే యువతకు అవసరమైన సమాచారం సులభంగా లభిస్తుందన్నారు. ఎక్స్‌పో చైర్మన్ త్రినాధ్ నందూరి, డిఆర్‌డిఏ ప్రాజెక్టు డైరెక్టర్ నాంచారరావు, బిఎన్ఐ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు జె.దేశాయ్, విశాల్ దేశాయ్, తదితరులు పాల్గొన్నారు.

## ఉమ్మడి కృష్ణాలో సజావుగా రిజిస్ట్రేషన్‌లు

**విజయవాడ, జులై 24 ప్రభాతవార్త:** ఉమ్మడి కృష్ణా జిల్లాలోని అన్ని సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లోనూ రిజిస్ట్రేషన్ సేవలు యథావిధిగా అందుతున్నాయని రాష్ట్ర రిజిస్ట్రేషన్ స్టాంపుల శాఖ విజయవాడ డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ జనరల్ కె.రామారావు తెలిపారు. ప్రజలకు ఏవిధమైన అసౌకర్యం కలుగకుండా పెండింగ్‌లో ఉన్న దస్తావేజుల నమోదును త్వరితగతిన పూర్తిచేసేందుకు చర్యలు తీసుకున్నట్లు చెప్పారు. నాలుగురోజులుగా పెండింగ్‌లో ఉన్న దస్తావేజులను నమోదు చేసేందుకు శుక్రవారం రాత్రి 9గంటల వరకు అన్ని సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల పనివేళలను పొడిగించినట్లు తెలిపారు.

పంజాబ్ నేషనల్ బ్యాంక్
... విశ్వాసానికి మరో పేరు !
(భారత ప్రభుత్వ రంగ సంస్థ)
డి.నెం.9-13-45/2/8/1, 8వ అంతస్తు, ఎమ్‌విఆర్ వినాయగర్ ట్రేడ్ సెంటర్, సిబిఎమ్ కాంపౌండ్, విఐపి రోడ్డు, విశాఖపట్నం-530003.

ప్రకటన

పంజాబ్ నేషనల్‌బ్యాంక్ యొక్క గౌరవనీయ కస్టమర్లకి తెలియజేయునది ఏమనగా!!!
ప్రియమైన ఖాతాదారులారా!
ఆర్‌బిఐ నిబంధనల ప్రకారము కస్టమర్లందరికీ సమయానుసారంగా కెవైసి అప్‌డేషన్ తప్పనిసరి. మీ ఖాతాకు కెవైసి అప్‌డేషన్ గడువు 30.06.2026, నాటికి ముగిసిపోయి ఉంటే మీరు PNB One/ఇంటర్నెట్ బ్యాంకింగ్/రిజిస్టర్ ఇ-మెయిల్/పోస్ట్/వాట్సాప్/ఎస్ఎంఎస్ ద్వారా లేదా స్వయంగా ఏదైనా శాఖ ద్వారా మీ కెవైసిని 31.07.2026లోగా అప్‌డేట్ చేసుకోగలరు. లేని యెడల మీ ఖాతాలో లావాదేవీలు అనుమతించబడవు. దయచేసి గమనించగలరు.
సం/- అధీకృత సంతకందారు

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం
రోడ్లు మరియు భవనముల శాఖ
ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండర్ నోటీసు
నిట్ నెం. 26/TO/2026-27 తేది: 21.07.2026
YSR జిల్లా, ప్రొద్దుటూరు (R&B) డివిజన్‌లో 2026-2027 సంవత్సరానికిగాను వివిధ పనుల కొరకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ ప్లాట్ ఫారం క్రింద ఆన్‌లైన్ సంక్షిప్త టెండర్లు ఆహ్వానించబడ్డాయి. అంచనా మొత్తం: రూ.3.90 లక్షలు. టెండర్ల షెడ్యూల్‌లను 25.07.2026 నుండి 01.08.2026 మ.3.00గం.ల వరకు ap ఇ-ప్రొక్యూర్‌మెంట్ మార్కెట్ ప్లేస్ అనగా www.apeprocurement.gov.in నుండి డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.
సం/-, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (R&B), ప్రొద్దుటూరు.
DIPR.NO. 21011/CL/ADVT/1/1/2022-23 తేది: 24.07.2026

25-7pg4:25-7pg4.qxd 7/24/2026 11:43 PM Page 1



వార్త

అందరికీ ఆశయాలుంటాయి. కాని కొందరు మాత్రమే ఆలోచిస్తారు, చాలా కొందరు మాత్రమే ఆచరిస్తారు.

న- బిషప్ బక్కిలీ


# అవినీతే అసలు సమస్య!

ధర్మాధర్మాలు తెలియవని కాదు, మొదటి ఒంటబట్టడం లేదు, రెండోది వదిలిపెట్టడం లేదు అన్నట్లుగా ఉంది అవినీతి విషయంలో కొందరు పెద్దలు వ్యవహరిస్తున్న తీరు. ఏ కోణంలో చూసినా అవినీతికిపాల్పడడం ధర్మకాదని అందరికి తెలిసిందే. పైగా అది చట్టబద్ధనేరం కూడా. కానీ దేశంలో అవినీతికి పాల్పడేవారి సంఖ్య కోట్లల్లో ఉంది. అవినీతి నిర్మూలనకు దశాబ్దాల తరబడి ప్రయత్నాలు జరుగుతున్నా ఏమాత్రం తగ్గడం లేదు. అంతకంతకు పెరిగిపోతున్నది. ముఖ్యంగా ఉన్నతస్థాయిలో జరుగుతున్న అవినీతికి అడ్డూఅదుపు లేకుండాపోతున్నది. కిందిస్థాయిలో అవినీతిని అరికట్టే ముందు ఉన్నతస్థాయిలో ముఖ్యంగా రాజకీయ అవినీతిని నియంత్రించే ప్రయత్నం చేస్తే బాగుంటుందనే అభిప్రాయంతో గతంలో ఒక వ్యూహం ప్రకారం ఏకంగా లంచం ఇచ్చి ఒకమంత్రిని ఇంటికి పంపారు. అప్పట్లో అది రాజకీయసంచలనం రేపింది. ఈ డబ్బు సంపాదనలో మంచి, చెడు ఆలోచించడం లేదు. అందుకే ప్రభుత్వం చేపడుతున్న అనేక పథకాలు క్షేత్రస్థాయిలో పూర్తిగా అర్హులైన లబ్ధిదారులకు అందడం లేదు. ప్రాజెక్టుల నిర్మాణాల్లో వేలాది కోట్ల రూపాయలు పక్కదారి పడుతున్నాయి. ప్రభుత్వాలు మారి కొత్త ప్రభుత్వాలు వచ్చినప్పుడు అంతకుముందు ఉన్న ప్రభుత్వాలు కీలక బాధ్యత వహించినవారిపై విచారణ జరిపించడం సర్వసాధారణమైపోయింది. వాటిల్లో కూడా సమర్థవంతంగా దర్యాప్తు జరిపి తిరుగులేని రుజువులతో న్యాయస్థానాల ముందు దోషులను నిలబెట్టలేకపోతున్నారు. ఫలితంగా అన్ని పథకాల్లోనూ, కార్యక్రమాల్లోనూ ప్రాజెక్టుల నిర్మాణాల్లోనూ అవినీతి చోటు చేసుకుంటున్నది. నిరుపేదలకు ఇచ్చే ఇళ్ల కేటాయింపుల్లోకానీ, వృద్ధాప్యపు పెన్షన్లు, సంక్షేమ కార్యక్రమాలు ఏవి తీసుకున్నా దేశవ్యాప్తంగా దళారులు ఈ అవినీతి అధికారులతో చేతులు కలిపి ప్రజా సొమ్మును భోంచేస్తున్నారు. అవినీతిని అడ్డుకొని ప్రజాధనాన్ని కాపాడేందుకు ఏనాటి నుంచో ప్రయత్నాలు జరుగుతున్నాయి. రాష్ట్రస్థాయిలో అవినీతి నిరోధక శాఖ, కేంద్రస్థాయిలో సిబిఐతోపాటు ఇడి, నిఘా విభాగాలు మరెన్నో పనిచేస్తున్నాయి. ఎన్నో చట్టాలు చేశారు. జీతభత్యాల రూపేణా కోట్లాది రూపాయలు వెచ్చిస్తున్నారు. వేలాది మంది అధికారులను వల పన్ని పట్టుకుంటున్నారు. మరెందరినో ఆదాయానికి మించిన ఆస్తులను కూడబెట్టినందుకు కేసులు నమోదు చేసి అరెస్టు చేసి జైళ్లకు పంపుతున్నారు. ఎంతమందిపై చర్యలు తీసుకున్నా అవినీతిని నియంత్రించలేకపోతున్నారు. అధికారుల్లో, ఉద్యోగుల్లో ఉన్న అవినీతి ఒక ఎత్తు అయితే కీలక పదవులు నిర్వహిస్తున్న కొందరు పెద్దలు, ప్రజాసేవ ముసుగులో చెలామణి అవుతున్న కొంత మంది రాజకీయ నాయకులు, దళారుల వల్లనే పరిస్థితి అదుపు తప్పిపోతున్నదేమోననిపిస్తున్నది. వారి రాజకీయ అధికారం ధాటికి నిజాయితీ, సమర్థులైన అధికారులు సైతం నిస్సహాయంగా ఉండిపోతున్నారు. అవినీతి మూలంగా స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుండి ఇప్పటివరకు ఎన్ని లక్షలకోట్ల రూపాయలు భారత్‌కోల్పోయిందో అంచనాకే అందదు. అవినీతికి ఆరోప్రాణమైన కొందరు నేతలే చట్టానికి చుట్టాలై చక్రం తిప్పుతున్న సంఘటనలు గతంలో ఎన్నో బయటపడ్డాయి. పశ్చిమ బెంగాల్ మాజీ మంత్రి ఒకరు ఉపాధ్యాయుల నియామక కుంభకోణంలో కోట్ల రూపాయలు దిగమింగి తన ఆప్త మిత్రురాలి ఇంట్లో గుట్టుచప్పుడు కాకుండా దాచిపెట్టిన వైనాన్ని గతంలో ఎన్‌ఫోర్స్ మెంట్ డైరెక్టరేట్ రట్టు చేసింది. కర్ణాటకలో బాధ్యత కలిగిన మంత్రి తన చావుకు కారణమని ఆ మధ్య ఒక యువ కాంట్రాక్టరు ఆత్మహత్య చేసుకున్నాడు. దాంతో తప్పని పరిస్థితుల్లో ఆ మంత్రి రాజీనామా చేయాల్సి వచ్చింది. సబ్బుల తయారీలో ముడిసరుకుల టెండర్ ఆమోదముద్ర పొందడానికిలంచం ముట్టచెప్పాల్సిందేనని కాంట్రాక్టరుగా ఆ ప్రాంతపు ప్రజా ప్రతినిధి తన కుమారుడికి అప్పగించడంతో ఏకంగానలభై లక్షల రూపాయలు తీసుకుంటూ లోకాయుక్త పోలీసులకు చిక్కుకున్నారు. అంతేకాదు సాక్ష్యాత్తు హైకోర్టు న్యాయమూర్తి ఇంట్లో జరిగిన అగ్నిప్రమాదంలో లక్షలాది రూపాయల నోట్లకట్టలు బయటపడ్డాయి. రాజ్యాంగంకల్పించిన రక్షణ వల్ల ఆయనపై కనీసం ఎఫ్ఐఆర్ కూడా నమోదు చేయలేని పరిస్థితి. దీంతో ఆ డబ్బు ఎక్కడి నుంచి వచ్చిందో, ఎవరు ఎందుకోసం ఇచ్చారో అనే ప్రశ్నలకు జవాబు దొరకలేదు. అయితే చివరకు ఆయన ఆ పదవి నుంచి వైదొలగాల్సి వచ్చింది. ఒడిశాలో సబ్‌కలెక్టర్‌గా పని చేస్తున్న ఒక ఐఎఎస్ అధికారి పదిలక్షల లంచం తీసుకుంటూ పట్టుబడ్డాడు. ఆయన ఇంట్లో సోదాలు చేస్తే నలభై లక్షలకుపైగా నగదును అధికారులు కనుగొన్నారు. ఇటీవల తెలంగాణ రాష్ట్రంలో జరుగుతున్న ఎసిబి దాడుల్లో వందలాది కోట్ల రూపాయల విలువైన ఆదాయానికి మించిన ఆస్తులను కనుగొంటున్నారు. అరెస్టులు చేస్తున్నారు. జైళ్లకు పంపుతున్నారు. అయినా ఈ అవినీతి ఆగడం లేదు. ఎంతో మంది ఉన్నతాధికారులపై వచ్చిన ఆరోపణలపై దర్యాప్తు చేసి చర్యలకు సిద్ధమైనా అనుమతి లేక ఆగిపోయిన సంఘటనలు కోకొల్లలు. గతంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ విజిలెన్స్ కమిషన్ రాంచంద్ర సమాల్ బయటపెట్టిన విషయాలు అద్దంపడుతున్నాయి. ఇవన్నీ మూడోకంటికి తెలియకుండా జరుగుతున్న అవినీతి సంఘటనలు. వాటిని కూడా పసిగట్టి పరిశోధించి బయటపెట్టగలుగుతున్నారు. బహాటంగా నిర్లజ్జగాజరుగుతున్న అవినీతిని పసిగట్టకపోవడం అనే ప్రశ్న ఉదయించదు. ఏదిఏమైనా అవినీతి శృతిమించిపోతున్నది. ఉన్నత స్థాయిలో ప్రధానంగా రాజకీయ అవినీతి అరికట్టకుండా దేశం నుండి దాన్ని పారద్రోలడం అంత సులభం కాదు.



ఒక పని అంటే గాని, లేదా దానివల్ల కలిగే ఫలితాలంటే గానీ భయపడి, ఆ పని చేయడాన్ని మానుకోవడం చాలా చిన్నతనం.

మహాత్మా గాంధీ



జీవితంలో విజయాలకు చాలా ఉపాయాలున్నాయి. కానీ మనం పని చెయ్యనిదే అవి పనిచేయవు.

షేక్స్పియర్

# కల్తీ సామ్రాజ్యానికి కాపలాదారులెవరు?

*ఇలాంటి సంఘటనలు పరిశీలిస్తే సంబంధిత అధికారులకు తెలియకుండా ఈ కల్తీ జరిగే అవకాశం లేదని చెప్పొచ్చు. కల్తీని అడ్డుకునేందుకు అప్పుడప్పుడు ప్రయత్నాలు జరుగుతున్నా అవి సఫలీకృతం కావడం లేదు. పాలకులతోపాటు స్వచ్ఛంద సంస్థలు కూడా ఈ కల్తీని నిరోధించేందుకు నడుం కట్టాల్సిన సమయమిది. అయితే ఈ కల్తీపై యుద్ధం చేయాలంటే అంత తేలికయిన పనికాదు. అందుకు ఎంతో ఆత్మవిశ్వాసం, గుండెనిబ్బరం, చిత్తశుద్ధి కావాలి. ఒత్తిడిని తట్టుకునే ఓపిక, బెదిరింపులను లెక్కపెట్టని సాహసం ఉండాలి. ఎదురయ్యే అవమానాలను సహించి సమన్వయంతో సొంత పనులకు జరిగే నష్టాలను తట్టుకునే త్యాగగుణాలు కలిగిన నిస్వార్థపరులు, త్యాగధనులు ముందుకువస్తే తప్ప ఈ కల్తీని అరికట్టడం సాధ్యంకాదేమో.*

దామెర్ల సాయిబాబ

ఇందుగలడు అందులేడని సందేహం వలదు చక్రి సర్వోపగతుండు ఎందెందు వెతికి చూసినా అందెందే గలడన్నట్లు ఇక్కడా, అక్కడా అని కాదు అంతటా 'కల్తీ' పొగమంచులా విస్తరించింది, విస్తరిస్తున్నది. కల్తీ వ్యాపారాన్ని నిరోధించేందుకు పాలకులు ఎన్ని చర్యలు తీసుకుంటున్నా మరెన్ని చట్టాలు చేస్తున్నా ఇంకెంత మంది అధికారులను నియమించి దాడులను నిర్వహిస్తున్నా ఆగడంలేదు. ఎటు చూసినా కల్తీమయమైపోతున్నది. తాగే నీటిలో కల్తీ, పాలల్లో కల్తీ, తినే పప్పులో కల్తీ, ఉప్పులో కల్తీ, నూనెలో కల్తీ, కారంలో కల్తీ, ఎరువుల్లో కల్తీ, విత్తనాల్లో కల్తీ, చివరకు ప్రాణాపాయస్థితి నుండి కాపాడే అత్యవసర మందుల్లో కల్తీ, ఇది అది అని కాదు, ఎటుచూసినా ఎక్కడ చూసినా కల్తీమయమైపోతున్నది. కల్తీ లేని సరుకులు లభ్యం అనేది గగనమైపోయింది. రానురాను కల్తీ మనిషి మనుగడకేప్రమాదం వాటిల్లే సూచనలు కన్పిస్తున్నాయి. కల్తీ ఇంత ప్రమాదకరంగా తయారవుతున్నా, చాపకింద నీరులా వ్యాపిస్తున్నా అడ్డగించేవారు, కనీసం నియంత్రించేందుకు త్రికరణ శుద్ధిగా ప్రయత్నాలు జరగడంలేదు. అసలు కల్తీకి, అవినీతికి అవినాభవ సంబంధం ఉంది. ఒకటిని విడిచి మరొకటి ఉండవు. ఉండలేవు కూడా. అందుకే పెరుగుతున్న అవినీతికి రెట్టింపు స్థాయిలో కల్తీ విస్తరిస్తున్నది. దీన్ని అరికట్టేందుకు పాలకులు చర్యలు తీసుకోలేదని చెప్పడం లేదు. చట్టాలు చేశారు. ఆ చట్టాలను అమలు చేసి కల్తీ పెరగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకునేందుకు కోట్లాది రూపాయలు వెచ్చించి దేశవ్యాప్తంగా లక్షలసంఖ్యలో అధికారులను నియమించారు. ఈ అధికారులు కానీ, ఆ చట్టాలుకానీ, కల్తీని నిరోధించలేకపోతున్నాయి. ఫలితంగా దేశంలో కోట్లాదిమంది తీవ్ర అనారోగ్యానికిగురై ఆస్పత్రుల పాలవుతుండగా ఇందులో కొందరు శాశ్వత రోగపీడితులు అవుతున్నారు. ఇంకొందరి ప్రాణాలను ఈ కల్తీ బలితీసుకుంటున్నది. ఈ సమస్యఇంత తీవ్రరూపంలో విలయతాండవం చేస్తున్నా ఆ వైపు పాలకులు అంతగా శ్రద్ధపెట్టడం లేదేమోననిపిస్తున్నది. అప్పుడప్పుడు జనం కన్నీళ్లు తుడవడానికి తమ ఉనికిని గుర్తుచేయడానికి అధికారులు దాడులు చేస్తున్నారేతప్ప ప్రజల ప్రాణాలతో ఆటలాడుకుంటున్న ఈకల్తీని నిరోధించడానికి పటిష్టమైన నిర్మాణాత్మక చర్యలు చేపట్టి పునరావృతం కాకుండా చేయలేకపోతున్నారు. కట్టుదిట్టమైన చట్టం లేకపోవడం కూడా ఒక లోపంగా చెప్పవచ్చు. అందుకే ఈ కల్తీ వ్యాపారం చేస్తూ పట్టుబడినవారు జైలుకు వెళ్లినా తిరిగివచ్చి అదే వ్యాపారంలో కొనసాగుతున్నారు. ఈ కల్తీఎక్కడో మూడోకంటికి తెలియకుండా జరగడం లేదు. ఇందులో రహస్యం ఏమీలేదు. పరిశోధించి, రాత్రింబవళ్లు శ్రమించి మాటువేసి, పట్టుకోవాల్సిన పని అంతకంటే లేదు. కల్తీసరుకుల అమ్మకాలు రహస్యంగా జరగడం లేదు. ఇందులో దొంగచాటు అసలే లేదు. పబ్లిక్‌గా ప్రదర్శించి మరీ అమ్ము కుంటున్నారు. ఇదెక్కడో మారుమూల ప్రాంతాల్లో జరగడం లేదు. ఇక్కడా అక్కడా అని తేడా లేకుండా పట్టణాల్లోనూ, నగరాల్లోనూ చివరకు పాలకగణంతోపాటు అధికారులందరూ కొలువైఉన్నరాజధాని నగరాల్లో కూడా పెద్దఎత్తున ఈకల్తీ జరుగుతున్నది. అమాయక ప్రజలు నిలువు దోపిడీకి గురవుతున్నారు. ఆర్థికంగా నష్టపోతే పోయారు కానీ ఆరోగ్యాన్ని కోల్పోతున్నారు. క్షయ, కేన్సర్, ఊపిరితిత్తులు, గుండె జబ్బులు లాంటి రోగాలకు గురైకోలుకోలేక ఏళ్లతరబడి మంచానికి అంకితమై కృంగి కృశించి అసులువు బాస్తున్నారు. పసిపిల్లల నుండి వృద్ధుల వరకు వయసుతో సంబంధం లేకుండా ఏదో ఒక రూపంలో సేవించే పాలలో కూడా పెద్దఎత్తున కల్తీ జరుగుతున్నది. పెరుగుతున్న వినియోగానికి తగినట్టుగా పాల ఉత్పత్తి జరగకపోవడంతో ఆ వ్యత్యాసాన్ని భర్తీ చేసేందుకు కల్తీపాలను తయారు చేసి అమ్ముకొంటున్నారు. ప్రమాదకరమైన రసాయనికాలు కలుపుతున్నట్లు కూడా సమాచారం. కొందరు వ్యాపారులు పశువుల్లో కృత్రిమంగా పాలఉత్పత్తిని పెంచేందుకు అత్యంత ప్రమాదకరమైన ఆక్సీ దోసిన్ ఇంజక్షన్‌ను విచ్చలవిడిగా వాడుతున్నవైనం బయటపడుతున్నది. గతంలో ఇలాంటి ముఠాను అధికారులు వలపన్ని పట్టుకున్నారు. ఈ ఇంజక్షన్‌లు చేయడంవల్ల గేదె సహజంగా ఇచ్చే పాలకంటే రెండు, మూడు రెట్లు ఎక్కువగా ఇస్తాయంటున్నారు. ఈ ఇంజక్షన్ ఇచ్చిన పాలు తాగితే హార్మోన్ల సమతుల్యం దెబ్బతింటుందని చిన్నతనంలోనే మోకాళ్ల సమస్యలు, కిడ్నీ వ్యాధులు తదితర శారీరక రుగ్మతలు సంభవించే అవకాశం ఉన్నట్లు డాక్టర్లు అభిప్రాయపడుతున్నారు. నూనెకల్తీగురించి ఎంత తక్కువ మాట్లాడితే అంత మంచిదేమో. పశుకళేబరాల నుంచి తీసిన నూనె నిరాటంకంగా సరఫరా అవుతున్నట్లు అనేకసార్లు బయటపడింది. నెయ్యిలో కూడా భారీ ఎత్తున కల్తీ జరుగుతున్నది. గతవారంలో హైదరాబాద్‌లో పోలీసులుజరిపిన తనిఖీల్లో ఎనిమిది వందల యాభైకిలోలకు పైగా కల్తీనెయ్యి పట్టుబడింది. గతంలో కూడా భారీఎత్తు కల్తీనెయ్యి పట్టుబడిన సంఘటనలున్నాయి. చివరకు కోట్లాది మంది ఇలవేల్పు తిరుపతి వెంకన్న కూడా ఈ కల్తీ నెయ్యి నుండి తప్పించుకోలేకపోయారు. ఇక నిరుపేదల దగ్గరనుండి కోటీశ్వరుల వరకు నిత్యం వాడే కాఫీ, టీ పొడుల్లో భారీ ఎత్తున కల్తీ జరుగుతున్నట్లు ఇటీవల బయటపడుతున్న సంఘటనలు చెబుతున్నాయి. ఇవేమీ కొత్త విషయాలు కాదు. అప్పుడప్పుడు అధికారులు జరుపుతున్న దాడుల్లో వెలుగు చూస్తున్నాయి. ఇలాంటి టీ పొడులు వాడితే తొలిదశలో అజీర్ణ సమస్య ప్రారంభమై క్రమంగా అల్సర్‌గా మారి తుదిదశలో కేన్సర్‌కు దారితీసే ప్రమాదం ఉందని డాక్టర్లు చెబుతున్నారు. అలాగే ప్రజలు నిత్యంవాడే కారం, పసుపు, బియ్యం నిత్యావసర వస్తువుల్లో కూడా కల్తీకి అదుపులేకుండాపోతున్నది. కారంపొడిలో రంపపు పొట్టు, కందిపొట్టు పొడిని కలుపుతున్నారు. ప్రభుత్వ వసతిగృహాలకు సరఫరా అవుతున్న సరుకులను ఒక్కసారి తనిఖీ చేస్తే, వాటి నాణ్యతను పరిశీలిస్తే అనేక ఆశ్చర్యకరమైన అంశాలు వెలుగులోకి వస్తాయి. ఇక మందుల విషయం వేరేచెప్పక్కర్లేదు. భారీఎత్తున నాసిరకం, నకిలీ మందులు వినియోగమవుతున్నాయి. రోగులకు తెలిసే అవకాశం లేదు. కనుక ఇష్టానుసారంగా చేస్తున్నారు. ప్రాణాధార మందులు కాస్త అటుఇటూ అయినా ప్రాణాలు కబళిస్తాయి. ఇది తెలియందికాదు. కనీసం వీటి విషయంలో నిర్దిష్టమైన చర్యలు తీసుకొని కల్తీ, నాసిరకం మందులను ఏరివేసి బాధ్యులైనవారిపై చర్యలు తీసుకోలేకపోతున్నారు. ముఖ్యంగా పశువుల మందుల్లో కల్తీజరుగుతున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. పశుసంవర్ధకశాఖకు సరఫరా అవుతున్న మందుల్లో నాసిరకం కాలం చెల్లినవి చేర్చడంతో భారీఎత్తున గోల్‌మాల్ జరుగుతున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. పెట్రోలు, డీజిల్‌లాంటి వాటిల్లో కూడా కల్తీ తక్కువేమీ జరగడం లేదు. దీంతో వాయుకాలుష్యం పెరిగి ప్రజలు అనేక రకాల జబ్బులకు లోనవుతున్నారు. ఇక ఈ కల్తీ అన్నదాతలను కోలుకోలేకుండా చేస్తున్నది. విత్తనాల దగ్గరనుంచిఎరువులు, క్రిమిసంహారక మందులు, నాసిరకం, నకిలీవి ఎక్కువకావడంతో రైతులకు కష్టాలు తప్పడంలేదు. గతవారంలోనల్గొండ జిల్లాలో ఒక రైతుకు ఇచ్చిన సమాచారంతో డిఎపిఎరువు నాణ్యతలో అనుమానం రావడంతో క్షుణ్ణంగా పరిశీలించడంతో అది నకిలీదని తేలింది. వివరాలు సేకరించి కూపీ లాగడంతో హైదరాబాద్‌లో ఒక గోదాములో రహస్యంగా ఈ నకిలీ డిఎపి ఎరువులుతయారు చేస్తున్నట్లు బయటపడింది. ఏకంగా వెయ్యి బస్తాలకుపైగా డిఎపి ఎరువులను అధికారులు కొనుగొన్నారు. కేసును నమోదుచేసి దర్యాప్తుచేస్తున్నారు. నాగర్‌కర్నూల్‌జిల్లాలో నాసిరకం, నకిలీలు బయటపడినా చర్యలు తీసుకునే విషయంలో మీనమేషాలు లెక్కబెడుతున్నట్లు చెప్తున్నారు. ఇలాంటి సంఘటనలు పరిశీలిస్తే సంబంధిత అధికారులకు తెలియకుండా ఈ కల్తీ జరిగే అవకాశం లేదని చెప్పొచ్చు. కల్తీని అడ్డుకునేందుకు అప్పుడప్పుడు ప్రయత్నాలు జరుగుతున్నా అవి సఫలీకృతం కావడంలేదు. పాలకులతోపాటు స్వచ్ఛంద సంస్థలు కూడా ఈకల్తీని నిరోధించేందుకు నడుంకట్టాల్సిన సమయమిది. అయితే ఈ కల్తీపై యుద్ధం చేయాలంటే అంత తేలికయిన పనికాదు. అందుకు ఎంతో ఆత్మవిశ్వాసం, గుండె నిబ్బరం, చిత్తశుద్ధి కావాలి. ఒత్తిడిని తట్టుకునే ఓపిక, బెదిరింపులను లెక్కపెట్టని సాహసం ఉండాలి. ఎదురయ్యే అవమానాలను సహించి సమన్వయంతో సొంత పనులకు జరిగే నష్టాలను తట్టుకునే త్యాగగుణాలు కలిగిన నిస్వార్థపరులు, త్యాగధనులు ముందుకు వస్తే తప్ప ఈ కల్తీని అరికట్టడం సాధ్యంకాదేమో. ●


## ఒక్క మాట

# బిసిలకు సామాజిక న్యాయం జరుగుతున్నదా?

బూర్గుపల్లి కృష్ణ యాదవ్


భారత రాజ్యాంగం ప్రతిపౌరుడికి సమానత్వం, సామాజిక న్యాయం, సమాన అవకాశాలను కల్పించాలనే ఉన్నత ఆశయాలతో రూపొందించబడింది. అయితే స్వాతంత్ర్యం వచ్చి ఇన్నేళ్లు గడిచినా, దేశ జనాభాలో అత్యధిక శాతం ఉన్న వెనుకబడిన తరగతుల (బీసీలు)కు రాజకీయంగా, సామాజికంగా, ఆర్థికంగా పూర్తిస్థాయి న్యాయం ఇంకా జరగలేదు. అందుకే పార్లమెంట్‌లో బీసీ రిజర్వేషన్ బిల్లును ప్రవేశపెట్టి ఆమోదించాలనే డిమాండ్ దేశవ్యాప్తంగా బలంగా వినిపిస్తోంది. బీసీలు వ్యవసాయం, పశుపోషణ, చేతివృత్తులు, చిన్నవ్యాపారాలు, సేవా రంగం వంటి అనేక రంగాలకు వెన్నెముకగా ఉన్నారు. దేశ ఆర్థిక వ్యవస్థ అభివృద్ధిలో వారి పాత్ర ఎంతో కీలకమైనది. అయినప్పటికీ, నిర్ణయాత్మక స్థాయిలో వారికి తగిన ప్రాతినిధ్యం లేకపోవడం వల్ల వారి సమస్యలు, అవసరాలు ప్రభుత్వ విధానాల్లో సరైన స్థానం పొందడం లేదని నిత్య సత్యం. భారత పార్లమెంట్‌లో అనేక కీలక బిల్లులు తక్కువ సమయంలోనే ప్రవేశపెట్టి ఆమోదించబడిన సందర్భాలున్నాయి. అలాగే 10 శాతం ఈడబ్ల్యుఎస్ రిజర్వేషన్ బిల్లు కూడా వేగంగా ఆమోదం పొందింది. అదే విధంగా, ఎన్నో దశాబ్దాలుగా బీసీలు కోరుతున్న రాజకీయ రిజర్వేషన్ బిల్లును కూడా కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టి చర్చించి నిర్ణయం తీసుకోవాలి. రాజకీయ ప్రాతినిధ్యం అనేదికేవలం పదవుల కోసంకాదు. ప్రజల సమస్యలను చట్టసభల్లోప్రస్తావించి, వారికి అవసరమైన చట్టాలు, సంక్షేమ పథకాలు, బడ్జెట్ కేటాయింపులు సాధించడానికి అది కీలకసాధనం. అందుకే లోక్‌సభ, రాజ్యసభ, రాష్ట్ర శాసనసభల్లో బీసీలకు తగిన ప్రాతినిధ్యం కల్పించే విధంగా రాజ్యాంగబద్ధమైన చర్యలు అవసరం. బీసీల సంక్షేమానికి కేంద్రంలో ప్రత్యేక బీసీ మంత్రిత్వశాఖ ఏర్పాటు చేయాలనే డిమాండ్ కూడా చాలా కాలంగా కొనసాగుతోంది. ప్రస్తుతం బీసీలకు సంబంధించిన అంశాలు వివిధశాఖల పరిధిలో ఉండటంతో సమన్వయం లోపిస్తోందని, ప్రత్యేకశాఖ ఉంటే వారి అభివృద్ధికి దీర్ఘకాలిక విధానాలు అమలు చేయడం సులభమవుతుంది. అలాగే క్రీమీలేయర్ విధానంపై కూడా బీసీసంఘాలుపునః సమీక్ష కోరుతున్నాయి. ఈ విధానం వల్ల అనేక మంది అర్హులైన విద్యార్థులు, యువత అవకాశాలు కోల్పోతున్నారు. ఈ అంశంపై కేంద్ర ప్రభుత్వం విస్తృత చర్చ నిర్వహించి, సామాజిక న్యాయం దృష్ట్యా తగిన నిర్ణయం తీసుకోవాలి. దేశంలోని వివిధ ప్రాంతాల్లో బీసీలపై వివక్ష, సామాజిక అవమానాలు, దాడులఘటనలు వెలుగులోకి వస్తున్నాయి. అలాంటి సంఘటనలను అరికట్టేందుకు ప్రత్యేక బీసీ అట్రాసిటీ చట్టం తీసుకురావాలి. చట్టపరమైన రక్షణతో పాటు బాధితులకు త్వరిత న్యాయంఅందేలా చర్యలుతీసుకోవాలి. దేశ జనాభా గణనలో బీసీ కులాల గణన నిర్వహించడం కూడా అత్యంత అవసరం. కచ్చితమైన జనాభాగణాంకాలు ఉంటేనే సంక్షేమపథకాల రూపకల్పన, నిధుల కేటాయింపు, రిజర్వేషన్ విధానాల అమలులో పారదర్శకత పెరుగుతుంది. చట్టసభల స్థానాలపెంపు వంటి కీలక నిర్ణయాలు తీసుకునే ముందు బీసీలకు చట్టసభలలో రాజకీయ రిజర్వేషన్లు కల్పించాలి. చట్టసభలలో బీసీలకు రిజర్వేషన్లు పెంచకుండా పార్లమెంటులో డీలిమిటేషన్ బిల్లు ఆమోదంపొందితే రాజకీయ, సామాజిక, ఆర్థిక అసమానతలు మరింత పెరిగే అవకాశం ఉంది. అదేవిధంగా బీసీ సామాజిక వర్గానికి చెందిన లోక్‌సభ, రాజ్యసభ సభ్యులు రాజకీయాలకు అతీతంగా ఏకమై బీసీల హక్కుల కోసం కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలి. రాజకీయ విభేదాల కంటే రిజర్వేషన్ల సాధనకై కేంద్రంపై ఒత్తిడి తేవాలి. బీసీల సమస్యలు ఏ ఒక్క రాష్ట్రానికి పరిమితం కావు. దేశవ్యాప్తంగా కోట్లాది మంది ప్రజల జీవనప్రమాణాలు, విద్య, ఉపాధి, రాజకీయ ప్రాతినిధ్యానికి సంబంధించిన అంశాలివి. అందువల్ల కేంద్రం అన్ని వర్గాల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోవాలి. ●

# చట్టం అమలులో సమానత్వం అవసరం



ఆరెల్లి మల్లేష్

ప్రజాస్వామ్యంలో అత్యంత కీలక బాధ్యత ప్రజా శాంతిభద్రతలను పరిరక్షి ంచడం. అదే సమయంలో ప్రతి పౌరుడి గౌరవం, స్వేచ్ఛ, గోప్యత ను కాపాడటం కూడా రాజ్యాంగం నిర్దేశించిన బాధ్యతే. ఈ రెండు విలువల మధ్య సమతుల్యతను కాపాడేందుకు రూపొందించిన పరిపాలనా సాధనాల్లో రౌడీ షీట్ ఒకటి. అయితే పర్యవేక్షణ ఉద్దేశం శిక్ష విధించడం కాదు. ప్రజా శాంతిభద్రతలకుముప్పు ఉందని అందుబాటులో ఉన్న సమాచారం, రికార్డుల ఆధా రంగా సంబంధిత అధికారులు అంచనా వేసిన సందర్భా ల్లో, అలాంటి వ్యక్తుల కార్యకలాపాలను చట్టపరమైన పరిధి లో పర్యవేక్షి ంచడం మాత్రమే దీని ఉద్దేశం. అందువల్ల ఇది ప్రతి కేసులోనూ, ప్రతి నిందితుడిపైనా స్వయంచాలకంగా వర్తించే వ్యవస్థ కాదు. అదే సమయంలో ఇది పౌర హక్కు లను అనవసరంగా పరిమితం చేసే సాధనంగా మారకూ దదు. ఈ సమతుల్యతే చట్టపాలనకు అసలు పరీక్ష. రౌడీ షీట్ వ్యవస్థకు రాష్ట్రానుసారం పోలీస్ స్టాండింగ్ ఆర్డర్స్‌లో భిన్నమైన నిబంధనలు ఉండవచ్చు. నమోదైన రికార్డులు, అలాగే ప్రజా శాంతిభద్రతలకు నిరంతర ముప్పు ఉందనే పరిపాలనా అంచనాల ఆధారంగా వ్యక్తులపై నిఘా ఉంచే దుకు రౌడీ షీట్ వ్యవస్థను ఉపయోగిస్తారు. హత్య, హత్యా యత్నం, దోపిడీ, బలవంతపు వసూళ్ల వంటి తీవ్రమైన లేదా పునరావృత నేరాలకు సంబంధించిన నమోదైన కేసు లు, అందుబాటులో ఉన్న సమాచారం, సంబంధిత చట్టపరమైన ప్రమాణాల మేరకు పరిశీలనలో భాగం కావచ్చు. అయితే కేవలం కేసు నమోదు కావడం, దర్యాప్తు కొనసాగుతుండడం లేదా ఆరోపణలు ఎదుర్కొనడం మాత్రమే ప్రతి సందర్భంలో స్వయంచాలకంగా ఇటువంటి చర్యకు ఏకైక ఆధారం కాకూడదు. దళిత గిరిజన వర్గాలకు రాజ్యాంగ బద్ధంగావచ్చిన వజ్రాయుదమే అట్రాసిటీ ఆక్ట్ దాన్ని కాపాడే దిశగా ప్రభుత్వాల నిర్ణయాలు గాని, అధికారయంత్రాంగం కూడా ముందుకు సాగాలి. ఈ మధ్య సరైన విచారణ లేకుండా తరుచూ అట్రాసిటీ కేసులు నమోదు చేయడం, దాంతో నిందితులు పరస్పర కేసులు నమోదు అవ్వడంతో చట్టం నిర్వీర్యమయ్యే ప్రమాదం ఉంది. కావున సంబంధిత అధికారులు సేకరించిన సమాచారం, వ్యక్తి గత నేరచరిత్ర, నేరాల పునరావృతం, ప్రజా శాంతిభద్రతలకు భవిష్యత్తులో ఏర్పడే ముప్పు, అందుబాటులో ఉన్న ఆధారాలు వంటి అంశాలను సమగ్రంగా పరిశీలించిన అనంతరమే పరిపాలనా నిర్ణయం తీసుకోవాలి. అలాంటి నిర్ణయాలు కూడా కాలానుగుణ సమీక్షకు లోబడి ఉండాలి. భారత రాజ్యాంగంలోని



ఆర్టికల్ 14 చట్టం ముందు సమానత్వాన్ని, ఆర్టికల్ 19(1)(ఏ) భావ ప్రకటనా స్వేచ్ఛను, ఆర్టికల్ 21 గౌరవప్రదమైన జీవితం, వ్యక్తిగత స్వేచ్ఛను హామీ ఇస్తాయి. జస్టిస్ కె.ఎస్. పుట్టస్వామి వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా (2017) కేసులో సుప్రీంకోర్టు, వ్యక్తిగత గోప్యత కూడా భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 21 కింద ప్రాథమిక హక్కు అని స్పష్టం చేసింది. మరోవైపు నేరాలను అరికట్టడం, ప్రజల భద్రతను కాపాడడం పోలీసు శాఖకు చట్టం అప్పగించిన బాధ్యత. అందువల్ల ప్రజాభద్రత, పౌర హక్కులు అనే రెండు అంశాలను పరస్పర విరుద్ధాలుగా కాకుండా పరస్పర పూరకాలుగా చూడాలి. పరిపాలనా అధికారాల వినియోగం కూడా న్యాయ సమీక్షకు అతీతం కాదు. అందువల్ల ప్రతి నిర్ణయం చట్టబద్ధత, సహేతుకత, నిష్పాక్షి కత, అవసరాను గుణత వంటి ప్రమాణాలను తట్టుకోవాలి. నిఘా చర్యలు అవసరమైన సందర్భాల్లో మాత్రమే చట్టబద్ధంగా అమలుకా వాలి. వాటి అమలులో పారదర్శకత, జవాబుదారీతనం, కాలానుగుణ సమీక్ష వంటి సూత్రాలు పాటించబడాలి. ఒక వ్యక్తి తనపై తీసుకున్న చర్య చట్టబద్ధం కాదని భావిస్తే, సంబంధిత ఉన్నతాధికారులను లేదా భారత రాజ్యాంగం లోని ఆర్టికల్ 226 కింద హైకోర్టును ఆశ్రయించే హక్కు కలిగి ఉంటాడు. ఇదే రాజ్యాంగబద్ధమైన పరిష్కార మార్గం. ఈ నిఘా విధానంపై జరుగుతున్న చర్చ ఏ ఒక్క వ్యక్తి గురించో లేదా ఏ ఒక్క కేసు గురించో మాత్రమే కాదు. కొన్ని సందర్భాల్లో క్రిమినల్ కేసులు లేదా షెడ్యూల్డ్ కులా లు, షెడ్యూల్డ్ తెగల (దౌర్జన్యాల నిరోధక) చట్టం, 1989 కింద నమోదైన కేసుల అనంతరం తీసుకునే పరిపాలనా చర్యల విషయంలో, సంబంధిత చట్టపరమైన ప్రమాణాలు సమానంగా పాటించబడుతున్నాయా అనే ప్రశ్నలు ప్రజా చర్చలో వినిపిస్తున్నాయి. అలాంటి ప్రతి సందర్భంలోనూ సంబంధిత చర్యలు వాటి స్వంత చట్టపరమైన ప్రమాణాలు, అందుబాటులో ఉన్న ఆధారాలు, వాస్తవ పరిస్థితుల ఆధారంగానే సమీక్షి ంచబడాలి. అయితే ప్రతి కేసు దాని సొంత వాస్తవాలు, చట్టపరమైన నిబంధనలు, సంబంధిత అధికారుల నిర్ణయాల ఆధారంగానే పరిశీలించబడాలి. ఒక సందర్భాన్ని ఆధారంగా చేసుకుని సాధారణ నిర్ధారణలకు రావడం సముచితం కాదు. ప్రజా భద్రత కోసం రాష్ట్రానికి కల్పించిన అధికారాలు, పౌరులకు రాజ్యాంగం కల్పించిన హక్కులు – ఈ రెండింటి మధ్య సమతుల్యతను కాపాడడ మే ప్రజాస్వామ్య స్ఫూర్తి. చట్టం కఠినంగా ఉండటం కంటే, అది న్యాయంగా, పారదర్శకంగా, వివక్ష లేకుండా అమలు కావడమే ప్రజాస్వామ్యానికి మరింత అవసరం. ఇలాంటి పరిపాలనా చర్యలకు స్పష్టమైన కారణాలు, నమోదైన ఆధా రాలు, ఉన్నతాధికారుల పర్యవేక్షణ, కాలానుగుణ సమీక్ష వంటి అంశాలు నిరంతరం పాటించబడితే ప్రజల విశ్వాసం మరింత బలపడుతుంది. అదే సమయంలో ప్రజా శాంతి భద్రతలకు నిజమైన ముప్పుగా వ్యవహరించే వ్యక్తులపై చట్టబద్ధంగా, సమర్థవంతంగా చర్యలు తీసుకోవడం కూడా రాష్ట్రం బాధ్యత. ప్రజాస్వామ్యంలో పౌర హక్కులు, పోలీసు అధికారాలు, న్యాయపాలన – ఈ మూడు ఒకదానికొకటి ప్రత్యర్థులు కావు. పరస్పర పూరకాలు. చట్టం ముందు అందరూ సమానులే అనే రాజ్యాంగ సూత్రం, చట్టం అమలులో

# ప్రజావాక్కు



### విశ్వవిద్యాలయాలు ఆవిష్కరణల కేంద్రాలు

ఒక దేశభవిష్యత్తును నిర్ణయించేది దాని సహజ వనరులు మాత్రమేకాదు, సమస్యలను అవకాశాలుగా మలిచే పరిశోధన సామర్థ్యంకూడా. ప్రపంచంలోనే అత్యధిక యువ జనాభా కలిగిన భారత్‌కు ప్రతిభ కొరత లేదు. కానీ ఆ ప్రతిభ భారతఅవసరాలకు అనుగుణమైన సాంకేతిక పరిష్కారాలుగా రూపాంతరం చెందుతున్నదా?అన్న ప్రశ్నకు సంతృప్తికర సమాధానం ఇంకా కనిపించడం లేదు. విదేశాల్లో విజయవంతమైన నమూనాలను అనుసరించడం తాత్కాలిక ప్రయోజనం కలిగించవచ్చు. అయితే భారత వాతావరణం, సామాజిక పరిస్థితులు, గ్రామీణ జీవనం, ఆర్థిక సామర్థ్యానికి సరిపోయే స్వదేశీ సాంకేతికతను అభివృద్ధి చేసినప్పుడే నిజమైన ఆత్మనిర్భరత సాధ్యమవుతుంది. పరిశోధన పత్రాల ప్రచురణతో విశ్వవిద్యాలయాల బాధ్యత ముగియదు. ఆ పరిశోధన రైతు పొలంలో, పరిశ్రమలో, ఆసుపత్రిలో, గ్రామీణపాఠశాలలో, ప్రజలదైనందిన జీవితంలోఉపయోగపడినప్పుడే దానివిలువ తెలుస్తుంది.

- సి.హెచ్.ప్రతాన్, శ్రీకాకుళం

### మన బాధ్యత

పరిశుభ్రమైన పరిసరాలు ఆరోగ్యకరమైన జీవితానికి బలమైన పునాది. ఎక్కడ పడితే అక్కడ చెత్తను పారవేయడం వల్ల పరిసరాలు కలుషితమై అనేక వ్యాధులు వ్యాపించే అవకాశం ఉంటుంది. మన ఇల్లు మాత్రమే కాదు, మన వీధి, మనగ్రామం, మనపట్టణం కూడా శుభ్రంగా ఉండేలా ప్రతి ఒక్కరూ బాధ్యతతో వ్యవహరించాలి. తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించి, చెత్త బుట్టల్లో మాత్రమే వేయడంమంచి అలవాటు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం ద్వారా దోమలు, ఈగలు వంటి హానికర కీటకాల పెరుగుదలను తగ్గించవచ్చు. పరిశుభ్రత అనేది మన సంస్కృతిని, క్రమశిక్షణను ప్రతిబింబించే గొప్ప లక్షణం. ప్రతిఒక్కరూ పరిశుభ్రతను అలవాటుచేసుకోవాలి.

- నిమ్మగడ్డ కృష్ణ, హైదరాబాద్

### మంచి, చెడు

పచ్చటి పంట పొలాల మధ్య కొన్ని కలుపు మొక్కలు కూడా పెరుగుతుంటాయి. అలాగని పంటపొలాలను నాశనం చేయకూడదు. కలుపు గంజాయి మొక్కలను పీకి పారేయాలి. అలాగే కొన్నిసంస్థల్లో కార్యాలయాల్లో అవినీతిపరులుంటారు. వారి మూలంగా ఆ సంస్థ మొత్తానికి చెడ్డపేరు వస్తుంది. అలాంటి వారిని ఏరిపారేయాలి.

- ఎమ్.కిరణ్‌కుమార్, హైదరాబాద్

### విశ్వవిద్యాలయాలలో మృత్యుంజయ యాగాలా ?

2023లో అనంతపురం కేడీ యూనివర్సిటీలో జరిగిన ఒక సంఘటన యూనివర్సిటీ వైస్ చాన్సలర్, రిజిస్ట్రార్‌లు ఇద్దరు సైన్స్ లోఅధ్యాపకులు. ఆయూనివర్సిటీలో ఒక రెండుమూడు నెలలలో ఇద్దరో ముగ్గురి స్టాఫ్, ఇద్దరో విద్యార్థులు చనిపోయారు. ఈమరణాలతో ఆవేదన చెందినరిజిస్ట్రార్ , వైస్ చాన్సలర్ ఇద్దరు చావులు ఆపేందుకు బోధన ఉద్యోగులు 500 ,ఇతర స్టాఫ్ 100చందాతో మృత్యుంజయ యాగం చేసేందుకు సిద్ధమయ్యారు. అప్పుడే హేతువదసంఘం దీన్నివ్యతిరేకిస్తూ పత్రికలకు లేఖలు వ్రాయటం జరిగింది. యూనివర్సిటీ పాలకులే ఇంతగా దిగజారి వ్యవహరిస్తుంటే ఏమిచెయ్యాలో సైన్స్ సంఘాలు ముందుకురావాలి. మొత్తానికి ఫిబ్రవరిలో జరగవలసిన మృత్యుంజయ యాగం రద్దు చేస్తున్నట్లు 23 తేదీ రిజిస్ట్రార్ ప్రకటించాడు. మన ఆలోచన గలిగిన ఒక అడ్వకేట్ ఏపీ హైకోర్టులో కేసువేశాడు. ఈవిషయం బయటకు రానీయకుండా, వస్తే పరువు పోతుందని రిజిస్ట్రార్ రద్దు చేశాడు. ఇలాంటివి ఈమధ్య చాలా జరుగుతున్నాయి. కానీ ఎవరు సరిగా స్పందించటం లేదు. సరిగా స్పందిస్తే ప్రభుత్వాలు చేస్తున్న మూఢ నమ్మకాలకు గుడ్ బై చెప్పవచ్చు. చాలా ఆపవచ్చు.

- నార్నె వెంకటసుబ్బయ్య ప్రకాశం జిల్లా

### భూ కబ్జాలను అరికట్టాలి

మండల కేంద్రాలలోని కొన్ని కాలనీలలో భూకబ్జాలు, అక్రమ నిర్మాణాలు జరుగుతున్నాయి. ఎస్సీ ఎస్టీ వికలాంగులైన నిరుపేద బాధితులు రెవిన్యూ అధికారులకు, పోలీసు అధికారులకు ఫిర్యాదు చేసి నెలలు గడుస్తున్నా కూడా భూ సమస్యలు నెరవేరడం లేదు. అధికారుల చుట్టూ, ప్రజాప్రతినిధుల చుట్టూ తిరిగి తిరిగి విసిగి వేసారి పోతున్నారు. జిల్లా కలెక్టర్లు ఆయా జిల్లాలలోని రెవెన్యూ కార్యాలయాలలో, పోలీస్ స్టేషన్లలో పెండింగ్‌లో ఉన్న భూకబ్జాల దరఖాస్తులు పరిశీలించి పరిష్కరించాలి. కాలనీకి సంబంధించిన కొలతలు, విస్తీర్ణం, సరిహద్దులు అన్ని రెవెన్యూ రికార్డులను చూసి పరిష్కరించాలి.

- కదురు శ్రీనివాస్, వరంగల్

### ఆపదలో మిత్రులను ఆదుకోవాలి

మానవ సమాజంలో ప్రతి వ్యక్తికి ఇతర వ్యక్తులతో నిరంతరం అవసరాలు ఉంటాయి. అవసరాలు లేవు వీడితో నాకేం పని అనేకోణంలో ఎప్పుడూ ఆలోచించదవద్దు. చిన్నచూపుచూడొద్దు విపత్కర పరిస్థితుల్లో ఆదుకున్న మిత్రులను జీవిత కాల మొత్తం రుణపడి ఉండాలి. మిత్రులందరూ కలిసిమెలిసిగా ఉండాలి. అందరుకలిసిఉంటేనే అన్నిసక్రమంగా జరుగుతాయి.

- మోతె శివకుమార్, రంగారెడ్డిజిల్లా

గమనిక: ఎడిటోరియల్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలలోని అంశాలు, విశ్లేషణలు వ్యాసకర్త సొంత అభిప్రాయాలు. వాటితో పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. -ఎడిటర్

మనవి | ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# ఎపి, కర్ణాటకకు 'రైలు' వరాలు



వివరాలు వెల్లడించిన కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్

## రూ.1,264 కోట్లతో మల్టీట్రాకింగ్ రైలు ప్రాజెక్టు

## 2028-29నాటికి పూర్తి: కేంద్ర కేబినెట్ నిర్ణయం

## రూ.3030 కోట్లతో భవ్య రసాయన స్కీమ్‌కి ఆమోదం

**న్యూఢిల్లీ, జులై 24:** ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ అధ్యక్షతన శుక్రవారం నిర్వహించిన ఆర్థిక వ్యవహారాల క్యాబినెట్ కమిటీ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటకలోని గుంతకల్ - బళ్లారి విభాగంలో మూడవ, నాల్గవ రైల్వే లైన్ల నిర్మాణానికి రూ.1,264 కోట్ల పెట్టుబడితో ఆమోదం తెలిపింది. కర్ణాటక, ఆంధ్రప్రదేశ్‌లోని మూడు జిల్లాల పరిధిలో చేపట్టే ఈ మల్టీట్రాకింగ్ ప్రాజెక్టు, భారతీయ రైల్వే నెట్‌వర్క్‌ను సుమారు 46 కిలోమీటర్ల మేర విస్తరించనుంది. 2028-29 నాటికి పూర్తవుతుంది. ఈ ప్రాజెక్టు సుమారు ఏడు లక్షల జనాభా కలిగిన దాదాపు 99 గ్రామాలకు రవాణా సౌకర్యాలను మెరుగుపరుస్తుంది. పెరిగిన సామర్థ్యం వల్ల బళ్లారి కోట, శ్రీ కుమార స్వామి ఆలయం వంటి దేశంలోని అనేక ప్రముఖ పర్యాటక ప్రాంతాలకు రైలు అనుసంధానం మెరుగుపడుతుందని సమావేశం అనంతరం కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ మీడియా సమావేశంలో వివరించారు. ప్రతిపాదిత ప్రాజెక్టు ఇనుప ఖనిజం, డోలమైట్, సున్నపు రాయి, ఇనుము, ఉక్కు, బొగ్గు, ఎరువులు, ఆహార ధాన్యాలు వంటి సరుకుల రవాణాకు కీలకమైన మార్గం. సామర్థ్య పెంపు పనుల ఫలితంగా ఏటా అదనంగా 16.22 మిలియన్ టన్నుల సరుకు రవాణా జరుగుతుందని వివరించారు. అంతేకాకుండా, రైల్వే రవాణా పర్యావరణ అనుకూలమైనది. ఇంధన సామర్థ్యం కలిగినది కాబట్టి, నెట్‌వర్క్ విస్తరణ వాతావరణ లక్ష్యాలను సాధించడంలోనూ, దేశ లాజిస్టిక్స్ ఖర్చులను తగ్గించడంలోనూ సహాయపడుతుంది. దీనివల్ల దేశ చమురు దిగుమతి సుమారు 1.32 కోట్ల లీటర్లు తగ్గడమే కాకుండా, కార్బన్ డై ఆక్సైడ్ ఉద్గారాలు 6.67 కోట్ల కిలోల మేర తగ్గుతాయని అంచనా. ఇది 0.27 కోట్ల మొక్కలు నాటడంతో సమానమని మంత్రి వివరించారు. సమీకృత ప్రణాళిక, సంబంధిత వర్గాల సంప్రదింపుల ద్వారా మల్టీమోడల్ అనుసంధానం, లాజిస్టిక్స్ సామర్థ్యాన్ని పెంపొందించడంపై దృష్టి సారిస్తూ, 'పిఎంగతి శక్తి నేషనల్ మాస్టర్ ప్లాన్‌'కు అనుగుణంగా ఈ ప్రాజెక్టు రూపొందించబడింది. ఈ ప్రాజెక్టు ప్రజలు, సరుకులు, సేవల రవాణాకు అతుకులు లేని అనుసంధానాన్ని కల్పిస్తుందని పేర్కొన్నారు. పెరిగిన లైన్ సామర్థ్యం రవాణా వేగాన్ని గణనీయంగా పెంచుతుంది, తద్వారా భారతీయ రైల్వేకు నిర్వహణ సామర్థ్యం, సేవా విశ్వసనీయత మెరుగుపడతాయి. ఈ బహుళ ట్రాక్ ప్రతిపాదన కార్యకలాపాలను క్రమబద్ధీకరించడానికి, ~~రద్దీని తగ్గించడానికి దోహదపడు~~తుంది. ఈ ప్రాంతంలో సమగ్ర అభివృద్ధి ద్వారా ప్రజలకు ఉపాధి అవకాశాలను మెరుగుపరచి, వారిని 'ఆత్మనిర్భర్' (స్వయం సమృద్ధులు)గా తీర్చిదిద్దాలన్న ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ 'నవ భారత్' ఆశయానికి ఈ ప్రాజెక్ట్ అనుగుణంగా ఉందని కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ పేర్కొన్నారు. రసాయన రంగాన్ని బలోపేతం చేయడానికి, ఉమ్మడి పారిశ్రామిక మౌలిక సదుపాయాలను కల్పించడానికి దేశవ్యాప్తంగా మూడు ప్రత్యేక రసాయన పార్కులను ఏర్పాటు చేసే రూ.3,030 కోట్ల పథకాన్ని ప్రభుత్వం శుక్రవారం ప్రకటించింది. ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ అధ్యక్షతన జరిగిన కేంద్ర మంత్రివర్గ సమావేశంలో 'భారత్ పారిశ్రామిక్ వికాస్ యోజన రసాయన్' (బిహెచ్‌ఎవివైఎ-రసాయన్) పథకానికి ఆమోదం లభించిందని సమాచార, ప్రసార శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ తెలిపారు. 2026-27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన కేంద్ర బడ్జెట్‌లో ప్రకటించిన ఈ పథకానికి మొత్తం రూ. 3,030 కోట్ల వ్యయం కేటాయించబడింది. ఇందులో రూ.3,000 కోట్లను పార్కుల పరిధిలో ఉమ్మడి మౌలిక సదుపాయాలు, ప్రాథమిక సౌకర్యాల కల్పనకు వినియోగిస్తారు, మిగిలిన రూ.30 కోట్లను పరిపాలనాపరమైన ఖర్చుల కోసం కేటాయించారు. ఈ పథకం ప్రస్తుత ఆర్థిక సంవత్సరం నుండి 2030-31 వరకు ఐదేళ్ల కాలంలో అమలు చేయబడుతుంది. ఈ మూడు పార్కుల అభివృద్ధికి అవసరమైన మొత్తం పెట్టుబడి చాలా ఎక్కువగా ఉంటుందని, కేంద్రం కేటాయించిన రూ.3,030 కోట్లు కేవలం ఉమ్మడి మౌలిక సదుపాయాల కల్పన కోసమేనని వైష్ణవ్ పేర్కొన్నారు. "ఆర్థిక వ్యవస్థలో అనేక కీలకమైన రంగాలు ఉన్నాయి, అందులో రసాయన రంగం ఒకటి. ఎందుకంటే ఇది అనేక ఇతర పరిశ్రమలకు అవసరమైన ప్రాథమిక ముడి పదార్థాలను అందిస్తుంది" అని ఆయన అన్నారు.

అధికారిక ప్రకటన ప్రకారం, సంబంధిత రాష్ట్ర ప్రభుత్వం కనీసం రూ.500 కోట్ల వాటాను సమకూర్చుకునే షరతుకు లోబడి, ఒక్కో రసాయన పార్కుకు కేంద్రం రూ.1,000 కోట్ల వరకు గ్రాంట్‌ను అందిస్తుంది. ఉమ్మడి మౌలిక సదుపాయాలను కల్పించడం, పారిశ్రామిక వృద్ధికి మద్దతు ఇవ్వడం ద్వారా రసాయన పరిశ్రమ అభివృద్ధిని ప్రోత్సహించడానికి ఈ పథకం సహాయపడుతుందని ప్రభుత్వం తెలిపింది.



# మీకెంత ధైర్యం?

## ఆందోళనల్లో పాల్గొన వద్దని విద్యార్థులను హెచ్చరిస్తారా?

## వర్సిటీల వైఖరిపై రాహుల్‌గాంధీ ఆగ్రహం

**న్యూఢిల్లీ, జులై 24:** నీట్ లీక్‌పై కాక్రోచ్ జనతా పార్టీ (సిజెపి) ఆధ్వర్యంలో జరుగుతోన్న ఆందోళనలకు దూరంగా ఉండాలని పలు యూనివర్సిటీలు విద్యార్థులను హెచ్చరించడంపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ ఆగ్రహం వ్యక్తం చేశారు. దేశంలో జరుగుతోన్న తప్పులను ప్రశ్నించడానికి విద్యార్థులు తమ ప్రజాస్వామ్య హక్కులను వినియోగించుకుంటున్నారన్నారు. వారిని ఆందోళనల్లో పాల్గొన్న వద్దని హెచ్చరించడానికి మీకెంత ధైర్యం అంటూ మండిపడ్డారు. సమయం వచ్చినప్పుడు ఇలాంటి చర్యలకు ఆయా విశ్వవిద్యాలయాలు జవాబుదారీగా ఉండాల్సి ఉంటుందన్నారు. జంతర్‌మంతర్ వద్ద జరిగే ఆందోళనలపై చట్టపరమైన చర్యలు తీసుకునే అవకాశం ఉందని, అందువల్ల ఎవరూ ఆ ప్రాంతానికి వెళ్లొద్దని ఢిల్లీ యూనివర్సిటీ(డియు), జవహర్‌లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయం (జెఎన్‌యు), ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఐఐటి) రూర్కీ, ఐఐటి మద్రాస్ సహా పలు విద్యాసంస్థలు తమ విద్యార్థులకు సూచించాయి. సోషల్ మీడియాలో కూడా నిరసనలకు సంబంధించి ఎలాంటి పోస్టులు చేయొద్దని కోరాయి. సుప్రీంకోర్టు మార్గదర్శకాల మేరకు ఈ హెచ్చరిక జారీ చేసినట్లు తెలిపాయి. ఈ క్రమంలోనే రాహుల్‌గాంధీ స్పందించారు. విశ్వవిద్యాలయాలు ఇచ్చిన సర్క్యులర్‌పై పలువురు ప్రముఖులు సైతం విమర్శలు గుప్పిస్తున్నారు. ఢిల్లీ విశ్వవిద్యాలయం పూర్వ విద్యార్థిగా, పార్లమెంట్ సభ్యుడిగా డియు విడుదల చేసిన ఈ ప్రకటనను ఖండిస్తున్నాను. జంతర్ మంతర్ వద్ద ప్రదర్శనలు చట్టవిరుద్ధమని ఎవరు ప్రకటించారు? ఇలాంటి విషయాల్లో తప్పుడు ప్రచారాలు చేయడం సిగ్గుచేటని ఎంపి దీపేందర్ హుడా అన్నారు. విద్యార్థుల గొంతులను అణచివేస్తే వారి భద్రత మరింత ప్రమాదంలో పడుతుంది. మనకు నిజంగా వారి భవిష్యత్తుపై ఆందోళన ఉంటే మౌనంగా ఉండకుండా విద్యార్థుల ప్రజాస్వామ్యహక్కులకు మద్దతు ఇవ్వాలని బాలీవుడ్ నటి, చిత్ర నిర్మాత పూజాభట్ అన్నారు.



## హిమాచల్‌లో ఘోర విషాదం..

## కొండచరియలు విరిగి టాక్సీపై పడటంతో 13 మంది మృతి

**సిమ్లా, జులై 24:** హిమాచల్ ప్రదేశ్‌లోని లాహౌల్ స్పీతి జిల్లాలో శుక్రవారం ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. ఉదయ్‌పూర్-పాంగీ రహదారిపై కడు నాలా సమీపంలో కొండచరియ ఒక్కసారిగా విరిగి టాటా సుమో టాక్సీపై కూలిపోవడంతో వాహనం పూర్తిగా శిథిలాల కింద చిక్కుకుంది. ఈ ప్రమాదంలో 13 మంది మృతి చెందగా, ఒకరిని గాయాలతో సురక్షితంగా బయటకు తీసినట్లు అధికారులు తెలిపారు. మరో వ్యక్తి కోసం సహాయక బృందాలు గాలింపు చర్యలు కొనసాగిస్తున్నాయి. జిల్లా డిప్యూటీ కమిషనర్ కిరణ్ బదానా తెలిపిన వివరాల ప్రకారం, ప్రమాదం జరిగిన సమయంలో టాటా సుమోలో మొత్తం 15 మంది ప్రయాణిస్తున్నారు. ఉదయ్ పూర్-కిల్లర్ రహదారి కొండచరియల కారణంగా ఒక రోజు పాటు మూసివేయబడగా, శుక్రవారం తిరిగి ప్రారంభించడంతో ప్రయాణికులు పాంగీ లోయ వైపు తమ ప్రయాణాన్ని పునఃప్రారంభించారు. లాహౌల్ లోయకు సుమారు 60 నుంచి 70 కిలోమీటర్ల దూరంలోని కడు నాలా వద్ద ప్రయాణిస్తున్న సమయంలో భారీగా కొండచరియ విరిగి, పెద్ద రాళ్లు, మట్టి ఒక్క సారిగా టాక్సీపై పడ్డాయి. దీంతో వాహనం పూర్తిగా శిథిలాల కింద కూరుకుపోయి, అందు లోని ప్రయాణికులు చిక్కుకుపోయారు. సమాచారమందుకున్న వెంటనే టిండి పోలీస్‌స్టేషన్ సిబ్బంది, జిల్లా యంత్రాంగం, సహాయక బృందాలు సంఘటనా స్థలానికిచేరుకుని సహాయక చర్యలు ప్రారంభించాయి.

# అత్యవసర పిటిషన్ ఏదీ రాలేదే..



## సుప్రీం కోర్టు తిరస్కరించిందన్న ఆరోపణలను ఖండించిన సిజెఐ సూర్యకాంత్

## సోషల్ మీడియా పోస్టులపై నిషేధం

**న్యూఢిల్లీ, జులై 24:** 'చలో పార్లమెంట్' నిరసనల సందర్భంగా పోలీసుల తీరుపై అత్యవసర పిటిషన్ దాఖలు కాగా విచారణకు సుప్రీంకోర్టు తిరస్కరించిందన్న వార్తలను సిజెఐ సూర్యకాంత్ కొట్టిపారేశారు. అవన్నీ తప్పుడు కథనాలని పేర్కొన్నారు. కాక్రోచ్ జనతాపార్టీ (సిజెపి) ఆందోళనలపై అసలు పిటిషనే దాఖలు కాలేదన్నారు. గత రెండు రోజులుగా మీడియా బాధ్యతరాహిత్యంగా ప్రవర్తిస్తోందని ఘాటుగా వ్యాఖ్యానించారు. అత్యవసర పిటిషన్‌ను సిజెఐ విచారణకు స్వీకరించలేదని తప్పుడు వార్తలు ప్రసారం చేస్తోందన్నారు. శుక్రవారం కోర్టు విచారణ ప్రారంభమైన తర్వాత న్యాయవాదులు తమ కేసులను అత్యవసరంగా స్వీకరించాలని విజ్ఞప్తి చేసిన సందర్భంగా సిజెఐ ఈ వ్యాఖ్యలు చేశారు. 'ఇవాళ (శుక్రవారం) ఉదయం 10 గంటల వరకు సిజెపి ఆందోళనలకు సంబంధించి ఒక్క పిటిషన్ కూడా దాఖలు కాలేదు. ఈ అంశంపై విచారణచేపట్టాలని ఎవరో ఒక లాయర్ మాత్రం విజ్ఞప్తి చేశారు. ఓ అభ్యర్థనను పిటిషన్‌గా ఎలా స్వీకరిస్తాం?' అని సిజెఐ అన్నారు. ఈ నెల 20న సిజెఐ చేపట్టిన చలో పార్లమెంట్ ఉద్రిక్తంగా మారిన నేపథ్యంలో అత్యవసరంగా విచారణ చేపట్టాలని న్యాయవాది నరేంద్ర మిశ్రా బుధవారం సుప్రీంకోర్టును అభ్యర్థించారు. పోలీసు దాడులకు సంబంధించి తన వద్ద విడియో ఆధారాలు కూడా ఉన్నాయని చెప్పారు. ఆందోళనకారుల్లో ఎక్కువ మంది విద్యార్థులే ఉన్నారని, వారి కోసమైనా అత్యవసరంగా విచారణ చేపట్టాలని కోరారు. అయితే, సుప్రీంకోర్టు అందుకు తిరస్కరించినట్లు వార్తలు వచ్చాయి. కోర్టు సమయాన్ని వృథా చేయొద్దని, అలాగే పిటిషనర్ కూడా సమయం వృథా చేసుకోవద్దని సిజెఐ హితవు పలికినట్లు రాసుకొచ్చాయి. నిరసనకారులపై పోలీసు చర్యకు సంబంధించిన విడియోల గురించి పిటిషనర్ తరపు న్యాయవాది ప్రస్తావించగా 'మాకు విడియోలు చూసే సమయం లేదు' అని సిజెఐ అన్నట్లు కూడా కథనాలు వెలువడ్డాయి.

**సోషల్ మీడియా పోస్టులపై నిషేధం**

మరోవైపు, కోర్టు విచారణలకు సంబంధించిన ఆడియో, విడియోలను సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేయడంపై సుప్రీంకోర్టు నిషేధం విధించింది. ఒకవేళ పోస్టు చేయాలనుకుంటే సుప్రీంకోర్టు లేదా హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్స్ నుంచి ముందస్తు అనుమతి తీసుకోవాలని ఆదేశించింది. కోర్టు కార్యకలాపాలను సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేయడం వల్ల దుర్వినియోగమవు తున్నాయని పిటిషనర్ తరపు న్యాయవాది వికాస్‌సింగ్ కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. దీనికి సొలిసిటర్ జనరల్ తుసార్ మెహతా కూడా అంగీకరించారు. నియంత్రణ ఉండాల్సిన అవసరం ఉందన్నారు. ఈ అంశంపై పూర్తి వివరణ ఇవ్వాలని కేంద్రానికి సుప్రీంకోర్టు నోటీసులు జారీ చేసింది. ముందస్తు చర్యల్లో భాగంగా నిషేధం విధిస్తున్నట్లు వెల్లడించింది.

# ఎంపిక చేసిన దిగుమతులపై అమెరికా కొత్త సుంకాలు



## భారత్ సహా 60 దేశాలపై ట్రంప్ సర్కార్ కొత్త టారిఫ్‌లు

## నేటి నుంచే అమలులోకి..

**వాషింగ్టన్,జులై 24:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రభుత్వం ప్రపంచ వాణిజ్యంలో మరో కీలక నిర్ణయం తీసుకుంది. భారత్, యూరోపియన్ యూనియన్ (ఈయూ), చైనా, జపాన్ సహా మొత్తం 60 వాణిజ్య భాగస్వామ్య దేశాల నుంచి దిగుమతి అయ్యే వస్తువులపై 10 నుంచి 12.5 శాతం కొత్త సుంకాలను (టారిఫ్‌లు) శుక్రవారం నుంచి అమల్లోకి తీసుకొచ్చింది. ఈ నిర్ణయంపై ప్రపంచవ్యాప్తంగా పలు దేశాలు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశాయి. బలవంతపు శ్రమతో తయారైన వస్తువుల దిగుమతులను అరికట్టడంలో ఆయా దేశాలు విఫలమయ్యాయని ఆరోపిస్తూ అమెరికా ఈ నిర్ణయం తీసుకున్నట్లు ప్రకటించింది. ఈ ఆరోపణలను పలుదేశాలు పూర్తిగా ఖండించాయి. పాత తాత్కాలిక సుంకాల స్థానంలో కొత్త టారిఫ్‌లుశుక్రవారం అర్ధరాత్రి నుంచి అమల్లోకి వచ్చిన ఈ కొత్త సుంకాలు, ఇప్పటి వరకు అమల్లో ఉన్న 10 శాతం తాత్కాలిక గ్లోబల్ టారిఫ్‌ను భర్తీ చేశాయి. ఈ ఏడాది ఫిబ్రవరిలో ట్రంప్ గతంలో అత్యవసర అధికారాల కింద విధించిన "పరస్పర సుంకాలను" అమెరికా సుప్రీంకోర్టు రద్దు చేసిన నేపథ్యంలో, 1974 అమెరికా ట్రేడ్ యాక్ట్‌లోని సెక్షన్301 ప్రకారం ఈ కొత్త టారిఫ్‌లను అమలు చేస్తున్నారు. ఈ సుంకాలు అమెరికా దిగుమతుల్లో సుమారు 99.4 శాతం వస్తువులకు వర్తిస్తాయి. చమురు, సహజ వాయువు, ఎరువులు, కొన్ని ఆహార ఉత్పత్తులు, విమానాలు, విమాన విడిభాగాలు, కీలక ఖనిజాలు, ఇప్పటికే జాతీయ భద్రతా సుంకాలు అమల్లో ఉన్న ఉక్కు, అల్యూమినియం, రాగి, ఆటోమొబైల్ ఉత్పత్తులకు మినహాయింపు కల్పించారు. అమెరికా వాణిజ్య ప్రతినిధి జేమీసన్ గ్రీర్ మాట్లాడుతూ, బలవంతపు శ్రమతో తయారైన వస్తువుల దిగుమతులపై అమెరికాలో దాదాపు వందేళ్లుగా నిషేధం అమల్లో ఉంది. మేము దానిని కఠినంగా అమలు చేస్తున్నాం. మా వాణిజ్య భాగస్వామ్య దేశాలు కూడా అదే విధానాన్ని అనుసరించాల్సిన సమయం ఆసన్నమైందని తెలిపారు. భారత్‌తో పాటు అర్జెంటీనా, బంగ్లాదేశ్, బ్రిటన్, కంబోడియా, కెనడా, ఈక్వెడార్, ఎల్ సాల్వడార్, గ్వాటెమాలా, హోండురాస్, ఇండోనేషియా, జోర్డాన్, మలేషియా, మెక్సికో, పాకిస్థాన్, శ్రీలంక, ట్రినిడాడ్ అండ్ టొబాగో దేశాలపై 10 శాతం టారిఫ్ విధించారు. ఈ దేశాల్లో బలవంతపు శ్రమతో తయారైన వస్తువుల దిగుమతులను నిషేధించే చట్టాలు ఉన్నప్పటికీ వాటిని సమర్థవంతంగా అమలు చేయడం లేదని అమెరికా పేర్కొంది. భారత్‌ను 10 శాతం కేటగిరీలో ఉంచడం వల్ల, 12.5 శాతం సుంకం విధించిన దేశాలతో పోలిస్తే తక్కువ భారం పడుతున్నప్పటికీ, బలవంతపు శ్రమతో తయారైన వస్తువుల దిగుమతులపై అమలును మరింత కఠినతరం చేయాల్సిన అవసరం ఉందని వాషింగ్టన్ స్పష్టం చేసింది. చైనా, వియత్నాంకు 12.5 శాతం టారిఫ్‌చైనా, వియత్నాం సహా మరో 38 దేశాలపై 12.5 శాతం సుంకం విధించారు. బలవంతపు శ్రమతో తయారైన ఉత్పత్తులపై తగిన చర్యలు తీసుకోకపోవడం లేదా అమెరికా ప్రత్యేక నిఘాలో ఉండటమే దీనికి కారణమని తెలిపింది. చైనాలో ఉయ్‌ఘర్ ముస్లింలపై బలవంతపు శ్రమ ఆరోపణలను బీజింగ్ మరోసారి ఖండించింది. ప్రపంచ దేశాల తీవ్ర స్పందనఅమెరికా నిర్ణయంపై చైనా తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. ఏకపక్ష సుంకాలను తాము వ్యతిరేకిస్తున్నామని, వాణిజ్య యుద్ధాల వల్ల ఎవరికీ ప్రయోజనం ఉండదని పేర్కొంది. ఆస్ట్రేలియా, బ్రెజిల్ ఈ టారిఫ్‌లను 'అన్యాయమైనవి'గా అభివర్ణిస్తూ వాటిని తొలగించాలని కోరాయి. నార్వే కూడా ఈ సుంకాలకు ఎలాంటి చట్టబద్ధమైన ఆధారం లేదని విమర్శించింది.



## సిజెపి నిరసనల్లో విద్రోహశక్తులు

### హెచ్చరించిన నిఘా సంస్థలు

**న్యూఢిల్లీ,జులై 24:** నీట్ యూజీ పేపర్ లీక్ వ్యవహారంపై దేశవ్యాప్తంగా కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) ఆధ్వర్యంలో నిరసనలు కొనసాగుతున్న వేళ, నిఘా సంస్థలు సంచలన హెచ్చరికలు జారీ చేశాయి. ఈ ఆందోళనలను ఆసరాగా చేసుకుని దేశంలో అశాంతిని సృష్టించేందుకు, హింసను ప్రేరేపించేందుకు విద్రోహ శక్తులు భారీ స్థాయిలో దుష్ప్రచారానికి తెరలేపినట్లు స్పష్టం చేశాయి. సోషల్ మీడియా ద్వారా నకిలీ, తప్పుదోవ పట్టించే కంటెంట్‌ను వ్యాప్తి చేసి ప్రజలను రెచ్చగొట్టే ప్రమాదం ఉందని ఇంటెలిజెన్స్ వర్గాలు హెచ్చరించాయి. యూనిఫాంలో ఉన్న సైనిక లేదా పోలీసు సిబ్బంది ప్రభుత్వానికి వ్యతిరేకంగా రాజకీయ వ్యాఖ్యలు చేస్తున్నట్లు చిత్రీకరించిన పలు నకిలీ వీడియోలు ఇప్పటికే ఆన్‌లైన్‌లో చక్కర్లు కొడుతున్నట్లు నిఘా వర్గాలు గుర్తించాయి. ప్రస్తుతం నెలకొన్న అస్థిర పరిస్థితిని తమకు అనుకూలంగా మార్చుకుని, అల్లర్లను సృష్టించేందుకు సంఘ విద్రోహ శక్తులు ప్రయత్నిస్తున్నాయని ఇంటెలిజెన్స్ బ్యూరో అధికారి ఒకరు తెలిపారు.

# దక్షిణ గుజరాత్‌లో వరదల బీభత్సం



**అహ్మదాబాద్,జులై 24:** దేశంలో ఎల్‌నినో ప్రభావం వెంటాడుతున్న తరుణంలో గుజరాత్‌లో భారీ వర్షాలు రాష్ట్రాన్ని ముంచెత్తాయి. నిన్నటి నుంచి కురుస్తున్న వర్షాలతో నగరాల్లోకి వరద అతలాకుతలం చేసింది. అహ్మదాబాద్, సూరత్, నవసారి, వల్సాద్, ఖేడా, తాపి సహా పలు జిల్లాల్లో భారీ వర్షాలు బీభత్సం సృష్టించాయి. దీంతో అనేక ప్రాంతాల్లో వరదలు సంభవించాయి. నివాసాలు మునిగిపోయాయి. రోడ్లు చెరువులను తలపిస్తున్నాయి. నదులు, వాగులే కాదు.. గ్రామాలు, పట్టణాలు, మార్కెట్లు కూడా ముంపునకు గురయ్యాయి. అనేక చోట్ల జాతీయ రహదారులు, రైల్వే ట్రాక్‌లు కూడా నీట మునిగాయి. దీంతో అధికార యంత్రాంగం రంగంలోకి దిగి సహాయ చర్యలు చేపట్టింది. ఐదు హెలికాప్టర్లతో సహాయ చర్యలు అందిస్తున్నారు. బాధితులను సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నారు. గుజరాత్‌లో కురుస్తున్న భారీ వర్షాలు సాధారణ జనజీవనాన్ని అస్తవ్యస్తం చేశాయి. దక్షిణ గుజరాత్‌లోని పలు జిల్లాలు భయాందోళనలో ఉన్నాయి. స్థానిక పోలీసులు, పరిపాలన యంత్రాంగంతో పాటు ఎన్‌డీఆర్‌ఎఫ్, ఎస్‌డిఆర్‌ఎఫ్ బృందాలు సహాయక, రెస్క్యూ ఆపరేషన్లలో నిమగ్నమైయ్యాయి. ముఖ్యమంత్రి భూపేంద్ర పటేల్ పరిస్థితిని అంచనా వేయడానికి వరద ప్రభావిత ప్రాంతాలను సందర్శిస్తున్నారు. నవసారి, వల్సాద్ జిల్లాలు తీవ్రంగా ప్రభావితమయ్యాయి. ఒక్క వల్సాద్‌లోనే సుమారు 1,200 మందిని సురక్షిత ప్రాంతాలకు తరలించినట్లు అధికారులు తెలిపారు. వల్సాద్, దాని పొరుగున ఉన్న నవసారి జిల్లాల నుంచి కలిపి 22,000 మందికి పైగా ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించారు.

బుధవారం నుంచి కురుస్తున్న భారీ వర్షాల కారణంగా నవసారి, వల్సాద్ మినహా సూరత్, అహ్మదాబాద్, ఖేడా, తాపి, డాంగ్ ప్రాంతాల్లో జనజీవనం స్తంభించి పోయింది. వల్సాద్ జిల్లాలోని ఉమర్‌గావ్ తాలూకాలో గత 36 గంటల్లో రికార్డు స్థాయిలో 1,200 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. అధికారుల ప్రకారం ప్రభావిత జిల్లాల్లో జాతీయ విపత్తు ప్రతిస్పందన దళం, రాష్ట్ర విపత్తు ప్రతిస్పందన దళం బృందాలు మోహరించాయి. అదనంగా సహాయక, రెస్క్యూ కార్యకలాపాల కోసం నవసారి, వల్సాద్ జిల్లాల్లో రెండు ఆర్మీ దళాలు మోహరించాయి. గాంధీనగర్‌లోని రాష్ట్ర అత్యవసర కార్యకలాపాల కేంద్రం ప్రకారం.. వల్సాద్ జిల్లాలోని ఉమర్‌గావ్ తాలూకాలో 36 గంటల వ్యవధిలో 1,200 మిల్లీమీటర్లకు పైగా వర్షపాతం నమోదైంది. ప్రభావిత జిల్లాలన్నింటిలో శుక్రవారం నుంచి పాఠశాలలు, కళాశాలలను మూసివేశారు. ప్రధాని మోడీ ముఖ్యమంత్రి భూపేంద్ర పటేల్‌తో ఫోన్‌లో మాట్లాడి వర్ష ప్రభావిత జిల్లాలకు కేంద్ర ప్రభుత్వం నుంచి సాధ్యమైనంత సహాయం అందిస్తామని హామీ ఇచ్చారు.

# సంక్షిప్త వార్తలు

## నేపాల్ సరిహద్దుల్లో వారిస్ పంజాబ్‌దే సానుభూతిపరుల అరెస్ట్



**లక్నో,జులై 24:** ఉత్తరప్రదేశ్ నేపాల్ సరిహద్దు వద్ద భారత భద్రతా దళాలు భారీ ఆపరేషన్ చేపట్టి ఒక పెద్ద ఉగ్రకుట్రను భగ్నం చేశాయి. ఖలిస్థాన్ అనుకూల సంస్థ వారిస్ పంజాబ్ దేకు చెందిన మోస్ట్ వాంటెడ్ సభ్యుడితో పాటు, ఆ సంస్థతో సంబంధాలున్న ఒక అమెరికన్ పౌరుడిని సరిహద్దు వద్ద రక్షణ దళాలు అదుపులోకి తీసుకున్నాయి. ఉత్తరప్రదేశ్‌లోని బహ్రైచ్ జిల్లా పరిధిలో ఉన్న రూపైడీహా సరిహద్దు పోస్ట్ వద్ద సశస్త్ర సీమా బల్, ఉత్తరప్రదేశ్ పోలీసులు సంయుక్తంగా ఈ తనిఖీలు చేపట్టారు.

## విద్యార్థులను శత్రువుల్లా చూస్తున్న కేంద్రం: సోనియా




**న్యూఢిల్లీ,జులై 24:** నీట్ పేపర్ లీక్‌పై దేశవ్యాప్తంగా ఆందోళన చేస్తున్న విద్యార్థులను కేంద్ర ప్రభుత్వం దేశ శత్రువుల్లా చూస్తోందని కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ ఛైర్‌పర్సన్ సోనియా గాంధీ ఆరోపించారు. విద్యార్థుల ధైర్యానికి ప్రభుత్వం జవాబుదారీతనంతో స్పందించాల్సింది పోయి, లాఠీచార్జీలు, బాష్పవాయువు ప్రయోగంతో అణచివేస్తోందని విమర్శించారు. శుక్రవారం ఒక ఆంగ్లపత్రికలో ప్రచురితమైన తన వ్యాసంలో సోనియా గాంధీ కేంద్ర ప్రభుత్వ తీరును తీవ్రంగా తప్పుబట్టారు. నీట్ పేపర్ లీక్, పరీక్షల వ్యవస్థలో లోపాలు, విద్యా సంస్కరణల కోసం విద్యార్థులు న్యాయమైన డిమాండ్లు చేస్తున్నారని పేర్కొన్నారు.

## 1100 రోజుల నుంచి తండ్రి జైలులోనే: ఇమ్రాన్ కుమారుడు



**రావల్పిండి,జులై 24:** పాకిస్థాన్ మాజీ ప్రధాని, మాజీ క్రికెట్ కెప్టెన్ ఇమ్రాన్ ఖాన్ ఆరోగ్యంపై ఆయన కుమారుడు ఖాసిం ఖాన్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. తన తండ్రి 1100 రోజులుగా జైలులోనే ఉన్నారని, ఆయన కంటి చూపు క్రమంగా క్షీణిస్తోందని, ఆయనను కలుసుకోవడానికి పాక్ అధికారులు అనుమతి ఇవ్వడం లేదని ఖాసిం ఆరోపించారు. పాక్ సైన్యం ప్రజాస్వామ్యాన్ని బలహీనపరుస్తోందని, రాజకీయ పక్షాలను అణిచివేస్తోందని ఆయన ఆరోపించారు. ఈ విషయంపై అంతర్జాతీయ సమాజం స్పందించాలని కోరారు.

## ప్రధాని మోడీ సెల్ఫీ విడియోపై ఖర్గే ధ్వజం



**న్యూఢిల్లీ,జులై 24:** నీట్ అక్రమాలు, పేపర్ లీకేజీల వ్యవహారంలో దేశవ్యాప్తంగా నిరసనలు వెల్లు వెత్తుతున్న వేళ ప్రధాని నరేంద్ర మోడీ అర్ధరాత్రి వేళ సెల్ఫీ వీడియో విడుదల చేయడంపై ఏఐసీసీ అధ్యక్షుడు, రాజ్యసభ విపక్ష నేత మల్లికార్జున ఖర్గే తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. ఏకపక్షంగా రేడియో లేదా వీడియోల ద్వారా మన్ కీ బాత్ ఉపన్యాసాలు ఇవ్వడం మాని, విద్యార్థుల జీవితాలతో ముడిపడి ఉన్న ఈ కీలక అంశంపై పార్లమెంట్ వేదికగా స్పష్టమైన సమాధానం చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. పార్లమెంట్ సమావేశాలు జరుగుతున్న సమయంలో ప్రధాని అర్ధరాత్రి వేళ వీడియోల ద్వారా సందేశాలు ఇవ్వడం కాకుండా, ఉభయ సభల ఎదుట అధికారికంగా ప్రకటన విడుదల చేయాలని స్పష్టం చేశారు.

## సౌదీ యువరాజు మృతిపై వీడిన మిస్టరీ..



**లండన్,జులై 24:** సౌదీ అరేబియాకు చెందిన 29 ఏళ్ల యువరాజు అబ్దుల్లా బిన్ ఫహాద్ లండన్‌లోని ఒక విలాసవంతమైన హోటల్‌లో కన్నుమూసారు. మితిమీరిన మద్యం, మాదకద్రవ్యాల వల్లే ఆయన ప్రమాదవశాత్తు మరణించినట్లు యూకే దర్యాప్తులో తేలింది. ఈ మరణంలో ఎలాంటి కుట్ర కోణం లేదని, ఇది ఆత్మహత్య కూడా కాదని స్థానిక కోర్టు స్పష్టం చేసింది.

## ఎందుకు విరమించానో చెప్తా: వాంగ్‌చుక్



**న్యూఢిల్లీ,జులై 24:**సోనం వాంగ్‌చుక్ 26 రోజులుగా కొనసాగిస్తున్న నిరవధిక నిరాహార దీక్షను శుక్ర వారం విరమించారు. గురుగ్రామ్‌లోని మెదాంతా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వాంగ్‌చుక్‌ను కేంద్ర మంత్రులు జేపీ నడ్డా, డాక్టర్ జితేంద్ర సింగ్ కలిసి చర్చలు జరపగా దీక్ష విరమించేందుకు అంగీకరించారు. వాంగ్‌చుక్ తన సోషల్‌మీడియా ఖాతాలో ఈ నిర్ణయానికి దారితీసిన షరతులు, చర్చల వివరాలను ప్రత్యేక వీడియోలో వివరిస్తానన్నారు.

# విలువలతో కూడిన విద్యే ప్రభుత్వ లక్ష్యం

- కూటమి ప్రభుత్వం వచ్చాక విద్య వ్యవస్థలో సమూల మార్పులు
- రాష్ట్ర వ్యాప్తంగా స్కూళ్లలో మెగా పేరెంట్ టీచర్ మీటింగ్స్ ఒక రికార్డు
- పది ఉత్తీర్ణతలో కృష్ణా జిల్లాను మొదటి మూడు ర్యాంకుల్లో నిలబెడతాం
- తాళ్లపాలెం జెడ్పీ హైస్కూల్లో మెగా పేరెంట్ టీచర్ మీటింగ్స్‌లో మంత్రి కొల్లు రవీంద్ర



**విజయవాడ, జులై 24 ప్రభాతవార్త ప్రతినిధి:** విద్యార్థులకు మెరుగైన విద్యతో పాగా విలువలతో కూడిన జీవన విధానం అలవర్చడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం మెగా పేరెంట్ టీచర్ మీటింగ్స్ నిర్వహిస్తోందని రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు. మచిలీపట్నం తాళ్లపాలెం లోని జెడ్పీ హైస్కూల్లో నిర్వహించిన మెగా పేరెంట్ టీచర్ మీటింగ్స్‌లో పాల్గొన్నారు. విద్యార్థుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఎగ్జి బిషన్‌ను పరిశీలించారు. అత్యుత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను సన్మానించారు. విద్యార్థులతో తల్లి దండ్రులకు పాదపూజ నిర్వహించారు. అనంతరం విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. మంత్రి కొల్లు రవీంద్ర మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా మెగా పేరెంట్ టీచర్ మీటింగ్స్ అత్యంత ఘనంగా నిర్వహించుకుంటున్నందుకు సంతోషంగా ఉంది. కూటమి అధికారంలోకి వచ్చాక పిల్లలు ఎలా చదువుతున్నారో వారికి ఏ రంగంలో ఆసక్తి ఉందో తెలుసుకోవడమే లక్ష్యంగా పేరెంట్ టీచర్ మీటింగ్స్ నిర్వహిస్తున్నాం. కృష్ణా జిల్లా వ్యాప్తంగా ఈ సంవత్సరం పదో తరగతి ఫలితాల్లో 85 శాతం పాస్ పర్సెంటేజీ రావడం అభినందనీయమని, వచ్చే ఏడాది మాత్రం మొదటి మూడు ర్యాంకుల్లో జిల్లాను నిలబెట్టే బాధ్యత తీసుకోవాలని అధికారులకు సూచించారు. విద్యార్థులను అత్యుత్తమ పౌరులుగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా పని చేస్తున్నాం. విద్యతో పాటుగా విలువలు నేర్పించడమే లక్ష్యంగా చాగంటి కోటేశ్వరరావుతో తరగతులు చెప్పిస్తున్నాం. విద్య వ్యవస్థలో సమూల మార్పులకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యమిస్తోంది. ఈ ఏడాది బడ్జెట్లో ఏకంగా రూ.32 వేల కోట్లు కేటాయించడం కూటమి ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనం. అదే సమయంలో తల్లికి వందనం పథకాన్ని ప్రతి విద్యార్థికి అందిస్తామన్న హామీ మేరకు 67 లక్షల మందికి రూ.10,500 కోట్లు చెల్లించాం. అర్హత కలిగిన ప్రతి విద్యార్థికీ తల్లికి వందనం అమలు చేశాం. ఏపీని నాలెడ్జి కేంద్రంగా మార్చే లక్ష్యంతో విద్య వ్యవస్థలో మార్పులు తీసుకొచ్చాం. హామీ మేరకు 16,300 ఉపాధ్యాయ పోస్టుల్ని భర్తీ చేశాం. త్వరలోనే మరో డీఎస్సీ నిర్వహణకు సన్నాహాలు చేస్తున్నాం. ప్రైవేట్ స్కూల్లకు ధీటుగా ప్రభుత్వ స్కూళ్లను మార్చబోతున్నాం. భవిష్యత్ తరాలను అత్యుత్తమ పౌరులుగా తీర్చిదిద్దే లక్ష్యంతో పని చేస్తుంటే.. జగన్ రెడ్డి అండ్ కో రోజుకో కుట్ర చేస్తున్నారు. చివరికి ఉపాధ్యాయ నియామకాలపై కూడా తప్పుడు ఆరోపణలు, కేసులతో డీఎస్సీని అడ్డుకోవాలని ప్రయత్నించారు. ఎవరు కుట్రలు చేసినా, అవాంతరాలు సృష్టించినా రాష్ట్ర అభివృద్ధి భవిష్యత్ తరాల పురోభివృద్ధి లక్ష్యంగా కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందని మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ ఛైర్మన్ కొనకళ్ల నారాయణరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి గోపు సత్యన్నారాయణ

# వరి వద్దు.. ఆరుతడి పంటలే సాగు చేయండి

- జలవనరులశాఖ ఇంజినీర్ ఇన్ చీఫ్ నరసింహామూర్తి

**విజయవాడ, జులై 24 ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్ర ప్రజలకు ఎల్‌నినో పరిస్థితుల దృష్ట్యా మంచి నీటికి ఇబ్బంది లేకుండా చూడటమే ప్రభుత్వ ప్రధాన ఉద్దేశమని జలవనరులశాఖ ఇంజినీర్ ఇన్ చీఫ్ నరసింహామూర్తి తెలిపారు. వర్షాభావ పరిస్థితుల వల్ల రాష్ట్రంలోని ప్రధాన రిజర్వాయర్లలో నీటిమట్టాలు కనిష్ఠస్థాయిలో ఉన్నాయని ఆయన వెల్లడించారు. ఈ పరిస్థితుల దృష్ట్యా ప్రజల మంచినీటి అవసరాలు తీర్చడమే ధ్యేయంగా ప్రభుత్వం నిర్దేశించుకుందని తెలిపారు. వచ్చే ఏడాది జూన్ వరకు నీటిని తాగునీటికి కేటాయించి మిగతా జలాలను ఆరుతడి పంటలకు అందించేలా ప్రణాళిక రచించినట్లు ఇరిగేషన్ ఇఎన్‌సి తెలిపారు. రైతులు విజ్ఞతతో నడుచుకుంటూ సహకరించాలని కోరారు. రాష్ట్రంలో నెలకొన్న వర్షభావ పరిస్థితుల నేపథ్యంలో నీటి కొరతను అధిగమించాల్సి ఉంటుందని ఈఎన్‌సీ నరసింహామూర్తి పేర్కొన్నారు. గోదావరి నదిలో ఇంత తక్కువ స్థాయిలో నీటి ప్రవాహం ఉంటుందని అనుకోలేదన్నారు. లక్షల క్యూసెక్కుల నుంచి ఒక్కసారిగా వేల క్యూసెక్కులకు పడిపోవడాన్ని ప్రస్తుతం చూస్తున్నామని చెప్పారు. గోదావరి డెల్టా పరిధిలోని క్షేత్రస్థాయి పరిస్థితులను రేపు అధ్యయనం చేయాల్సి ఉందన్నారు. ప్రస్తుతానికి గోదావరి డెల్టాకు పరిస్థితులు కొంత ఆశాజనకంగానే ఉన్నప్పటికీ, కృష్ణా డెల్టాకు లోటు ఏర్పడిందని స్పష్టం చేశారు. సాధారణంగా వర్షాలు సమృద్ధిగా ఉన్నప్పుడే కృష్ణా డెల్టా 150 టీఎంసీల నీరు అవసరమవుతుందని, ఒకవేళ వర్షాలు లేకపోతే ఆ డెల్టాకు అంతకంటే ఎక్కువ నీటి అవసరం ఉంటుందని వివరించారు. ప్రస్తుత సంక్షోభ పరిస్థితుల్లో తాగునీటి సరఫరాకే తొలి ప్రాధాన్యత ఇస్తూ తాము ముందుకు వెళ్లాల్సి ఉంటుందని ఈఎన్‌సీ స్పష్టం చేశారు. రాబోయే రోజుల్లో జలాశయాల్లో నీటి లభ్యత బట్టి తగిన నిర్ణయాలు తీసుకోవాల్సి ఉంటుందని నరసింహామూర్తి వెల్లడించారు. అనధికారిక పంపుల వినియోగాన్ని అరికట్టేందుకు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ఆర్ఎంసీ పరిధిలో రైతులు ప్రస్తుతం వరి సాగు చేయవద్దని సూచించారు. నీరు లేక పంట నష్టపోయే ప్రమాదం ఉందని ఇఎన్‌సి హెచ్చరించారు. భవిష్యత్తులో నీటి లభ్యత పెరిగితే వ్యవసాయ శాఖతో కలిసి నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. కృష్ణా డెల్టా పరిధిలో వరికి బదులుగా ఆరుతడి పంటలు సాగు చేయాలని రైతులను సూచించారు. అసాధారణ పరిస్థితులను రైతులు అర్థం చేసుకుని విజ్ఞతతో వ్యవహరించాలని



ఇంజినీర్ నరసింహామూర్తి అన్నారు. పట్టిసీమ ద్వారా కృష్ణా డెల్టాకు నీటి సరఫరా కొనసాగుతోందన్నారు. గోదావరిలో ప్రవాహాలు తగ్గడంతో పట్టిసీమ పంపింగ్‌పై ప్రభావం పడిందని తెలిపారు. సీలేరు నీటి లభ్యత కూడా తగ్గిందని ప్రస్తావించారు. కృష్ణా డెల్టా సాగుకు అవసరమైన నీటి లభ్యత ప్రస్తుతం అందుబాటులో లేదని అన్నారు. పట్టిసీమలో అన్ని పంపులను ఒకేసారి నడపడం సాధ్యం కావట్లేదని పేర్కొన్నారు. ప్రస్తుత పరిస్థితులను ఎప్పటికప్పుడు సమీక్షించి తదుపరి నిర్ణయాలు తీసుకుంటామన్నారు. ఆర్ఎంసీ నుంచి అనధికారికంగా నీరు తీసుకోవద్దని రైతులకు విజ్ఞప్తి చేశారు.

# పార్టీ కోసం కష్టపడ్డవారికి గుర్తింపునిస్తాం

- తగిన సమయంలో జనసేనాని ప్రాధాన్యతనిస్తారు
- జనసేన పార్టీ శ్రేణులతో మంత్రి కందుల దుర్గేష్



**విజయవాడ, జులై 24 ప్రభాతవార్త ప్రతినిధి:** జనసేన పార్టీ కోసం గ్రామ స్థాయి నుంచి కార్యకర్తలు సొంతంగా పనిచేశారని మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. పార్టీ కోసం వారు చేసిన త్యాగాలను తమ నేత పవన్ కల్యాణ్ మరచిపోరు అన్నారు. వారికి తగిన సమయంలో ప్రాధాన్యతను ఇస్తారన్నారు. విజయవాడలో శుక్రవారం జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో మంత్రి మాట్లాడుతూ రాష్ట్ర బాగు కోసం కూటమి విజయం సాధించాలని అందరం కలిసి పని చేశామని చెప్పారు. ఇప్పుడు స్థానిక సంస్థల ఎన్నికల కోసం అంతా సంసిద్ధం కావాలని పిలుపునిచ్చారు. మిత్రపక్ష పార్టీల నేతలను కలుపుకుని ముందుకు సాగాలని నేతలకు సూచించారు. పార్టీ కోసం పనిచేసే వారిని జనసేన అధినేత పవన్ కల్యాణ్ గుర్తించి ప్రోత్సహిస్తారని మంత్రి తెలిపారు. జనసేన పార్టీని ప్రజల్లోకి మరింతగా తీసుకువెళ్లేలా పని చేయాలని అన్నారు. జనసేన పార్టీ బలం పెంచుకోవడం ద్వారా ఎక్కువ స్థానాల్లో పోటీ చేసే అవకాశం ఉంటుందని చెప్పారు. జనసేనలో ఎంతోమంది సామాన్య కార్యకర్తగా పని చేసి వివిధ హోదాలు సంపాదించారన్నారు. రాష్ట్రంలో వైసీపీ వంటి పార్టీకి ప్రజలు బుద్ధి చెప్పేలా అందరూ కలిసి పని చేయాలని పిలుపునిచ్చారు. విజయవాడ కార్పొరేషన్‌లో కూటమి పార్టీ విజయకేతనం ఎగురవేయాలని కందుల దుర్గేష్ పేర్కొన్నారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేయాలని భావిస్తున్న వారు పటిష్టమైన వ్యూహంతో ముందుకు వెళ్లాలి. ప్రజలతో మమేకం కావాలి. క్షేత్రస్థాయిలో ప్రజల బాధలు, వేదనలు వినాలి. వారి సమస్యలను తీర్చే సత్తా చాటాలి. ప్రతి సమస్య మీద అవగాహన ఉండాలి. సమస్యల పరిష్కారానికి తగిన ఆలోచన ఉండాలి. నాయకులు రెండు ఫ్లెక్సీలు పెడితేనో, రెండు బ్యానర్లు కడితేనో అయిపోరు. ప్రతి ఒక్కరికీ తగిన అవకాశం ఇవ్వాలని శ్రీ పవన్ కళ్యాణ్ గారికి ఉంటుంది. కూటమి ప్రభుత్వంలో మొత్తం అన్ని పదవులు, బాధ్యతలు మనకే రావాలని అనుకోవడం తగదు. ఎవరికి.. ఏ బాధ్యత ఎప్పుడు అప్పగించాలి..? జెండా పట్టుకొని నడిచే కార్యకర్తలకు ఎలాంటి గౌరవం ఇవ్వాలనేది పవన్ కళ్యాణ్ అవగాహన ఉంది. ప్రతి ఒక్కరికీ తగిన న్యాయం జరుగుతంది. దీనిలో సందేహం లేదు.

ఈ సమావేశంలో మంత్రి నాదెండ్ల మనోహర్, ఎమ్మెల్సీ పిడుగు హరిప్రసాద్, ఎమ్మెల్యే బొలిశెట్టి, సామినేని ఉదయభాను, అమ్మిశెట్టి వాసు, రావి సౌజన్యతో పాటు విజయవాడ పార్లమెంటు నియోజకవర్గ జనసేన నాయకులు, కార్యకర్తలు హాజరయ్యారు.

# ప్రేమ.. పెళ్లి... దంపతులపై దాడి



**తిరుపతి, జులై 24 ప్రభాతవార్త ప్రతినిధి:** కుటుంబసభ్యులను కాదని ప్రేమించి పెళ్లి చేసుకున్న యువ దంపతులపై యువతి కుటుంబ సభ్యులు దాడికి పాల్పడిన సంఘటన తిరుపతిలో జరిగింది. ప్రేమ జంట ఒక ఇంటివారైన తరువాత తమకు రక్షణ కల్పించాలని కోరుతూ తిరుపతి జిల్లా పోలీస్ కార్యాలయంలోని ఎస్పీని కలవడానికి వెళ్తుండగా కూతవేటు దూరంలో ఈ దాడికి దిగడం సంచలనం కలిగించింది. ఉన్న ఫళంగా అక్కడే యువతి మెడలో తాళిబొట్టును తెంచి యువకుడిపై పెళ్లి కుమార్తె వర్గీయులు దాడి చేశారని ఫిర్యాదు అందింది. స్థానికుల సహాయంతో ఇరువురిని ఎస్వీ యూనివర్సిటీ పోలీసుల చెంతకు చేర్చారు. అయితే ఇద్దరు నూతన దంపతులది అన్నమయ్యజిల్లా కావడంతో ఆ జిల్లా పోలీసులకు తిరుపతి పోలీసులు సమాచారమిచ్చారు. అన్నమయ్య జిల్లా సుండుపల్లి మండలం కేకల దొడ్డిపల్లికి చెందిన శివ స్నేహకు సూళ్లూరుపేట మండలం మతిమూడి గ్రామానికి చెందిన చందుతో పరిచయమైంది. ఓ కోచింగ్ సెంటర్‌లో ఏర్పడిన వీరిద్దరి పరిచయం కాస్త ప్రేమగా మారింది. ఇద్దరూ మేజర్లు కావడంతో ఈనెల 19న ఓ గుడిలో పెళ్లి చేసుకున్నారు. అయితే శివస్నేహ కనబడటంలేదని రాయచోటి పోలీస్ స్టేషన్‌లో ఆమె తల్లిదండ్రులు ఫిర్యాదు చేశారు. అక్కడి పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేశారు. యువకుడిపై అనుమానంతో అతని తల్లి మునిలక్ష్మిని, పెద్దమ్మ అచ్చమ్మతోపాటు మేనమామ ముని చంద్రను రాయచోటి పోలీసులు విచారణకు పిలిచారు. ఈ విషయమై తిరుపతి జిల్లా ఎస్పీ కార్యాలయానికి వెళుతుండగా దాడి జరిగినట్టు నవ దంపతులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. తిరుపతి ఎస్వీ యూనివర్సిటీ పోలీస్ స్టేషన్‌లో పోలీసులు వివరాలను రాసుకుని రాయచోటి పోలీసులకు సమాచారమిచ్చారు. నవ దంపతులను రాయచోటి పోలీసులకు అప్పగించడంతో ప్రస్తుతం రాయచోటి పోలీసుల విచారణలో

# మహిళ ఆత్మహత్యాయత్నం

**విజయవాడ, జులై 24 ప్రభాతవార్త ప్రతినిధి:** కృష్ణా జిల్లాలోని గుడివాడ నెహ్రూ చౌక్ అంబేద్కర్ విగ్రహం వద్ద మహిళ ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. ఈ ఘటన తీవ్ర కలకలం రేపింది. ఆస్తి వివాదం నేపథ్యంలో కైకలూరు మండలం చావలిపాడుకి చెందిన తలారి రమాదేవి(50) పాయిజన్ టాబ్లెట్లు మింగి బలవన్మరణానికి యత్నించారు. విషమాత్రలు మింగిన అనంతరం అంబేద్కర్ విగ్రహం వద్ద మహిళ సొమ్మసిల్లి పడిపోయారు. సమీపంలో విధులు నిర్వహిస్తున్న పోలీస్ బృందం.. రమాదేవి పరిస్థితిని గమనించి వెంటనే ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం గుడివాడ ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో మహిళ చికిత్స పొందుతున్నారు. వంశపారంపర్య భూమిని బాబాయి, అతని కొడుకు అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసుకున్నారని రమాదేవి ఆరోపించారు. ఈ విషయంలో తనకు న్యాయం జరగదన్న భయంతోనే ఆత్మహత్యకు ప్రయత్నించానని తెలిపారు. ఉపాధి పనులు చేసుకొని బతికే తమకు న్యాయం చేయాలని బాధితురాలు వేడుకున్నారు. ఈ ఘటనపై గుడివాడ వన్ టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# తిరుమల సమాచారం



## గోవిందరాజస్వామి ఆలయంలో జ్యేష్ఠాభిషేకం

**తిరుమల, జులై 24 ప్రభాతవార్త ప్రతినిధి:** టిటిడి ఆధ్వర్యంలోని తిరుపతి గోవిందరాజస్వామి ఆలయంలో మూడు రోజుల పాటు జరిగే జ్యేష్ఠాభిషేక మహోత్సవాలు శుక్రవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా శుక్రవారం ఉదయం సుప్రభాత సేవ అనంతరం స్వామివారికి నిత్యకైంకర్యాలు నిర్వహించారు. ఉదయం 8 గంటల నుండి శతకలశ స్నపనం, మహాశాంతి హోమం శాస్త్రోక్తంగా చేపట్టారు. అనంతరం ఆలయంలోని కల్యాణ మండపంలో శ్రీదేవి, భూదేవి సమేత గోవిందరాజస్వామి ఉత్సవ మూర్తులకు స్నపన తిరుమంజనం వేదోక్తంగా నిర్వహించారు. పాలు, పెరుగు, తేనె, చందనం, పసుపు, కొబ్బరి నీటితో విశేష అభిషేకం చేసి, అనంతరం స్వామివారి కవచాలకు ప్రత్యేక పూజలు నిర్వహించి కవచాధివాసం చేశారు. సాయంత్రం 5.30 గంటలకు శ్రీదేవి, భూదేవి సమేత గోవిందరాజస్వావి తిరుచ్చిపై ఆలయ నాలుగు మాడ వీధుల్లో విహారించి భక్తులకు దివ్య దర్శనమిచ్చారు. ఈ కార్యక్రమంలో పెద్దజీయర్ స్వామి, చిన్నజీయర్ స్వామి, ఆలయ ఎఇఒ నారాయణ చౌదరి, ఆలయ ఇన్‌స్పెక్టర్ ధనంజయులు, ఆలయ అర్చకులు, అధికారులు, భక్తులు పాల్గొన్నారు.

## ఆగస్టు 1 నుండి పుష్కరిణి శుద్ధి పనులు



**తిరుమల, జులై 24 ప్రభాతవార్త ప్రతినిధి:** తిరుమలలో శ్రీవారి ఆలయానికి ఉత్తరం వైపు ఉన్న పవిత్ర పుష్కరిణి మరమ్మతులు, శుద్ధి పనులు చేపట్టేందుకు నెలరోజులపాటు పుష్కరిణిని తిరుమల తిరుపతి దేవస్థానం మూసివేయనుంది. సాధారణంగా ప్రతి ఏడాది ఏడుకొండల స్వామి బ్రహ్మోత్సవాలకు ముందు నెలరోజులు పాటు పుష్కరిణి మూసివేసి నీటిని పూర్తిగా తొలగిస్తారు. పుష్కరిణిలోపల ఉన్న పైపులైన్ల మరమ్మతులు, పుష్కరిణి సివిల్ పనులు చేపడతారు. ఈ ఏడాది సెప్టెంబర్‌లో 15వ తేదీ నుండి వెంకన్న సాలకట్ల వార్షిక బ్రహ్మోత్సవాలు, అక్టోబర్‌లో 11నుండి నవరాత్రి బ్రహ్మోత్సవాలు జరగనున్నాయి. దీనికంటే ముందే పుష్కరిణి మరమ్మతులు, శుద్ధిచేసే పనులు చేపట్టేలా టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి ఇంజనీరింగ్, వాటర్‌వర్క్స్ విభాగం అధికారులకు ఆదేశాలిచ్చారు. ఈ కారణంగా ఆగస్టు 1 నుండి 31 వరకు పూర్తిగా స్వామివారి పుష్కరిణి మూసివేస్తారు. భక్తులను కూడా అనుమతించరు. భక్తులకు స్నానాలకోసం వరాహస్వామి ఆలయం సమీపంలోనే స్నానఘట్టాలు, నీటికొళాయిలు ఏర్పాటు జరుగుతుంది. అలాగే భారీ వర్షాలు, తుఫాన్లు, ఇతర పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని ముందుస్తు జాగ్రత్తలో భాగంగా సెప్టెంబర్ 1వ తేదీ నుండి 10వ తేది వరకు పుష్కరిణి మూసివేయబడుతుంది. ఈ 40 రోజుల పాటు పుష్కరిణి హారతి ఉండదు. అదేవిధంగా భక్తులను పుష్కరిణిలోకి అనుమతించరు. ఈ విషయాన్ని దృష్టిలో పెట్టుకొని సహకరించాల్సిందిగా భక్తులకు టిటిడి విజ్ఞప్తి చేసింది.

## తిరుమలకొండపై శబ్ద కాలుష్య నియంత్రణకు

# ‘నో హారన్ జోన్’





**తిరుమల, జులై 24 ప్రభాతవార్త ప్రతినిధి:** దేశం నలుమూలల నుండి శ్రీవారి దర్శనార్థం తిరుమల పుణ్యక్షేత్రానికి వస్తున్న యాత్రికులు వారి వాహనాలతో బాటు ట్యాక్సీల నుండి వెలువడుతున్న శబ్ద కాలుష్యానికి చెక్ పెట్టేందుకు టిటిడి మళ్ళీ సమాయత్తమవుతోంది. ఇప్పటికే కొండపై జిఎన్‌సి టోల్‌గేట్ దాటిన తరువాత ‘నో హారన్ జోన్’ అమలు చేసినా అది పూర్తిస్థాయిలో కార్యాచరణ అమలుకాలేదు. దీంతో కొండపై వాహనాల హారన్లమోతతో భక్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తిరుమలకు రోజువారీగా ఐదువేల వరకు యాత్రికుల వాహనాలు వస్తున్నట్లు అంచనా. ఇదేగాక మరో మూడువేల వాహనాలు తిరుమల- తిరుపతి ట్యాక్సీలు. 450వరకు ఆర్టీసి బస్సులు ఇలా నడుస్తున్నాయి. తిరుమల పుణ్యక్షేత్రం ఆధ్యాత్మిక వాతావరణాన్ని పరిరక్షించేందుకు, శబ్ద కాలుష్యాన్ని నియంత్రించేందుకు టిటిడి ,తిరుపతి జిల్లా పోలీసులు సంయుక్తంగా ‘నో హారన్ జోన్’ నిబంధనను కఠినంగా అమలు చేస్తున్నారు. కొండపై అనవసరంగా హారన్లు, సైరన్లు మోగించడాన్ని పూర్తిగా నిషేధించారు. ఈ నిబంధనను ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటూ, భారీ జరిమానాలు విధిస్తున్నారు.

గత ఆరు నెలల కాలంలోనే శబ్దకాలుష్యానికి కారణమైన 42 వాహనాలపై మోటారు వాహన చట్టం కింద కేసులు నమోదు చేశారు. రూ.64,475లు జరిమానా వసూలు చేసినట్లు అధికారులు వెల్లడించారు. తిరుమలలో జిఎన్‌సి టోల్‌గేట్ నుండి రెండు ఘాట్ రోడ్లతో సహా కొండపై అన్ని ప్రాంతాల్లో ఈ నిబంధన వర్తిస్తుంది.

ఎప్పటి నుండో ఈ నిబంధనలు అమల్లో ఉన్నప్పటికీ, చాలా మంది వాహన దారులు దీన్ని పట్టించుకోకపోవడంతో ట్రాఫిక్ పోలీసులు, రవాణా శాఖ అధికారులు ప్రత్యేక తనిఖీలు నిర్వహిస్తూ చర్యలు తీవ్రతరం చేశారు.

నిబంధనల అమలును పర్యవేక్షించేందుకు పోలీస్ కమాండ్ కంట్రోల్ విభాగం ఆధ్వర్యంలో రెండువేలకు పైగా సిసి కెమెరాలతో నిరంతరం నిఘా కొనసాగుతోంది. నిబంధనలను అతిక్రమిస్తే కెమెరాల ద్వారా గుర్తించి చలాన్లు పంపడం ఖాయమని అధికారులు హెచ్చరిస్తున్నారు. ఆలయాలు, ప్రశాంత ప్రదేశాల్లో పగటిపూట 50 డెసిబుల్స్, రాత్రిపూట 40 డెసిబుల్స్ మించి శబ్దాలు ఉండరాదనే నిబంధన అమలవుతోంది. ఇక మరింత కఠినంగా ఈ

## నేడు కపిలేశ్వరస్వామి పవిత్రోత్సవాలకు అంకురార్పణ



**తిరుమల, జులై 24 ప్రభాతవార్త ప్రతినిధి:** తిరుపతిలోని ప్రసిద్ధ శైవాలయం కపిలేశ్వరస్వామి ఆలయంలో ఈనెల 26 నుండి 28వ తేదీ వరకు వార్షిక పవిత్రోత్సవాలు జరగనున్నాయి. ఇందుకోసం నేటి సాయంత్రం అంకురార్పణతో ప్రారంభించనున్నారు. సాయంత్రం 6 గంటల నుండి రాత్రి 8.30 గంటల వరకు శాస్త్రోక్తంగా అంకురార్పణ కార్యక్రమాలు నిర్వహిస్తారు. పవిత్రోత్సవాల్లో భాగంగా 26 ఆదివారం పవిత్ర ప్రతిష్ఠ, 27న గ్రంథి పవిత్ర సమర్పణ, 28 మంగళవారం మహాపూర్ణాహుతి నిర్వహిస్తారు. ప్రతిరోజూ ఉదయం సుప్రభాత సేవ అనంతరం కపిలేశ్వరస్వామికి అభిషేకం నిర్వహిస్తారు. అనంతరం కపిలేశ్వరస్వామి, కామాక్షమ్మ అమ్మవారు, విఘ్నేశ్వరస్వామి, సుబ్రహ్మణ్యస్వామి, చండికేశ్వరస్వామివార్ల ఉత్సవమూర్తులకు కల్యాణ మండపంలో స్నపన తిరుమంజనం వైభవంగా జరుగుతుంది. రూ.700లు టికెట్‌తో గృహస్తులు (ఇద్దరు) పవిత్రోత్సవాల్లో పాల్గొనవచ్చు. పాల్గొనే వారికి ఒక లడ్డూ, ఉత్తరీయం, రవికెతో పాటు ఉత్సవాల చివరి రోజు పవిత్రమాలలను ప్రసాదంగా అందజేస్తారు.



## మొగలిచెర్ల దత్తమందిరంలో 29న దత్త హోమం

**తిరుపతి, జులై 24 ప్రభాతవార్త ప్రతినిధి:** ఆధ్యాత్మికక్షేత్రం లింగసముద్రం మండలం మొగలిచెర్ల గ్రామంలోని దత్తాత్రేయ స్వామి మందిరంలో ఈనెల 29వ తేదీ బుధవారం దత్త హోమం నిర్వహిస్తున్నట్లు ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త పవని నాగేంద్రప్రసాద్ తెలిపారు. హోమంలో నేరుగా పాల్గొనదలచిన భక్తులు బుధవారం ఉదయం 8 గం.లకు మందిరం వద్దకు రావాలని నాగేంద్రప్రసాద్ కోరారు. భక్తులకు ఉచిత అన్నప్రసాద వితరణ జరుగుతుందని ఆలయ కన్వీనర్ విష్ణుసాయి కౌశిక్ తెలిపారు.




## భక్తిభావాన్ని పెంపొందించేలా ఎస్‌విబిసి కార్యక్రమాలు

**తిరుమల, జులై 24 ప్రభాతవార్త ప్రతినిధి:** టిటిడి ధార్మికసంస్థ ఆధ్వర్యంలోని ఎస్‌విబిసిలో ప్రపంచ వ్యాప్తంగా ఉన్న శ్రీవారి భక్తుల్లో మరింత భక్తి భావాన్ని పెంపొందించేలా సృజనాత్మకంగా, నాణ్యంగా కార్యక్రమాలు రూపొందించాలని టిటిడి ఇఒ ముద్దాడ రవిచంద్ర అధికారులను ఆదేశించారు. తిరుమల క్షేత్రంలోని స్థూపాలు, మండపాలు, ప్రాకారాలు, తీర్థాలు, ఉపాలయాలు, శ్రీవారి ప్రసాదాల విశిష్టత తదితర అంశాలను భక్తులకు సులభంగా అర్థమయ్యేలా కార్యక్రమాలు రూపొందించాలని సూచించారు. తిరుమల ఆధ్యాత్మిక వైభవం, శ్రీవారి మహిమను ప్రతి భక్తుడి హృదయానికి చేరేలా ఆకర్షణీయమైన కార్యక్రమాలను రూపొందించాలని చెప్పారు. ప్రపంచ వ్యాప్తంగా లక్షలాది మంది భక్తులు ఎస్‌విబిసిని వీక్షిస్తు న్నారని, ప్రతి కార్యక్రమం భక్తులను చివరి వరకు ఆసక్తిగా చూసేలా ఉండాలని, నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ ఉండకూడదని స్పష్టం చేశారు. భక్తి, భావం, సరళత కలగలిపిన కార్యక్రమాలతో ప్రేక్షకాదరణ పెరిగేలా కొత్త ఆలోచనలకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ప్రస్తుతం ప్రసారమవుతున్న కార్యక్రమాలను సమీక్షించి, భక్తుల అభిరుచికి అనుగుణంగా మరిన్ని వినూత్నమైన ఆధ్యాత్మిక కార్యక్రమాలను రూపొందించాలని అధికారులను ఆదేశించారు. ఎస్‌విబిసి సిఇఒ, టిటిడి జెఇఒ డాక్టర్ ఎ.శరత్ మాట్లాడుతూ ప్రసారమవుతున్న కార్యక్రమాల వివరాలను ఇఒకు వివరించారు. శుక్రవారం ఎస్‌విబిసి రోజువారీ ప్రసారాలు, భవిష్యత్ కార్యక్రమాల రూపకల్పనపై ఇఒ రవిచంద్ర సమీక్ష నిర్వహించారు. సమీక్షకు ముందు ఆధ్యాత్మిక విశేషాల విభాగం, ఎడిట్ విభాగం, పలు స్టూడియో విభాగాలను పరిశీలించి ఇఒ పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్‌విబిసి సిపిఒ ఏ.సి. ఎస్ఇ మనోహరం, అకౌంట్స్ అధికారి విశ్వనాథ రాయల్‌తో పాటు ఇతర అధికారులు,

## నిరక్షరాస్యత మూఢ నమ్మకాలు, ఛాందస భావాల నివారణకు

# గ్రంథాలయాల స్థాపనే పరిష్కారమార్గం



**విజయవాడ, జులై 24 ప్రభాతవార్త ప్రతినిధి:** “పౌర గ్రంథాలయాలే జ్ఞాన దేవాలయాలు” అనే నినాదంతో ఊరూరా గ్రంథాలయ చైతన్యోద్యమం నడిపిన గ్రంథాలయోద్యమ పితామహుడు, పద్మశ్రీ అయ్యంకి వెంకట రమణయ్య అని విశ్రాంత ఆచార్యులు, ఆయన మనవడు అయ్యంకి మురళీకృష్ణ అన్నారు. అయ్యంకి వెంకటరమణయ్య 136వ జయంతి కార్యక్రమాన్ని విజయవాడ ఠాగూర్ గ్రంథాలయంలో గ్రంథాలయాధికారిణి రమాదేవి అధ్యక్షతన నిర్వహించారు.

ఈ కార్యక్రమానికి మురళీకృష్ణ, నవమల్లెతీగ సంపాదకుడు కలిమిశ్రీ అతిథులుగా హాజరయ్యారు. ముందుగా వెంకట రమణయ్య చిత్రపటానికి, శిలాఫలకానికి పూలమాలవేసి నివాళి అర్పించారు. అనంతరం కలిమిశ్రీ మాట్లాడుతూ నిరక్షరాస్యత, అజ్ఞానం, మూఢ నమ్మకాలు, ఛాందస భావాల నివారణకు గ్రంథాలయాల స్థాపనే పరిష్కారమార్గమని ఎంచి గ్రంథాలయాల వ్యాప్తికి అయ్యంకి వెంకటరమణయ్య నడుం కట్టారన్నారు. ఈ కార్యక్రమంలో పడాల నీలా రమేష్ గౌతమ్ రాసిన “మనిషి కోసం” వ్యాస, కవితా సంపుటిని అయ్యంకి మురళీకృష్ణ కలిమిశ్రీ ఆవిష్కరించారు. గ్రంథాలయాధికారిణి రమాదేవి మాట్లాడుతూ ఆ మహనీయుడు ఏర్పాటు చేసిన గ్రంథాలయాలు నేడు యువతరానికి పఠన కేంద్రాలుగానే కాక ఉద్యోగ ప్రసాదిత కేంద్రాలుగా కూడా ఉపయోగపడుతున్నాయన్నారు. మరో ప్రభుత్వ కార్యక్రమంలో వుండి రాలేకపోయిన రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ ఛైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు ఫోను ద్వారా పంపిన నివాళి సందేశాన్ని రమాదేవి చదివి వినిపించారు.

25-7Pg7exHMNWJQE:25-7Pg7exHMNWJQE.qxd 7/24/2026 11:45 PM Page 1



# స్థానిక సంస్థలకు ప్రత్యక్ష ఎన్నికలు నిర్వహించాలి

## సిఎం చంద్రబాబుకు డాక్టర్ సుధాకర్ రెడ్డి లేఖ



**తిరుపతి, జులై 24 ప్రభాతవార్త ప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్‌లో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో మండల ప్రజా పరిషత్ అధ్యక్షులు (ఎంపిపి), జిల్లా పరిషత్ చైర్‌పర్సన్లు, మున్సిపల్ చైర్‌పర్సన్లు, మేయర్ల పదవులకు ప్రత్యక్ష ఎన్నికలు నిర్వహించాలని టిడిపి మాజీ రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ ఎన్.బి. సుధాకర్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఆయన ముఖ్యమంత్రి చంద్రబాబుకి లేఖ రాశారు. స్థానిక సంస్థల కీలక పదవులకు ప్రత్యక్ష ఎన్నికలు నిర్వహించడం ద్వారా ప్రజలకు తమ నాయకులను నేరుగా ఎన్నుకునే అవకాశం లభిస్తుందని, ఎన్నికైన నాయకులకు ప్రజల నుంచి ప్రత్యక్ష ప్రజాస్వామ్య మద్దతు లభించడంతో పాటు ప్రజలకు నేరుగా జవాబుదారీతనం పెరుగుతుందని ఆయన పేర్కొన్నారు. ప్రస్తుతం అమలులో ఉన్న పరోక్ష ఎన్నికల విధానం వల్ల రాజకీయ అస్థిరత, ప్రలోభాలు, క్రాస్ ఓటింగ్, అవిశ్వాస తీర్మానాలు వంటి సమస్యలు తలెత్తే అవకాశం ఉందన్నారు. ఈ పరిస్థితులు స్థానిక సంస్థల సుస్థిర పాలన, అభివృద్ధి కార్యక్రమాలపై ప్రతికూల ప్రభావం చూపే ప్రమాదం ఉందని తెలిపారు. ప్రజల ప్రత్యక్ష మద్దతుతో ఎన్నికైన నాయకులు స్థానిక అభివృద్ధి, ప్రజా సంక్షేమం, మౌలిక వసతుల కల్పన వంటి అంశాలపై మరింత సమర్థవంతంగా దృష్టి సారించే అవకాశం ఉంటుందని ఆయన అన్నారు.


# వివేకా హత్య కేసు.. సునీతా రెడ్డి పిటిషన్ కొట్టివేత

**హైదరాబాద్, జులై 24 ప్రభాతవార్త:** మాజీ మంత్రి వైఎస్ వివేకానంద రెడ్డి హత్య కేసును మరోసారి విచారించాలని ఆయన కుమార్తె సునీతా రెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌ను నాంపల్లి సిబిఐ కోర్టు శుక్రవారం కొట్టివేసింది. వివేకానంద రెడ్డి హత్య కేసును సిబిఐ ఇప్పటికే విచారించడంతో పాటు చార్జిషీట్ కూడా దాఖలు చేయడం తెలిసిందే. అయితే ఈ కేసును సిబిఐ సమగ్రంగా విచారించలేదని, అనేక లోపాలు వున్నాయని, చార్జిషీట్‌ను తిరస్కరించాలని సునీతా రెడ్డి సిబిఐ కోర్టును కోరారు. ఈ కేసులో చాలా మంది అనుమానితులను సిబిఐ ప్రశ్నించలేదని ఆమె తెలిపారు. దీనిపై వాదనలు వినిపించిన సిబిఐ తరపు న్యాయవాది వివేకానంద రెడ్డి హత్య కేసును అన్ని కోణాల్లో విచారించామని, నిందితులను అరెస్టు చేయడంతో పాటు చార్జిషీట్ దాఖలు చేశామని కోర్టుకు తెలిపారు. ఈ కేసులో కోర్టు ఆదేశిస్తే మరోసారి విచారిస్తామని ఆయన తెలిపారు. ఇరువర్గాల వాదనలు విన్న సిబిఐ కోర్టు న్యాయమూర్తి సునీతా రెడ్డి వేసిన పిటిషన్‌ను కొట్టివేశారు.

# అమరావతిలో నిర్మాణ సామగ్రి చోరీ ముఠా అరెస్టు

**విజయవాడ, జులై 24 ప్రభాతవార్త ప్రతినిధి:** రాజధాని అమరావతిలో నిర్మాణ సామగ్రిని అపహరిస్తున్న ముఠాను పోలీసులు అరెస్టు చేశారు. నలుగురు సభ్యులతో కూడిన ముఠాను పట్టుకున్నట్లు ఎస్పీ వకుల్ జిందాల్ తెలిపారు. నిర్మాణంలో ఉన్న భవనాల్లో చోరీలు జరుగుతున్నాయన్న ఫిర్యాదులతో నిఘా పెట్టామన్నారు. నిందితులను మేకల దుర్గాప్రసాద్, చలమచర్ల నరసింహ, తుమ్మ వెంకట్, పాలపర్తి ప్రశాంత్‌గా గుర్తించారు. వీరి నుంచి రాగి బండిల్స్, బంగారు గొలుసు, టీవీలు, ఆటోను స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై గతంలో 15 కేసులు ఉన్నాయని, వారిపై పీడీ యాక్ట్ ప్రయోగించి రిమాండ్‌కు తరలించామని ఎస్పీ వెల్లడించారు. నేరాలు అరికట్టేందుకు రాజధానిలో 8 చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి సీసీ కెమెరాలతో నిఘా పెంచినట్లు స్పష్టం చేశారు.

# బంగారు తాళిబొట్టు భక్తురాలికి అప్పగింత



**తిరుమల, జులై 24 ప్రభాతవార్త ప్రతినిధి:** తిరుమలకు వచ్చిన ఓ భక్తురాలు పోగొట్టుకున్న విలువైన బంగారు తాళిబొట్టును తిరుమల పోలీసులు కొంత సమయంలోనే రికవరీ చేశారు. బాధితురాలి ఫిర్యాదుతో వెంటనే స్పందించిన తిరుమల టూ టౌన్ పోలీసులు నగలను తిరిగి భక్తురాలికి అప్పగించారు. శ్రీవారి దర్శనానికి వచ్చిన బాపట్ల జిల్లా చీరాలకు చెందిన పద్మావతి కుటుంబ సభ్యులతో కలిసి తిరుమలకు చేరుకుంది. ప్రైవేట్ వాహనంలో ప్రయాణించిన అనంతరం తమ బ్యాగ్ కనిపించకపోవడంతో తిరుమల టూటౌన్ పోలీసులను ఆశ్రయించారు. వెంటనే స్పందించిన పోలీసులు కమాండ్ కంట్రోల్ సెంటర్ సహాయంతో సిసి కెమెరా దృశ్యాలను పరిశీలించి, ప్రయాణించిన వాహనాన్ని గుర్తించి తనిఖీ చేశారు. బ్యాగ్‌తో బాటు అందులో ఉన్న రూ.8 లక్షల విలువైన బంగారు తాళిబొట్టు సురక్షి తంగా లభించింది. దానిని భక్తురాలికి అప్పగించారు. తమ విలువైన ఆభరణం తిరిగి లభించడంతో భక్తురాలు, ఆమె కుటుంబ సభ్యులు తిరుమల టూ టౌన్ పోలీసులు, కమాండ్ కంట్రోల్ సెంటర్ సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు.

# ప్రతి చుక్కతో అధిక దిగుబడి

## 'ప్రధాన మంత్రి కృషి సించాయీ యోజన' ఓ వినూత్న పథకం



**న్యూఢిల్లీ, జులై 24, ప్రభాతవార్త:** 'ప్రతి చుక్కతో అధిక దిగుబడి' ఆశయంతో 2015లో అంకురార్పణ జరిగిన 'ప్రధాన మంత్రి కృషి సించాయీ యోజన', గ్రామీణ ఆర్థిక వ్యవస్థ రూపురేఖలు మార్చే ఒక మహత్తర పథకం. రైతుకు నిర్దిష్ట ప్రయోజనాలు చేకూర్చే కేంద్ర ప్రభు త్వం రైతు సంక్షేమం పథకం. నీటి ప్రాజెక్టుల పూర్తి, కమాండ్ ఏరియా డెవలప్‌మెంట్, ఉపరితల చిన్న నీటి పారుదల చెరువుల మరమ్మతు, భూగర్భ జలవృద్ధి, బీడు భూముల సారం పెంపు, సూక్ష్మనీటి పారుదల ప్రోత్సాహం, గ్రామీణ ఆర్థిక వ్యవస్థ రూపురేఖలు మార్చే ఒక మహత్తర పథకం. వాతావరణ మార్పుల కాలంలో నీటి భద్రతే ఆహార భద్రతకు మూలం. పంట దిగుబడిని 30-40 శాతం పెంచుతుంది. రైతుల ఆదాయాన్ని హెక్టారుకు యేటా రూ.2 లక్షల మేర పెంచుతుంది, వ్యవసాయ రుణాల ఎగవేతలను తగ్గిస్తుంది. ప్రధానమంత్రి కృషి సించాయీ యోజన మద్దతు గల సూక్ష్మ నీటిపారుదల గణనీయమైన వ్యవసాయ లాభాలను అందిస్తుందని అంచనాలు నిర్ధారిస్తున్నాయి. పంట నీటి సున్నితత్వాన్ని బట్టి, దిగుబడి మెరుగుదలలు స్థిరంగా 30 నుండి 40 శాతం మధ్య ఉంటున్నాయి. మహారాష్ట్ర రైతులకు ఈ పథక ప్రయోజనాలు ఇబ్బడి ముబ్బడిగా అందాయి. అనుకున్నట్లే మహారాష్ట్రలో పత్తి దిగుబడి 37 నుండి 40శాతం పెరిగింది, తమిళనాడులో చెరకు ఉత్పాదకత 34 నుండి 37శాతం పెరిగింది. అధికవిలువ గల కూరగాయల (టమోటాలు, ఉల్లి పాయలు, బంగాళాదుంపలు) దిగుబడి 42 నుండి 48శాతం వరకు గణనీయంగా పెరిగింది. ధాన్యపు పంటలు 16 నుండి 24శాతం వరకు మితమైన లాభాలను చవిచూశాయి. ఈ ఉత్పాదకతలో వచ్చిన భారీ పెరుగుదలలు నేరుగా రైతు ఆదాయ వృద్ధికి దారితీస్తాయి. ఉద్యానవన అధిక విలువ పంటలైన ద్రాక్ష, దానిమ్మ వంటివి హెక్టారుకు యేటా రూ. 1 లక్ష 90 వేల రూపాయలు నుండి రూ. 2.20 లక్షల వరకు ఆదాయాన్ని చేకూర్చగా, చెరకు పంట రూ.1, లక్ష 50 వేల నుండి రూ.1, లక్ష 80 వేల వరకు అదనపు ఆదాయాన్ని అందించింది. దీనికి అనుగుణంగా, ఆదాయాలు స్థిరపడటం వల్ల ఐదేళ్ల పరిశీలన కాలంలో సహకార బ్యాంకుల డిఫాల్ట్ రేట్లు 16 నుండి 20శాతం వరకు తగ్గడంతో, పాల్గొనేవారిలో ఆర్థిక ఒత్తిడి కూడా తగ్గింది. పర్యావరణ గణాంకాలు సానుకూల పర్యావరణ ప్రభావాలను సూచిస్తున్నాయి. 341 కమాండ్ ఏరియాలలో సెంట్రల్ గ్రౌండ్ వాటర్ బోర్డ్ అంచనాల ప్రకారం, ఈ వ్యవస్థను ఏర్పాటు చేసిన 24 నెలల్లోపే పర్యవేక్షి ంచిన జోన్లలో 59శాతంలో భూగర్భ జల మట్టం స్థిరపడినట్లు నమోదైంది. అంతేకాకుండా, సాంప్రదాయ వరద నీటిపారుదల పద్ధతులతో పోలిస్తే, ప్రెసిషన్ ఇరిగేషన్ నైట్రేట్, ఫాస్ఫేట్ ప్రవాహాన్ని గణనీయంగా తగ్గించింది.

ప్రధానమంత్రి కృషి సించాయీ యోజన (పిఎంకెఎస్‌వై) ఒక సంక్లి ష్టమైన పరిపాలనా వ్యవస్థ ద్వారా పనిచేస్తుంది. ఇది ఆరు విభిన్న సంస్థాగత స్తంభాలను అనుసంధానిస్తుంది. కేంద్ర మంత్రిత్వ శాఖ, రాష్ట్ర స్థాయి నోడల్ సంస్థలు, జిల్లా స్థాయి నీటిపారుదల శాఖలు, ప్రాథమిక వ్యవసాయ లబ్ధిదారులు, నీటి వినియోగదారుల సంఘాలు, గ్రామీణ రుణప్రదాతల వంటి ద్వితీయ సహాయక సంస్థలు, ప్రభుత్వేతర సంస్థలు, పరికరాల సరఫరాదారులతోసహా ప్రత్యేక సాంకేతిక అమలు భాగస్వాములు. ప్రతి భాగస్వామి కేంద్ర ఆదేశాలు రాష్ట్ర పరిపాలనా నిర్దేశాల ద్వారా నిర్దేశించబడిన అధికారం, జవాబు దారీతనం నిర్వచించబడిన చట్రంలో పనిచేస్తారు. భాగస్వాముల అధికారాలు, బాధ్యతల పంపిణీ జలశక్తి మంత్రిత్వ శాఖ అగ్రస్థానంలో ఉంది. జలవనరుల నిర్వహణ, వ్యవసాయ పర్యవేక్షణను 2019లో ఏకీకృతం చేయడం ద్వారా దీనిని ఏర్పాటు చేశారు. ఈ ఏకీకృత సంస్థ జాతీయ విధానాన్ని నిర్దేశిస్తుంది, ఆర్థిక కేటాయింపులను నిర్దేశిస్తుంది, పనితీరు కొలమానాలను పర్యవేక్షి స్తుంది. తద్వారా నీటి పంపిణీ, పంట ఉత్పత్తి లక్ష్యాల మధ్య ఉన్న చారిత్రక అంతరాలను పూరిస్తుంది. ప్రస్తుత నీటిపారుదల సామర్థ్యం, జనాభా సాంద్రత, చారిత్రక పనితీరు అంతరాలను పరిగణనలోకి తీసుకునే ఒక సూత్రం ఆధారంగా రాష్ట్ర ప్రభుత్వాలకు నిధులు పంపిణీ జరుగుతాయి.. ఇవి చిన్న పరిపాలనా ప్రాంతాలకు రూ.2,500 కోట్ల నుండి పెద్ద రాష్ట్రాలకు రూ.10 వేల కోట్లకు పైగా ఉంటాయి. రాష్ట్రస్థాయి ప్రాజెక్ట్ నిర్వహణ విభాగాలు, అమలుకు ప్రాథమిక చోదకశక్తులుగా పనిచేస్తాయి.

స్థల ఎంపిక, పర్యావరణ అనుమతుల సమన్వయం, కాంట్రాక్టర్ల నిర్వహణ, ఆర్థిక నివేదికలపై వీటికి చట్టబద్ధమైన అధికారం ఉంటుంది. మహారాష్ట్ర, తెలంగాణ వంటి రాష్ట్రాలు ఈ విభాగాలను నేరుగా తమ నీటిపారుదల శాఖలలో విలీనం చేయగా, ఇతర ప్రాంతాలు, ముఖ్యంగా ఈశాన్య ప్రాంతంలో, అమలుకోసం ప్రత్యేక కార్పొరేట్ సంస్థలను ఏర్పాటు చేశాయి. క్షేత్రస్థాయిలో, జిల్లా నీటిపారుదల శాఖలు అమలును నడిపిస్తాయి. వ్యవసాయ శాఖ డిప్యూటీ సూపరింటెండెంట్లు, భూమి శిస్తు రికార్డులను అధికారిక నీటి హక్కుల పత్రాలతో సరిపోల్చడం ద్వారా అర్హులైన రైతుల ధ్రువీకరణకు నాయకత్వం వహిస్తారు. వ్యవస్థ నిర్వహణపై వినియోగదారులకు అవగాహన కల్పిస్తూనే, ఖర్చులను తగ్గించడానికి రైతుల శ్రమ భాగస్వామ్యంతో ముందుకు కదలుతోంది. దిగుబడి మెరుగుదలలు, నీటి సామర్థ్యాన్ని పర్యవేక్షి ంచే బహుళ రుతువుల పనితీరు పర్యవేక్షణ దశతో ఈ పథకం లక్ష్యం ముగుస్తుంది. భూగర్భ జలం లేని పొడి ప్రాంతాలలో స్ప్రింక్లర్లను ఏర్పాటు లేదా నేలలోని తేమను పర్యవేక్షి ంచే సామర్థ్యం లేకుండా డ్రిప్ సిస్టమ్లను అమర్చడంలో ప్రజాధనం వృథా అయ్యింది. ఈ సాంకేతిక వైఫల్యాలను ప్రధానమంత్రి కృషి సిన్చాయీ యోజన విధానపర, క్రమశిక్షణ సమర్థవంతంగా తొలగిస్తుంది. భౌతిక క్షేత్ర తనిఖీల అవసరాన్ని తగ్గించేందుకు, భూ రికార్డులను బయోమెట్రిక్ ధ్రువీకరణతో అనుసంధానించే మొబైల్ రిజిస్ట్రేషన్ యాప్లను, జీపీఎస్ ఆస్తి ట్రాకింగ్ను రాష్ట్రం ప్రవేశ పెట్టింది. డిజిటల్ వర్క్‌ఫ్లోలు అమలులో ఉన్న అడ్డంకులను ముందుగానే గుర్తించి, క్లస్టర్ పూర్తి సమయాన్ని 8.5 నెలల నుండి 4 నెలలకు తగ్గించాయి. ఈ ప్రయోజనాలు సాధించిన ప్పటికీ, ఈ నమూనాకు ప్లాట్‌ఫారమ్ నిర్వహణలో నిరంతర రాష్ట్ర పెట్టుబడి అవసరం క్షేత్రస్థాయి సిబ్బందికి డిజిటల్ నైపుణ్యం తప్పనిసరి. గుజరాత్ సూక్ష్మ నీటిపారుదల విస్తరణను నేరుగా సుస్థిరతకు ముడిపెట్టింది. ఏదైనా కొత్త బోర్‌వెల్ లేదా నీటిపారుదల అనుసంధానాన్ని ఆమోదించే ముందు, రాష్ట్ర జల ప్రాధికార సంస్థ సమగ్ర ప్రాథమిక భూగర్భ జల వనరుల అంచనాను తప్పనిసరి చేసింది.

రైతులు ఆర్థిక సహపెట్టుబడిదారులుగా, ఫ్రంట్‌లైన్ ఆస్తి నిర్వాహకులుగా ద్వంద్వ బాధ్యతను కలిగి ఉంటారు. అదేవిధంగా, 'ప్రతి చుక్కకు ఎక్కువ పంట' కార్యక్రమం ప్రతి క్లస్టర్కు 18 నుండి 24 నెలల నిర్దిష్ట కాల వ్యవధుల్లో అమలు చేయబడుతుంది. ఆ తర్వాత భూమికి సరైన నీటిపారుదల సాంకేతికతను సరిపోల్చడానికి నేల, నీటిపరీక్షలు జరుగుతాయి. కొనుగోలు ప్రక్రియ రాష్ట్రనిర్వహణలో ఉన్న పోటీ బిడ్డింగ్ వ్యవస్థల ద్వారా జరుగుతుంది, ఇవి సాధారణంగా బహిరంగ మార్కెట్ ధరల కంటే 15 నుండి 25 శాతం తక్కువ ధరలకు పరికరాలను అందిస్తాయి. మహారాష్ట్ర, తెలంగాణ వంటి రాష్ట్రాలు తమ లక్ష్యాలలో నిల కడగా 85 నుండి 92 శాతం సాధిస్తుండగా, తక్కువ సామర్థ్యం గల రాష్ట్రాలు 50 నుండి 65 శాతం వద్ద వెనుకబడి ఉన్నాయి. ఈ చర్యలు తీసుకున్నప్పటికీ, పర్యవేక్షణలో నిర్మాణాత్మక లోపాలు ఉన్నాయి. పనుల పూర్తికి సంబంధించిన కొలమానాలు తరచుగా ఆస్తుల దీర్ఘకాలిక మనుగడ కంటే పరిపాలనా వేగాన్ని కొలుస్తాయి.

పరికరాలను ఏర్పాటు చేసిన రెండు సంవత్సరాల తర్వాత పర్యవేక్షణ గణనీయంగా తగ్గిపోతుంది, బడ్జెట్ పరిమితుల కారణంగా, తృతీయ పక్షం స్వతంత్ర ఆడిట్లు పూర్తయిన క్లస్టర్లలో కేవలం 18 నుండి 22 శాతాన్ని మాత్రమే కవర్ చేస్తున్నాయి, ఆర్థికంగా, కేంద్ర ప్రభుత్వం 2015-2026 వరకు పొడిగించిన కాలానికి రూ.93 వేల కోట్లు కేటాయించింది. ఈ బడ్జెట్ను ప్రధాన నీటిపారుదల పూర్తికి 40 శాతం, సూక్ష్మ నీటిపారుదలకు 50 శాతం, సామర్థ్య పెంపునకు 10 శాతంగా విభజించారు. రాష్ట్ర కేటాయింపు సూత్రాలు సాగునీటి ఆయకట్టు ప్రాంతాలకు (50 శాతం వెయిటేజ్), వర్షాధార ప్రాంతాలకు (30 శాతం), జనాభా సాంద్రతకు (20 శాతం) ప్రాధాన్యత ఇస్తాయి. ఈ సూత్రం రాజస్థాన్, మహారాష్ట్ర, తెలంగాణ వంటి నీటి కొరత ఉన్న రాష్ట్రాలకు అసమానంగా నిధులను మళ్లిస్తుంది. ఈ రాష్ట్రాలు జాతీయ సాగు భూమిలో కేవలం 28 శాతం మాత్రమే కలిగి ఉన్నప్పటికీ, నీటిపారుదల బడ్జెట్లో 35 శాతం వాటాను పొందుతున్నాయి. మహారాష్ట్ర రైతుల వాటాలను అన్నిచోట్లా 10 నుండి 15 శాతం మధ్య ఉంచడానికి వాటాలపై భారీగా

# కృషి ఉడాన్ పథకంతో చవకగా వ్యవసాయ ఉత్పత్తుల కార్గో రవాణా

- ఎపికి కృషి ఉడాన్ పథక ప్రయోజనాలు
- లోక్‌సభలో ఎంపి పుట్టా మహేష్ ప్రశ్నకు కేంద్ర మంత్రి సమాధానం



**ఏలూరు, జులై 24 ప్రభాతవార్త:** వ్యవసాయ ఉత్పత్తులను తక్కువ వ్యయంతో, తక్కువ సమయంలో దేశంలోని వివిధ ప్రాంతాలకు చేరవేసేందుకు కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న కృషి ఉడాన్ పథకం రైతులకు ఎంతో ప్రయోజనకరంగా మారుతోందని ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ తెలిపారు. లోక్‌సభలో కృషి ఉడాన్ పథకం అమలు, ఆంధ్రప్రదేశ్‌కు అందుతున్న ప్రయోజనాలపై ఎంపీ అడిగిన ప్రశ్నకు కేంద్ర పౌర విమానయాన శాఖ సహాయ మంత్రి మురళీధర్ మోహోల్ లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. వ్యవసాయ, ఉద్యానవన, మత్స్య, పశుసంపద, ఆహార ఉత్పత్తులను తక్కువ ఖర్చుతో, వేగంగా మార్కెట్లకు చేరవేయడం కృషి ఉడాన్ పథకం ప్రధాన లక్ష్యమని మంత్రి తెలిపారు. ఈ పథకం కింద ఎంపిక చేసిన విమానాశ్రయాల్లో ప్రయాణికుల విమానాలను సరుకు రవాణాకు వినియోగించే సేవలకు భారత విమానాశ్రయాల ప్రాధికార సంస్థ, రక్షణ మంత్రిత్వ శాఖ ద్వారా విమానం దిగడం, నిలిపివేయడం కోసం వసూలు చేసే రుసుములతో పాటు మార్గ నిర్దేశక సదుపాయ రుసుము, టెర్మినల్ నావిగేషన్ ల్యాండింగ్ రుసుము కూడా మినహాయిస్తున్నట్లు వివరించారు.

కేంద్ర మంత్రి అందించిన వివరాల ప్రకారం రాష్ట్రంలోని విమానాశ్రయాల నుంచి వ్యవసాయ ఉత్పత్తుల సరుకు రవాణా గత రెండేళ్లలో గణనీయంగా పెరిగింది. రాజమండ్రి విమానాశ్రయం నుంచి 2023-24లో 2 మెట్రిక్ టన్నులుగా ఉన్న సరుకు రవాణా, 2025-26 నాటికి 10 మెట్రిక్ టన్నులకు చేరింది. తిరుపతి విమానాశ్రయం నుంచి అదే కాలంలో 7 మెట్రిక్ టన్నుల నుంచి 28 మెట్రిక్ టన్నులకు పెరిగింది. విజయవాడ విమానాశ్రయం నుంచి 162 మెట్రిక్ టన్నుల నుంచి 349 మెట్రిక్ టన్నులకు సరుకు రవాణా పెరిగింది. విశాఖపట్నం విమానాశ్రయం నుంచి 2023- 24లో 1,694 మెట్రిక్ టన్నులుగా ఉన్న సరుకు రవాణా 2025-26లో 1,877 మెట్రిక్ టన్నులకు చేరింది. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్‌లో విశాఖపట్నం విమానాశ్రయం నుంచే అంతర్జాతీయ సరుకు రవాణా సేవలు అందుబాటులో ఉండగా, విజయవాడ, తిరుపతి విమానాశ్రయాల నుంచి కూడా త్వరలో అంతర్జాతీయ సరుకు రవాణా సేవలు ప్రారంభించేందుకు చర్యలు కొనసాగుతున్నాయని కేంద్ర మంత్రి వెల్లడించారు.

కృషి ఉడాన్ పథకం ద్వారా రైతులకు తక్కువ వ్యయంతో వేగవంతమైన రవాణా సౌకర్యం కల్పించడంతో పాటు వ్యవసాయ ఉత్పత్తులకు మెరుగైన మార్కెట్ అవకాశాలు లభిస్తున్నాయని ఎంపీ పుట్టా మహేష్ కుమార్ తెలిపారు. సరుకు రవాణా పెరగడం వల్ల రైతులు, ఉత్పత్తిదారులతో పాటు విమానాశ్రయాల అభివృద్ధికీ దోహద పడుతుందని ఆయన పేర్కొన్నారు.

# 'ప్రజల వద్దకు ధర్మం'తో సనాతన సంస్కృతి వికాసం

- కంచి కామకోటి పీఠాధిపతి విజయేంద్ర సరస్వతి స్వామి



**తిరుమల, జులై 24 ప్రభాతవార్త ప్రతినిధి:** "ప్రజల వద్దకు ధర్మం" అనే దివ్య సంకల్పంతో విద్యార్థుల్లో భారతీయ సంస్కృతి, సనాతన ధర్మం, నైతిక విలువలు, సాంప్రదాయ కళల పట్ల అభిరుచిని పెంపొందించేందుకు నందివిద్య నటేశ్వరి కార్యక్రమం రూపొందించినట్లు కంచీ కామకోటి పీఠాధిపతి విజయేంద్ర సరస్వతి స్వామి తెలిపారు. విద్యార్థుల్లో కళాభిరుచి, క్రమశిక్షణ, సంస్కార విలువలను పెంపొందించే లక్ష్యంతో మృదంగం, భారతీయ నృత్య కళల సమ్మేళనంగా ఈ కార్యక్రమాన్ని రూపొందించారు. 2025 డిసెంబర్‌లో 50 పాఠశాలల్లో ప్రారంభమైన ఈ మహత్తర కార్యక్రమం విశేష ఆదరణతో ఈ ఏడాది వంద పాఠశాలలకు విస్తరించింది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ పాఠశాలలతో బాటు టిటిడి విద్యాసంస్థలు పాల్గొన్నాయి. తిరుపతి ప్రాంత పాఠశాలలకు ప్రత్యేక ప్రాధాన్యం కల్పించారు. నందివిద్య నటేశ్వరి నామం లలితా సహస్రనామంలోని 733, 734 నామాల నుండి ఆవిర్భవించిందని స్వామి వివరించారు. టిటిడి, హెచ్‌డిపిపి, కంచీ కామకోటి పీఠం సంయుక్త ఆధ్వర్యంలో తెలుగు రాష్ట్రాల్లోని వంద పాఠశాలల్లో నందివిద్య నటేశ్వరి కార్యక్రమం విజయవంతమైంది. శుక్రవారం సాయంత్రం తిరుపతిలో పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం ఇందిరా ప్రియదర్శిని ఆడిటోరియంలో విజయేంద్ర సరస్వతి స్వామి వర్చువల్ ద్వారా అనుగ్రహ భాషణం చేశారు.

సనాతన ధర్మ ప్రచారాన్ని క్షేత్రస్థాయికి తీసుకెళ్లే లక్ష్యంతో యువతలో భారతీయ సంస్కృతి, సంప్రదాయాలపై అవగాహన పెంపొందించేందుకు హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమానికి తగు ఆర్థిక సహాయంతో బాటు శ్రీవారి సుప్రభాతం, విష్ణు సహస్రనామం, గోవింద నామాలు తదితర ఆధ్యాత్మిక గ్రంథాలను పుస్తక ప్రసాదంగా ఉచితంగా అందజేశారు. ఈ సందర్భంగా టిటిడి ఇఒ ముద్దాడ రవిచంద్ర, జెఇఒ డాక్టర్ ఏ.శరత్ చెన్నైకి చెందిన ప్రముఖ మృదంగ విద్వాంసులు పద్మవిభూషణ్ డాక్టర్ ఉమయాళ్‌పురం కె. శివరామన్, ప్రముఖ భరతనాట్య కళాకారిణి రేవతి రామ్మోహన్లను ఘనంగా సన్మానించారు. అనంతరం ప్రత్యేక కళాప్రదర్శనలు ప్రేక్షకులను ఆధ్యాత్మికానందంలో ముంచెత్తాయి.

# పైడిభీమవరం పంచాయతీ నిధుల మళ్లింపుపై జెడి విచారణ

- రూ.7.5 కోట్ల నిధుల గోల్‌మాల్‌పై శోధన అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో సిసి రోడ్లు, కాలువలు పరిశీలన

**రణస్థలం (శ్రీకాకుళం జిల్లా), జులై 24 ప్రభాతవార్త:** శ్రీకాకుళం జిల్లా రణస్థలం మండలం పరిధిలోని పారిశ్రామికవాడ పైడిభీమవరం గ్రామ పంచాయతీలో చోటు చేసుకున్న నిధుల అక్రమాలపై ఉన్నతాధికారులు విచారణ వేగవంతం చేశారు. పంచాయతీ సాధారణ నిధులకు సంబంధించి దాదాపు రూ.7.5 కోట్లు పక్కదారి పట్టాయనే ఆరోపణలపై శుక్రవారం విజయవాడ కమిషనరేట్ కార్యాలయ జాయింట్ డైరెక్టర్ (జేడీ) రామనాథ్ నేరుగా రంగంలోకి దిగారు. పైడిభీమవరం పంచాయతీ కార్యాలయాన్ని



సందర్శించిన జేడీ రామనాథ్, రికార్డులను సమగ్రంగా పరిశీలించి విచారణ చేపట్టారు. అనంతరం పంచాయతీ నిధులతో చేపట్టినట్లు చెబుతున్న సీసీ రోడ్లు, డ్రైనేజీ కాలువల నిర్మాణ పనులను ఆయన స్వయంగా క్షేత్రస్థాయిలో తనిఖీ చేశారు. పనుల నాణ్యత, నిధుల వినియోగంపై స్థానిక అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు.

ఈ నిధుల మళ్లింపుపై వార్త పత్రికలో పలు కథనాలు వెలువడిన విషయం తెల్సిందే. ఈ పరిశీలనలో జిల్లా పంచాయతీ అధికారి స్వరూప రాణి, డివిజనల్ పంచాయతీ అధికారి గోపిబాల, మండల పరిషత్ అభివృద్ధి అధికారి ఈశ్వరరావు, డిప్యూటీ ఎంపీడీఓ ప్రసాద్ ఉన్నారు.

# ఎపి ప్రభుత్వ వైద్య కళాశాలలకు గ్లోబల్ గుర్తింపు

- లాన్సెట్‌లో కీలక పరిశోధనకు చోటు
- ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ వెల్లడి



**విజయవాడ, జులై 24 ప్రభాతవార్త ప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్‌లోని ప్రభుత్వ వైద్య కళాశాలలు అంతర్జాతీయ స్థాయిలో తమ ప్రతిభను చాటుకున్నాయి. ప్రజారోగ్య రంగంలో అత్యంత కీలకమైన పోలియో టీకా సంబంధిత పరిశోధనకు ప్రపంచ ప్రఖ్యాత వైద్య జర్నల్ ది లాన్సెట్ గుర్తింపు లభించింది. ఈ పరిశోధనలో భాగస్వాములైన ఆంధ్ర, కర్నూలుమెడికల్ కాలేజీలకు అరుదైన అంతర్జాతీయ గౌరవం దక్కింది. పోలియో నియంత్రణ, టీకా ప్రభావం, ప్రజల్లో రోగనిరోధక శక్తి పెంపు వంటి అంశాలపై సాగిన ఈ కీలక పరిశోధనలో ఏపీ ప్రభుత్వ వైద్య కళాశాలలకు చెందిన వైద్య పరిశోధకులు కీలక పాత్ర పోషించారు. శాస్త్రీయ ఆధారాలతో చేసిన ఈ అధ్యయనం అంతర్జాతీయ వైద్య రంగంలో ప్రాధాన్యతను సంతరించుకుంది. ఈ సందర్భంగా పరిశోధన చేసిన వైద్యులు డాక్టర్ చక్రవర్తి, డాక్టర్ విజయానంద్‌లను మంత్రి సత్యకుమార్ యాదవ్ అభినందించారు. ప్రభుత్వ వైద్య కళాశాలల నుంచి ప్రపంచ స్థాయి పరిశోధనలు వెలువడటం రాష్ట్రానికి గర్వకారణమని పేర్కొన్నారు. ఇదే స్ఫూర్తిని మిగిలిన వైద్య కళాశాలలు కూడా కొనసాగించాలని మంత్రి సత్యకుమార్ యాదవ్ ఆకాంక్షించారు. ప్రభుత్వ వైద్య కళాశాలల్లో పరిశోధన వాతావరణాన్ని మరింత బలోపేతం చేయడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని మంత్రి వివరించారు.

# రాయలసీమ మార్కెట్లకు పోటెత్తిన టమాటా

- డిమాండ్‌కు అనుగుణంగా ధరల హెచ్చుతగ్గులు
- రాష్ట్ర మార్కెటింగ్ శాఖ డైరెక్టర్ రవి పట్టన్ శెట్టి

**విజయవాడ, జులై 24 ప్రభాతవార్త ప్రతినిధి:** రాయలసీమ టమాటా మార్కెట్లలో డిమాండ్ కు అనుగుణంగా ధరల హెచ్చుతగ్గులు నమోదయ్యాయని రాష్ట్ర వ్యవసాయ మార్కెటింగ్ శాఖ డైరెక్టర్ రవి పట్టన్ శెట్టి ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం రాయలసీమ ప్రాంతంలోని పలమనేరు, వి.కోట, పుంగనూరు, మదనపల్లె, ములకల చెరువు, గుర్రంకొండ, కలికిరి, పట్టికొండ, రాప్తాడు (ప్రైవేట్ మార్కెట్), పీపుల్లి (ప్రైవేట్ మార్కెట్) మార్కెట్ యార్డులకు మొత్తం 5,564.91 మెట్రిక్ టన్నుల మొదటి రకం,6,650.17 మెట్రిక్ టన్నుల రెండవ రకం టమాటాలు చేరగా మొత్తం రాకలు 12,215.08 మెట్రిక్ టన్నులు నమోదయ్యాయని తెలిపారు.



పలమనేరు, వి.కోట, పుంగనూరు, మదనపల్లె మార్కెట్ యార్డుల్లో నాణ్యమైన టమాటా రాకతో ధరలు నిలకడగా నమోదయ్యాయని, కలికిరి మార్కెట్‌లో ఇతర జిల్లాలు, రాష్ట్రాల నుంచి డిమాండ్ పెరగడం వల్ల గత వారం కంటే మెరుగైన ధరలు లభించినప్పటికీ, నిన్నటితో పోలిస్తే స్వల్ప తగ్గుదల కనిపించిందన్నారు. ములకలచెరువు మార్కెట్‌లో గరిష్ట మార్కెటింగ్ సీజన్ కొనసాగుతుండటంతో రాకలు అధికంగా నమోదయ్యాయని, డిమాండ్ సరఫరా పరిస్థితులను బట్టి ధరలు నిర్ణయించబడుతున్నాయని వివరించారు.

రాప్తాడు ప్రైవేట్ మార్కెట్కు అత్యధికంగా 6,750 మెట్రిక్ టన్నుల టమాటా రాక నమోదైందని తెలిపారు. అధిక ఉత్పత్తి, స్థానిక మార్కెట్లకు భారీగా వస్తున్న సరుకు, అలాగే కర్ణాటక, చిత్తూరు, హిమాచల్ ప్రదేశ్ ప్రాంతాల నుంచి సరఫరా పెరగడం వల్ల మార్కెట్లో లభ్యత అధికమై ధరలు కొంత తగ్గినట్లు పేర్కొన్నారు. పట్టికొండ మరియు పీపుల్లి మార్కెట్లలో టమాటా రాకలు నమోదు కాలేదని తెలిపారు. సీజన్ ముగింపు దశలో ఆకస్మిక వాతావరణ మార్పులు, సాగుకు అనుకూలం కాని పరిస్థితుల ప్రభావంతో కొన్ని ప్రాంతాల్లో టమాటాపై నల్ల మచ్చలు ఏర్పడి నాణ్యత దెబ్బతిన్నట్లు తెలిపారు. ఫెయిర్ క్వాలిటీ, దెబ్బతిన్న టమాటాకు వ్యాపారులు అధిక ధరలు ఇవ్వడానికి ఆసక్తి చూపడం లేదని, అయితే మంచి నాణ్యత కలిగిన టమాటాకు మాత్రం మార్కెట్లో డిమాండ్ కొనసాగు తోందని వెల్లడించారు.

రైతులు టమాటాను నాణ్యత ఆధారంగా గ్రేడింగ్ చేసి మార్కెట్‌కు తీసుకువస్తే మెరుగైన ధరలు పొందే అవకాశం ఉంటుందని సూచించారు. రాష్ట్ర వ్యవసాయ మార్కెటింగ్ శాఖ మార్కెట్ పరిస్థితులను నిరంతరం పర్యవేక్షిస్తూ రైతులకు రోజువారీ ధరలు, రాకలు, మార్కెట్ ధోరణులపై తాజా సమాచారాన్ని ఎప్పటికప్పుడు అందుబాటులో ఉంచుతున్నట్లు ఆయన తెలిపారు.

25-7pg10:25-7pg10.qxd 7/24/2026 11:48 PM Page 1



# నేడు జింబాబ్వేతో రెండో టి20




## యువ ప్లేయర్‌పై వేటు
## భారత్ తుది జట్టులో ముగ్గురికి నిరాశే

**న్యూఢిల్లీ:** జింబాబ్వే పర్యటనను విజయంతో ఘనంగా ప్రారంభించిన టీమిండియా మరో ఆసక్తికర పోరుకు సిద్ధమైంది. ఈ నెల 25వ తేదీన హరారే వేదికగా జరిగే రెండో టి20లో ఆతిథ్య జింబాబ్వేతో అమీతుమీ తేల్చుకోనుంది. తొలి టి20 తరహాలోనే ఏకపక్ష విజయంతో మరో మ్యాచ్ మిగిలి ఉండగానే సిరీస్ కైవసం చేసుకోవాలనే పట్టుదలతో భారత్ ఉంది. తద్వారా ఆఖరి మ్యాచ్‌లో బెంచ్ ఆటగాళ్లకు అవకాశాలు ఇవ్వాలని భారత్ భావిస్తోంది. మరోవైపు రెండో ఈ మ్యాచ్ గెలిచి సిరీస్‌పై ఆశలు సజీవంగా ఉంచుకోవాలనే పట్టుదలతో జింబాబ్వే ఉంది. దాంతో ఈ మ్యాచ్‌పై సర్వత్రా ఆసక్తి నెలకొంది. తొలి టి20 జరిగిన హరారే వేదికగానే ఈ మ్యాచ్ జరగనుండటంతో టీమిండియా కాంబినేషన్‌లో పెద్దగా మార్పులు జరిగే అవకాశం లేదు. కానీ తన అరంగేట్ర మ్యాచ్‌లో విఫలమైన అశోక్ శర్మ(0/29)ను తప్పించి మరో యువ పేసర్ యశ్ ఠాకూర్‌కు అవకాశం ఇవ్వొచ్చు. ఈ ఒక్కటి మినహా ఎలాంటి మార్పు జరిగే అవకాశం లేదు. దాంతో సూర్యాన్ష్ షెడ్గే, ప్రభ్‌సిమ్రాన్ సింగ్, హర్ష్ దూబేలకు నిరాశే ఎదురు కానుంది. అభిషేక్ శర్మ మాత్రం తొలి టి20లో దారుణంగా విఫలమయ్యాడు. అతను సత్తా చాటాల్సి ఉంది. ఇషాన్ కిషన్, శ్రేయస్ అయ్యర్ పర్వాలేదనిపించగా, మిగతా బ్యాటర్లకు అవకాశం దక్కలేదు. తిలక్ వర్మ, శివమ్ దూబే, రింకూ సింగ్ లోయరార్డర్‌లో ఆడనున్నారు. మయాంక్ యాదవ్ పేస్ విభాగాన్ని నడిపించ నున్నాడు. రెండేళ్ల విరామం తర్వాత భారత జట్టులోకి వచ్చిన మయాంక్ యాదవ్ మ్యాచ్ విన్నింగ్ ప్రదర్శనతో ఆకట్టుకున్నాడు. అతనికి తోడుగా ప్రిన్స్ యాదవ్ కూడా సత్తా చాటాడు. కానీ తొలి మ్యాచ్ అనే బెరుకో ఏమో కానీ అశోక్ శర్మ ధారళంగా పరుగులిచ్చుకున్నాడు. అతనికి మరో అవకాశం ఇస్తారా? లేక యశ్ ఠాకూర్ ఆడిస్తారా? అనేది చూడాలి. స్పెషలిస్ట్ స్పిన్నర్‌గా రవి బిష్ణోయ్ ఆడనున్నాడు.

**కాగా భారత్‌తో రెండో టి20 తుది జట్టు(అంచనా)**
అభిషేక్ శర్మ, ఇషాన్ కిషన్, శ్రేయస్ అయ్యర్, తిలక్ వర్మ, శివమ్ దూబే, రింకూ సింగ్, రవి బిష్ణోయ్, ప్రిన్స్ యాదవ్, మయాంక్ యాదవ్, వైభవ్ సూర్యవంశీ, అశోక్ శర్మ/యశ్ ఠాకూర్.

## వరల్డ్ కప్‌లో.. మహిళల ఎయిర్ పిస్టల్‌లో భారత్‌కు రజతం



**న్యూఢిల్లీ:** ఐఎస్ఎస్ఎఫ్ వరల్డ్ కప్ రైఫిల్/పిస్టల్/షాట్‌గన్ టోర్నమెంట్‌లో, మహిళల పిస్టల్ ఈవెంట్‌లో షూటర్ టీమ్ రజత పతకాన్ని కైవసం చేసుకుని, ఈ టోర్నమెంట్‌లో భారతదేశానికి తొలి పతకాన్ని అందించింది. శుక్రవారం చైనాలోని హాంగ్‌జౌలో జరిగిన మహిళల 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ ఫైనల్‌లో భారత్ టీం ఈ విజయాన్ని సాధించింది. 22 యేళ్ల క్రీడాకారిణి ఫైనల్‌లో 243.4 పాయింట్లు సాధించి, చైనాకు చెందిన ప్రస్తుత ప్రపంచ ఛాంపియన్ కియాన్‌క్సున్ యావో (243.6 పాయింట్లు) చేతిలో 0.2 పాయింట్ల తేడాతో ఓడిపోయింది. ఇరాన్‌కు చెందిన హనియే రోస్తామియాన్ కాంస్యం గెలుచుకుంది. ఈలోగా, 137.6 పాయింట్లతో ఏడవ స్థానంలో నిలవడంతో సురుచి ఫోగట్ వరల్డ్ కప్ సర్క్యూట్‌లో తన విజయ పరంపరకు తెరపడింది. గతేడాది నుంచి ఆమె నాలుగు వరల్డ్ కప్, వరల్డ్ కప్ ఫైనల్ టైటిళ్లను గెలుచుకుంది. అంతకుముందు, రెండుసార్లు ఒలింపియన్‌గా నిలిచిన మను భాకర్, ఆర్‌పిఓ అథ్లెట్‌గా పోటీపడి, క్వాలిఫికేషన్ రౌండ్‌లో 582 పాయింట్ల స్కోరుతో ఓవరాల్‌గా నాలుగో స్థానంలో నిలిచింది. 579 పాయింట్లతో ఫైనల్స్‌కు అర్హత సాధించిన సురుచి టీమ్ వరుసగా ఏడవ, ఎనిమిదవ స్థానాల్లో నిలిచారు. తొలి ఐదుషాట్ల సిరీస్ తర్వాత, అనుభవజ్ఞురాలైన సురుచి సంయుక్తంగా అగ్రస్థానంలో ఉండగా, సైన్యం ఐదవ స్థానంలోనిలిచింది. అయితే, ఐదు షాట్‌ల రెండవ సిరీస్‌లో అద్భుతమైన 51.9 స్కోరు సాధించడంతో, సైన్యామ్ 101.6 పాయింట్ల ఓవరాల్ స్కోరుతో యావోతో కలిసి అగ్రస్థానానికి చేరుకుంది. ఆ తర్వాత 16 షాట్‌ల తర్వాత, సైన్యామ్ యావో కంటే 1.2 పాయింట్లు వెనుకబడింది. కానీ అద్భుతమైన సంయమనం ప్రదర్శించి ఆ అంతరాన్ని క్రమంగా తగ్గించుకుంటూ వచ్చి, చివరికి కేవలం 0.2 పాయింట్ల తేడాతో వెనుకబడి రజత పతకాన్ని కైవసం చేసుకుంది.

## కామన్వెల్త్ గేమ్స్.. సెమీఫైనల్‌కు శ్రీహరి



**న్యూఢిల్లీ:** కామన్వెల్త్ గేమ్స్ 2026లో శ్రీహరి నటరాజ్ సెమీఫైనల్‌కు చేరుకున్నాడు. గ్లాస్గోలో శుక్రవారం జరిగిన కామన్వెల్త్ గేమ్స్ 2026 పురుషుల 50 మీటర్ల బ్యాక్‌స్ట్రోక్ ఈవెంట్‌లో భారత క్రీడాకారుడు శ్రీహరి సెమీఫైనల్‌కు అర్హత సాధిం చాడు. 25 ఏళ్ల అతను తన హీట్‌లో 25.52 సమయంతో ఐదవ స్థానంలో నిలిచాడు, కానీ ఐదు హీట్‌ల మొత్తం పాయింట్లలో 14వ స్థానంలో నిలిచి తదుపరి దశకు అర్హత సాధించాడు. ఇంగ్లాండ్‌కు చెందిన ఆలివర్ మోర్గాన్ 24.91 సెకన్ల సమయంతో నటరాజ్ హీట్ 4ను గెలుచుకున్నాడు. దక్షిణాఫ్రికాకు చెందిన పీటర్ కోట్జీ 24.45 సెకన్ల గేమ్స్ రికార్డు సమయంతో మొదటి రౌండ్ తర్వాత అత్యంత వేగంగా నిలిచాడు. అంతకుముందు, భారత క్రీడాకారులు ఆర్వీవీబీకే బుడిగిన, ఇమామ్ అలీ పురుషుల 100 ఫ్రీస్టైల్ ఎస్13 హీట్స్‌లో వరుసగా మూడవ, ఎనిమిదవ స్థానాల్లో నిలిచి ఫైనల్‌కు అర్హత సాధించారు. బుడిగిన 57.10 సమయంతో ముగించగా, అతని సహచరుడు అలీ 1:05.32 సమయాన్ని నమోదు చేశాడు. స్కాట్లాండ్‌కు చెందిన స్టీఫెన్ క్లెగ్ 56.57 సమయంతో అగ్రస్థానంలో నిలిచాడు. ఈ హీట్‌లో పాల్గొన్న ఎనిమిది మంది ఫైనల్‌కు అర్హత సాధించారు.

## పురుషుల పారా పవర్ లిఫ్టింగ్.. నాలుగో స్థానంలో అశోక్

**న్యూఢిల్లీ:** కామన్వెల్త్ గేమ్స్ 2026 రెండవ రోజున జరిగిన పురుషుల లైట్‌వెయిట్ పారా పవర్‌లిఫ్టింగ్ ఈవెంట్‌లో భారత క్రీడాకారుడు అశోక్ నాలుగో స్థానంలో నిలిచి, పతకాన్ని తృటిలో కోల్పోయాడు. గ్లాస్గోలో శుక్రవారం భారతదేశానికి తొలి పతకాలు అందించే ఈవెంట్లలో ఒకదానిలో పోటీపడిన అశోక్, తన వ్యక్తిగత అత్యుత్తమ ప్రదర్శనగా 200 కేజీల బరువును ఎత్తి, 143.8 పాయింట్లను సాధించి, పతకానికి కొద్ది దూరంలో నిలిచాడు. అతను మొదట 195 కిలోల బరువును విజయవంతంగా ఎత్తి, రెండవ ప్రయత్నంలో 200 కిలోలకు పెంచాడు. ఆ భారత క్రీడాకారుడు 205 కిలోల వద్ద చివరి ప్రయత్నం చేసినప్పటికీ, ఆ బరువును ఎత్తలేకపోయాడు. స్వదేశీయుడైన పరంజీత్ కుమార్ తన తొలి ప్రయత్నంలో 176 కేజీలు ఎత్తి 135.6 పాయింట్లతో ఏడవ స్థానంలో నిలిచాడు. అతను 179 కేజీల వద్ద తన రెండవ మరియు మూడవ ప్రయత్నాలలో విఫలమై, కేవలం ఒకే చెల్లుబాటు అయ్యే లిఫ్ట్‌తో పోటీని ముగించాడు. ఈ ఈవెంట్‌లో అత్యుత్తమ ప్రదర్శన కనబరిచిన వారిలో ఇంగ్లండ్‌కు చెందిన మార్క్ స్వాన్ ఒకరు. అతను 222 కిలోల బరువును




విజయవంతంగా ఎత్తి కొత్త యూరోపియన్ రికార్డును నెలకొల్పాడు. మరోవైపు, టీమ్ ఫైనల్‌లో భారత పురుషుల ఆర్టిస్టిక్ జిమ్నాస్టిక్స్ జట్టు తమ అద్భుత ప్రదర్శనను కొనసాగించింది. తపన్ మొహంతి, యోగేశ్వర్ సింగ్, తాపేశ్వర్నాథ్ దాస్ మరియు స్వాతిష్ కేపీల బృందం ఫ్లోర్ ఎక్సర్‌సైజ్ (32.250), పోమెల్ హార్స్ (31.250), రింగ్స్ (36.050) మరియు వాల్ట్ (37.750) విభాగాలలో తమ ఉపవిభాగాలను పూర్తి చేసిన జట్లలో అగ్రస్థానంలో నిలిచారు,

## ప్రపంచ స్క్వాష్.. సెమీఫైనల్స్‌కు అనాహత్



**న్యూఢిల్లీ:** భారత టాప్ సీడ్ అనాహత్ సింగ్, ఈజిప్టుకు చెందిన హబీబా రిజ్క్‌ను ఓడించి, 2026 ప్రపంచ జూనియర్ వ్యక్తిగత ఛాంపియన్‌షిప్‌లలో తన అద్భుతమైన ప్రచారాన్ని కొనసాగిస్తూ సెమీ ఫైనల్స్‌లో అర్హతతో స్థానం సంపాదించుకుంది. మహిళల ప్రపంచ 20వ ర్యాంకర్ అనాహత్ శుక్రవారం జరిగిన క్వార్టర్ ఫైనల్స్‌లో హబీబాను 11-7, 11-5, 6-11, 11-9 తేడాతో ఓడించింది. ఆమె ప్రపంచ జూనియర్స్ టోర్నమెంట్‌లో వరుసగా రెండు సెమీఫైనల్స్‌కు చేరిన తొలి భారతీయ క్రీడాకారిణిగా నిలవడమే కాకుండా, టైటిల్ గెలుచుకోవడానికి బలమైన ఫేవరెట్‌గా నిలిచింది. మరోవైపు, చైనాకు చెందిన హాంకాంగ్ క్రీడాకారిణి హెలెన్ టాంగ్, బెల్జియం క్రీడాకారిణి సవన్నా మోక్సామ్‌లపై వరుస గేమ్‌లలో విజయం సాధించిన తర్వాత బార్బ్ సమేహ్, మాలికా ఎల్కరక్సీ ముందంజ వేశారు. అలాగే, ఈజిప్ట్‌కు చెందిన రెండో సీడ్ ఆడమ్ హవాల్, సౌదీ అరేబియాకు చెందిన మహమ్మద్ అల్నాస్‌ఫాన్‌పై 3-1 తేడాతో గెలిచి ముందంజ వేశాడు.

పురుషుల విభాగంలో, ఫ్రాన్స్‌కు చెందిన అమీర్ ఖలీద్‌జౌసెలిన్‌తో జరిగిన హోరాహోరీ పోరులో ఈజిప్ట్‌కు చెందిన మర్వాన్ అస్సల్ చివరి నాలుగు స్థానాల్లోకి ప్రవేశించాడు. అతనితో పాటు, అతని స్వదేశీయుడు మరియు నెం. 2 సీడ్ అయిన రుఖయ్యా సలేం కూడా తదుపరి రౌండ్‌కు చేరుకున్నాడు. మలేషియాకు చెందిన విట్నీ విల్సన్‌తో జరిగిన హోరాహోరీ పోరులో ఐదు గేమ్‌ల పాటు సాగిన మ్యాచ్‌లో సలేం ముందంజ వేసింది.

## మార్కెట్లలో వరుసగా ఐదో రోజు నష్టాలు
### సెన్సెక్స్ 332 పాయింట్లు, నిఫ్టీ 102 పాయింట్లు డౌన్



**ముంబయి,జులై 24:** దేశీయ స్టాక్ మార్కెట్లు శుక్రవారం ట్రేడింగ్‌లో ఇంట్రాడే కనిష్ట స్థాయిల నుంచి కొంత కోలుకున్నప్పటికీ, చివరికి వరుసగా ఐదో రోజు నష్టాలతో ముగిశాయి. ముడి చమురు ధరలపై ఆందోళనలు, మధ్యప్రాచ్య ఉద్రిక్తతలు, విదేశీ పెట్టుబడుల ఉపసంహరణ మార్కెట్ సెంటిమెంట్‌ను బలహీనపరిచాయి.ట్రేడింగ్ ముగిసే సమయానికి బిఎస్‌ఇ సెన్సెక్స్ 331.62 పాయింట్లు లేదా 0.43 శాతం క్షీణించి 76,059.77 వద్ద ముగిసింది. ఎన్‌ఎస్‌ఇ నిఫ్టీ 102.15 పాయింట్లు పడిపోయి 23,767.45 వద్ద స్థిరపడింది. గత ఐదు ట్రేడింగ్ సెషన్లలో సెన్సెక్స్ మొత్తం 2.67 శాతం, నిఫ్టీ 2.32 శాతం మేర నష్టపోయాయి. బిఎస్‌ఇ మిడ్‌క్యాప్ సూచీ 0.16 శాతం, స్మాల్ క్యాప్ సూచీ 0.23 శాతం క్షీ ణించాయి. మార్కెట్ బ్రెడ్త్ మాత్రం సానుకూలంగా నమోదైంది. ఎన్‌ఎస్‌ఇలో 1,703 షేర్లు లాభపడగా, 1,596 షేర్లు నష్టపోయాయి. 126 షేర్లు యథాతథంగా ముగిశాయి. కమోడిటీ మార్కెట్లో సెప్టెంబర్ డెలివరీ బ్రెంట్ క్రూడ్ ధర బ్యారెల్‌కు 97.48 డాలర్లకు తగ్గింది. రూపాయి డాలర్‌తో పోలిస్తే స్వల్పంగా బలపడింది. గత ముగింపు 96.73 తో పోలిస్తే 96.56కు బలపడింది. బంగారం ధరలు ఎంసిఎక్స్‌లో స్వల్ప లాభాలతో ట్రేడయ్యాయి. 0.3శాతం బలపడి రూ.1,43,308కి చేరింది. అంతర్జాతీయ మార్కెట్లలో మిశ్రమ ధోరణి కనిపించింది. యూరప్ మార్కెట్లు లాభాల్లో ట్రేడవగా, ఆసియా మార్కెట్లు ఎక్కువగా నష్టాల్లో ముగిశాయి. మధ్యప్రాచ్యంలో ఉద్రిక్త పరిస్థితులు, ఎర్ర సముద్రంలో హౌతీ మిలిటెంట్ల దాడులు, హర్మూజ్ జలసంధిపై ఉద్రిక్తతలు ప్రపంచ మార్కెట్లను ప్రభావితం చేస్తున్నాయి. ఇదే సమయంలో అమెరికాఇరాన్ మధ్య కొనసాగుతున్న ఘర్షణలు, అమెరికా విధించిన కొత్త దిగుమతి సుంకాలు కూడా ఇన్వెస్టర్లలో ఆందోళన పెంచుతు న్నాయి.కార్పొరేట్ రంగంలో ఇన్ఫోసిస్ షేరు 0.80 శాతం పడిపోయింది. కంపెనీ తొలి త్రైమాసిక నికర లాభం తగ్గినా, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ప్రాజెక్టుల్లో బలమైన ఆర్డర్లు లభించాయని యాజమాన్యం తెలిపింది. లారస్‌ల్యాబ్స్, వెండ్ట్, అతుల్, ఐఈఎక్స్, ఎపిఎఆర్ ఇండస్ట్రీస్ వంటి కంపెనీల షేర్లు లాభపడగా, మోతీలాల్ ఓస్వాల్ ఫైనాన్షియల్ సర్వీసెస్, రూట్ మొబైల్, ఫ్రాక్టల్ అనలిటిక్స్ షేర్లు

## మార్కెట్‌లోకి బ్రెజ్జా కొత్త వెర్షన్



**ముంబయి,జులై 24:** మారుతి సుజుకి భారత మార్కెట్లో కొత్త బ్రెజ్జా ఫేస్‌లిఫ్ట్ వెర్షన్‌ను అధికారికంగా విడుదల చేసింది. కొత్త డిజైన్, మరిన్ని ప్రీమియం ఫీచర్లు, మెరుగైన భద్రతా వ్యవస్థతో ఈ ఎస్‌యూవీని తీసుకొచ్చింది. బ్రెజ్జా ఎల్‌ఎక్స్ఐ, విఎక్స్ఐ, జడ్‌ఎక్స్ఐ అనే నాలుగు వేరియంట్లలో లభిస్తుంది. రూ.11,000 టోకెన్‌తో బుకింగ్స్ ప్రారంభమయ్యాయి. డిజైన్ పరంగా ముందు భాగంలో కొత్త గ్రిల్, రీడిజైన్‌చేసిన బంపర్, కొత్త ఎల్ఇడి హెడ్‌ల్యాంప్స్, డీఆర్ఎల్స్ ఆకట్టుకుంటున్నాయి. కొత్త అలాయ్ వీల్స్‌తో పాటు వెనక భాగంలో టెయిల్ ల్యాంప్ డిజైన్‌ను కూడా మార్చారు. క్యాబిన్‌లో బ్లాక్‌బ్రౌన్ డ్యూయల్ టోన్ థీమ్‌ను కొనసాగిస్తూ 10.1 అంగుళాల టచ్‌స్క్రీన్, వైర్‌లెస్ ఆండ్రాయిడ్ ఆటో, యాపిల్ కార్‌ప్లే, అలెక్సా సపోర్ట్, వెంటిలేటెడ్ ఫ్రంట్ సీట్లు, వైర్‌లెస్ ఛార్జర్, ఆటో క్లైమేట్ కంట్రోల్, 360 డిగ్రీ కెమెరా వంటి ప్రీమియం ఫీచర్లను జోడించారు. భద్రతకు కూడా కంపెనీ పెద్దపీట వేసింది. అన్ని వేరియంట్లలో 6 ఎయిర్‌బ్యాగ్స్, ఇఎస్‌పి, హిల్ హోల్డ్ అసిస్ట్, ఎబిఎస్ఇబిడి, చైల్డ్ సీట్ మోంట్స్, టిపిఎంఎస్, బ్లైండ్ స్పాట్ వార్నింగ్, రియర్ క్రాస్ ట్రాఫిక్ అలర్ట్, సేఫ్ ఎగ్జిట్ వార్నింగ్, ఫ్రంట్ పార్కింగ్ సెన్సర్లు వంటి ఫీచర్లు ఉన్నాయి. ఈ కొత్త బ్రెజ్జాకు భారత్ ఎంసిఎపిలో 5స్టార్ సేఫ్టీ రేటింగ్ కూడా లభించింది. ఇంజిన్ పరంగా 1.5లీటర్ పెట్రోల్, 1.0లీటర్ టర్బో పెట్రోల్, సీఎన్‌జీ అనే మూడు ఆప్షన్లు ఇవ్వనున్నట్లు కంపెనీ తెలిపింది. పెట్రోల్ మోడళ్లకు 6స్పీడ్ మాన్యువల్, 6స్పీడ్ ఆటోమేటిక్ గేర్‌బాక్స్‌లు అందుబాటులో ఉంటాయి. సిఎన్‌జీ వేరియంట్‌కు మాన్యువల్ గేర్‌బాక్స్ మాత్రమే ఉంటుంది.

## శ్రీరామ్ ఫైనాన్స్ లాభం రూ.3,445 కోట్లు





**ముంబయి,జులై 24:** ప్రైవేట్ నాన్‌బ్యాంకింగ్ ఫైనాన్స్ సంస్థ శ్రీరామ్ ఫైనాన్స్ తొలి త్రైమాసికం బలమైన ఆర్థిక ఫలితాలను నమోదు చేసింది. కంపెనీ ఏకీకృత నికర లాభం, నికర వడ్డీ ఆదాయం గణనీయంగా పెరగగా, ఆస్తుల నాణ్యత కూడా మెరుగుపడింది. వ్యాపార అవసరాల కోసం దేశీయ, అంతర్జాతీయ మార్కెట్లలో రుణ పత్రాల జారీ ద్వారా నిధుల సమీకరణకు కంపెనీ బోర్డు ఆమోదం తెలిపింది.జూన్‌తో ముగిసిన త్రైమా సికంలో కంపెనీ స్టాండ్‌అలోన్ నికర లాభం వార్షిక ప్రాతిపదికన 59.8శాతం పెరిగి రూ.3,445 కోట్లకు చేరింది. గత యేడాది ఇదే కాలంలో ఇది రూ.2,156 కోట్లు కాగా, గత త్రైమాసికంలోని రూ.3,014 కోట్లతో పోలిస్తే 14.3 శాతం వృద్ధి నమోదైంది.కంపెనీ నికర వడ్డీ ఆదాయం గత యేడాది రూ.6,026 కోట్ల నుంచి 33.7 శాతం పెరిగి రూ.8,056 కోట్లకుచేరింది. గత త్రైమాసికం లోని రూ.6,899 కోట్లతో పోలిస్తే 16.8 శాతం అధికంగా నమోదైంది. సమయంలో నికర వడ్డీ మార్జిన్ గత యేడాది 8.11 శాతం నుంచి 9.04 శాతానికి పెరిగింది. మార్చి త్రైమాసికంలో ఇది 8.61 శాతంగా నమోదైంది.కంపెనీ ఆపరేటింగ్ లాభం కూడా వార్షిక ప్రాతిపదికన 45.2 శాతం పెరిగి రూ.6,085 కోట్లకు చేరింది. గత ఏడాది ఇదే కాలంలో ఇది రూ.4,192 కోట్లు కాగా, గత త్రైమాసికంతో పోలిస్తే 14.3 శాతం వృద్ధి నమోదైంది. స్థూల నిరర్థక ఆస్తులు 4.64 శాతంగా నమోదయ్యాయి. గత యేడాది ఇదే కాలంలో ఇవి 4.53 శాతం, మార్చి త్రైమాసికంలో 4.58 శాతంగా ఉన్నాయి.నికర నిరర్థక ఆస్తులు గత యేడాది 2.57 శాతం నుంచి 2.33 శాతానికి మెరుగుపడ్డాయి. మార్చి త్రైమాసికంతో పోలిస్తే ఈ స్థాయి యథాతథంగా కొనసాగింది. రుణ పత్రాల ద్వారా నిధుల సమీకరణకు బోర్డు ఆమోదంవ్యాపార విస్తరణ, నిధుల అవసరాల దృష్ట్యా ఆగస్టు 1 నుంచి అక్టోబర్ 31 వరకు దేశీయ, విదేశీ మార్కెట్లలో ఒకటి లేదా అంతకంటే ఎక్కువ విడతల్లో రిడీమబుల్ నాన్‌కన్వర్టిబుల్ డిబెంచర్లు (ఎన్సీడీ), సబార్డినేటెడ్ డిబెంచర్లు, బాండ్లు, నోట్లు మరియు ఇతర రుణ సాధనాల జారీ ద్వారా నిధులు సమీకరించే ప్రణాళికకు కంపెనీ బోర్డు ఆమోదం తెలిపింది.అదనంగా, జపాన్‌కు చెందిన ఎంయుఎఫ్‌జి సంస్థకు చేసిన ప్రిఫరెన్షియల్ అలాట్‌మెంట్ ద్వారా సమీకరించిన నిధుల్లో రూ.37,451 కోట్లను కంపెనీ ఈ త్రైమాసికంలో వినియోగించినట్లు వెల్లడించింది. మిగిలిన రూ.2,167 కోట్లను లిక్విడ్ మ్యూచువల్ ఫండ్లలో పెట్టుబడి పెట్టినట్లు తెలిపింది.

## రూ.81 వేల కోట్లతో ఆర్గనాన్ కొనుగోలుకు సన్‌ఫార్మా డీల్

**ముంబయి,జులై 24:** భారత ఔషధ దిగ్గజం సన్ ఫార్మాస్యూటికల్ ఇండస్ట్రీస్ ప్రతిపాదించిన అమెరికాకు చెందిన ఔషధ సంస్థ ఆర్గనాన్ కొనుగోలు ఒప్పందానికి ఆ సంస్థ షేర్‌హోల్డర్లు ఆమోదం తెలిపారు. దీంతో సన్ ఫార్మా చరిత్రలోనే అతిపెద్ద కొనుగోలు ప్రక్రియ పూర్తి దిశగా మరో కీలక ముందడుగు పడింది.ఈయేడాది ఏప్రిల్‌లో ప్రకటించిన ఈ ఒప్పందం మొత్తం విలువ అప్పులతో కలిపి సుమారు 9.4 బిలియన్ డాలర్లు అంటే సుమారు దాదాపు రూ.81 వేలకోట్లకు పైగా ఉంది. అవసరమైన నియంత్రణ సంస్థల అనుమతులు సహా మిగిలిన అన్ని ప్రక్రియలు పూర్తయితే ఈ కొనుగోలు 2027 ఆరంభంలో పూర్తయ్యే అవకాశం ఉందని సన్ ఫార్మా తెలిపింది. ప్రస్తుతం ఈ గడువులో ఎలాంటి మార్పు లేదని కంపెనీ స్పష్టం చేసింది.2014లో రాన్‌బాక్సీ ల్యాబొరేటరీస్ కొనుగోలును అధిగమిస్తూ, ఆర్గనాన్ కొనుగోలు సన్ ఫార్మా చరిత్రలోనే అతిపెద్ద విలీన ఒప్పందంగా నిలవనుంది.ప్రత్యేక ఔషధాలు, జనరిక్ మందులకే పరిమితమైన వ్యాపారాన్ని మరింత విస్తరించి, ప్రపంచ వ్యాప్తంగా తమ ఉనికిని బలోపేతం చేయడమే ఈ కొనుగోలు వెనుక ప్రధాన ఉద్దేశమని సంస్థపేర్కొంది. ముఖ్యంగా మహిళల ఆరోగ్య సంరక్షణ ఉత్పత్తులు, ఇప్పటికే మార్కెట్లో స్థిరంగా ఉన్న ఔషధ విభాగాల్లో సన్ ఫార్మా మరింత బలమైన స్థానాన్ని సంపాదించనుంది. అలాగే అభివృద్ధి చెందినదేశాల మార్కెట్లలో కంపెనీఉనికి మరింత పెరుగుతుందని అంచనా వేస్తున్నారు.మెర్క్ అండ్ కో. నుంచి 2021లో విడిపోయిన ఆర్గనాన్ సంస్థ ప్రపంచవ్యాప్తంగా మహిళల ఆరోగ్య ఉత్పత్తులు, బయోసిమిలర్లు, ఇప్పటికే స్థిరపడిన పలు బ్రాండ్ ఔషధాలను విక్రయిస్తోంది.

## దేశీయ మార్కెట్‌కు హోండా 10 కొత్త టూవీలర్లు




**ముంబయి,జులై 24:** భారత మార్కెట్లో పట్టు మరింత పెంచేందుకు హోండా మోటార్ సైకిల్ అండ్ స్కూటర్ ఇండియా ఒకేసారి 10 కొత్త టూ వీలర్లను ప్రకటించింది. వీటిలో ఏడు పూర్తిగా కొత్త మోడళ్లు, మూడు అప్‌డేటెడ్ బైక్‌లు ఉన్నాయి. స్కూటర్, రోడ్‌స్టర్, క్రూజర్, అడ్వెంచర్, ఎలక్ట్రిక్, ఫ్లెక్స్ ఫ్యూయల్ ఇలా దాదాపు అన్ని సెగ్మెంట్లలోనూ కొత్త ఉత్పత్తులను తీసుకొచ్చింది. ధరలు, విడుదల తేదీలను దశలవారీగా ప్రకటించనున్నది. నగర ప్రయాణాలతో పాటు అడ్వెంచర్ రైడింగ్‌కు అనువుగా రూపొందించిన 160 సిసి స్కూటర్. 27 లీటర్ల అండర్‌సీట్ స్టోరేజ్, 8.1 లీటర్ల ఫ్యూయల్ ట్యాంక్ దీని ప్రత్యేకతలు. ఈ85 ఇంధనానికి సపోర్ట్ చేసే భారత తొలి స్కూటర్‌గా హోండా పేర్కొంది. సిబి 500 రెట్రో డిజైన్‌తో కూడిన ప్రీమియం రోడ్‌స్టర్. 501 సిసి సింగిల్ సిలిండర్ ఇంజిన్‌తో వస్తుంది. అలాయ్, స్పోక్ ట్యూబ్‌లెస్, గ్రాఫిక్స్‌తో కూడిన స్పోక్ ట్యూబ్‌లెస్ అనే మూడు వేరియంట్లలో అందుబాటులోకి రానుంది. లైఫ్‌స్టైల్ క్రూజర్‌గా రూపొందించిన ఈ బైక్‌లో 286 సిసి లిక్విడ్ కూల్డ్ ఇంజిన్ ఉంది. స్టాండర్డ్, ఈక్లచ్ వేరియంట్లలో విడుదల కానుంది. రెబెల్ 300 డిజైన్‌కే పెద్ద ఇంజిన్‌ను జోడించారు. ఇందులో 471 సిసి ట్విన్ సిలిండర్ లిక్విడ్ కూల్డ్ ఇంజిన్ ఉంటుంది. ఎక్కువ పవర్ కోరుకునే క్రూజర్ ప్రియులను లక్ష్యంగా రూపొందించారు. ఆఫ్‌రోడ్, రోజువారీ ప్రయాణాలకు సరిపోయే డ్యూయల్ పర్పస్ బైక్. 293.5 సిసి ఇంజిన్, లాంగ్ ట్రావెల్ సస్పెన్షన్‌తో వస్తుంది. తక్కువ బరువు, సులభమైన హ్యాండ్లింగ్ దీని ప్రత్యేకత. ఎక్స్‌ఆర్300 ర్యాలీ బైక్ అడ్వెంచర్ టూరింగ్ కోసం ప్రత్యేకంగా రూపొందించిన మోడల్. క్యూసీ3 ఎలక్ట్రిక్ స్కూటర్‌తో కుటుంబ అవసరాలకు అనువైన ఈవీ స్కూటర్. 151 కిలోమీటర్ల ఐడీసీ రేంజ్, 32 లీటర్ల స్టోరేజ్ సామర్థ్యంతో వస్తుంది. అదనంగా సీబీ350, సీబీ350సీ, సిబి 350ఆర్ఎస్ మోడళ్లను కొత్త రంగులతో అప్‌డేట్ చేసింది.

## డిసిబి బ్యాంక్ నికర లాభం 35.5 శాతం పెరుగుదల




**ముంబయి,జులై 24:** ప్రైవేట్ రంగంలోని డిసిబి బ్యాంక్ మెరుగైన ఆర్థిక ఫలితాలను నమోదు చేసింది. రుణ నష్టాల కోసం చేసిన కేటాయింపులు (ప్రొవిజన్లు) గణనీయంగా తగ్గడం, నిరర్థక ఆస్తుల (ఎన్‌పిఎలు) నాణ్యత మెరుగుపడటంతో బ్యాంక్ లాభదాయకత పెరిగింది. ఈ త్రైమాసికంలో బ్యాంక్ నికర లాభం రూ.213 కోట్లకు చేరింది. గత ఏడాది ఇదే కాలంలో నమోదైన రూ.157 కోట్లతో పోలిస్తే 35.5 శాతం వృద్ధి సాధించింది. బ్యాంక్‌కు ప్రధాన ఆదాయ వనరైన నికర వడ్డీ ఆదాయం కూడా 17.7 శాతం పెరిగి రూ.684 కోట్లకు చేరింది. గత యేడాది ఇదే త్రైమాసికంలో ఇది రూ.581 కోట్లుగా ఉంది.ఆస్తుల నాణ్యతలో కూడా మెరుగుదల కనిపించింది. స్థూల నిరర్థక ఆస్తుల (గ్రాస్ ఎన్‌పిఎ) నిష్పత్తి మార్చి చివరినాటి 2.45 శాతం నుంచి 2.43 శాతానికి తగ్గింది. అలాగే నికర ఎన్‌పిఎ నిష్పత్తి 0.89 శాతం నుంచి 0.84 శాతానికి తగ్గి బ్యాంక్ రుణాల నాణ్యత మెరుగుపడినట్లు వెల్లడించింది. రుణ నష్టాల కోసం చేసిన ప్రొవిజన్లు గత యేడాది రూ.115 కోట్ల నుంచి ఈసారి రూ.57 కోట్లకు తగ్గాయి. గత త్రైమాసికంలో నమోదైన రూ.69 కోట్లతో పోల్చినా ఇవి తగ్గడం బ్యాంక్ లాభాల పెరుగుదలకు తోడ్పడింది.వ్యాపార వృద్ధి కూడా బలంగా కొనసాగిందని బ్యాంక్ తెలిపింది. రుణాల పంపిణీ వార్షిక ప్రాతిపదికన 17 శాతం, డిపాజిట్లు 20 శాతం పెరిగాయి. బాసెల్3 ప్రమాణాల ప్రకారం మూలధన సమృద్ధి నిష్పత్తి 17.03 శాతంగా నమోదై, బ్యాంక్ ఆర్థిక స్థితి బలంగా ఉందని వెల్లడించింది. డిపిబి బ్యాంక్ మేనేజింగ్ డైరెక్టర్, సిఇఒ ప్రవీణ్ కుట్టి మాట్లాడుతూ, డిపాజిట్లు, రుణాల వృద్ధి బలంగా కొనసాగుతోందన్నారు.

లాభదాయకతకు సంబంధించిన దాదాపు అన్ని సూచీల్లో గణనీయమైన మెరుగుదల నమోదైందని, గత యేడాదితో పోలిస్తే పన్నుల అనంతర లాభం 36 శాతం పెరిగిందని తెలిపారు. అంతేకాకుండా, తక్కువ క్రెడిట్ ఖర్చులు, మెరుగైన రుణాల నాణ్యత కారణంగా బ్యాంక్ వరుసగా నాలుగో త్రైమాసికంలోనూ అత్యధిక త్రైమాసిక లాభాన్ని నమోదు చేసిందని, ఈక్విటీపై రాబడి కూడా మెరుగుపడిందని ఆయన వెల్లడించారు.

Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.

ఫ్యాషన్ ఫ్యాషన్

# చీర అందానికి బ్లౌజ్ ముఖ్యం



అమ్మాయిలు మళ్లీ సింపుల్‌గా తయారవుతున్నారు. సాదా నెక్, సింపుల్ స్లీవ్ డిజైన్లకు ఓటేస్తున్నారిలా. అమ్మలు, బామ్మల కాలంనాటి డిజైన్లలా తోస్తున్నాయి . ఏ డిజైన్ నెక్, చేతులెలా అంటూ తెగ ఆలోచిస్తుంటారు ఆడవాళ్లు. కొందరు అమ్మాయిలు భారీ భారీ వర్కులు చేయిస్తుంటారు. రూ.వేలల్లో వెచ్చించేవారికీ కొదవలేదు. ఒకరిని చేసి మరొకరు అనుసరించేస్తున్నారు. బుట్ట చేతులు చిన్న మెలిక, జోడించిన పూసలు.. చిన్నచిన్నవే అయితేనేం ఆకట్టుకుంటున్నాయి అనేదివాస్తం. డిజైన్లకు ఓటేస్తున్నారు. ఎంత ఖరీదువైనా, పట్టు చీరలైనా ఇదే మంత్రం పాటిస్తున్నారు. కొందరు సింపుల్‌గా సిద్ధమై.. భలే బాగున్నారు అనిపించుకుంటున్నారు.









# తొలి ఏకాదశి పూజ

భారతీయ సంప్రదాయంలో పండుగలకు ఉండే ప్రాధాన్యత అంతా ఇంతకాదు. ప్రతి పండుగకు ప్రత్యేకమైన విశిష్టత ఉంది. ఊరు వాడం దరూ ఒకటిగా చేరి వసుధైక కుటుంబంలోని వ్యక్తులులాగా ఎంతో సంబరంగా జరుపుకుంటాం. వాతావరణంలో కలిగే మార్పులను ఆస్వాదిస్తూ, దైవాన్ని ఆరాధిస్తూ పండుగలను ఆహ్వానిస్తాం. ఆ రోజులను పర్వదినాలుగా ఎంతో వైభవంగా జరుపుకుంటాం. చైత్రమాసం వసంతాన్ని ఆహ్వానిస్తే, ఆషాడం తొలకరి చినుకుల తో పాటు తొలిఏకాదశి పండుగని కూడా తన వెంట తీసుకువచ్చి తెలుగు లోగిళ్లలో సరికొత్త అందాలని విరబూయిస్తుంది. ఈ రోజు పలకరింపులకు పుడమి తల్లి పులకరించి పోయే రోజు. ఇది ముఖ్యంగా రైతన్నల పండుగ. పలుగు, పారా, నాగలి పట్టి అన్నదాత ఏరువాక సాగే రోజు. ఈ పనిముట్లకు పూజలు చేస్తారు. అతివృష్టి, అనావృష్టి లాంటి ప్రకృతి వైపరీత్యాలు చోటు చేసుకోకూడదని, పైరుకు ఎలాంటి చీడపీడలు తెగులు సోకకూడదని, ఏ మంచి పని ప్రారంభించిన ఈ తొలి ఏకాదశి కోసం ఎదురుచూడడం మన తెలుగువారి సంప్రదాయం. తెలుగు పండుగలకు ఆహ్వానం పలికే రోజు ఆషాడ శుద్ధ ఏకాదశి రోజు ఈ పండుగను జరుపుకుంటారు. ఆషాడం లోనే తొలకరి వస్తుంది కాబట్టి ఈ ఏకాదశి తొలి ఏకాదశి అని పేరు వచ్చింది. ఇంకా దీనినే విష్ణుశయిన ఏకాదశి అని, చైత్ర ఏకాదశి అని హరివాసరం అని పేలాల పండుగ అని కూడా పిలు స్తారు. తిథులలో ఏకాదశి తిధి చాలా మంచిది అందునా తొలి ఏకాదశి మరింత పవిత్రమైనది, అందుకే ఈ రోజున గొప్ప పర్వదినంలా జరుపుకుంటారు. అలాగే ప్రతి నెలలోనూ కృష్ణపక్షంలో ఒకటి శుక్లపక్షంలో మరొకటి ఇలా రెండు ఏకాదశులు వస్తాయి. సంవత్సరం మొత్తం మీద 24 ఏకాదశులు ఉన్నాయి. 24 ఏకాదశులకు ఏదో ఒక ప్రాధాన్యత ఉంది. ఈ పండుగకు ఎందుకు ప్రత్యేకత ఉంది అంటే ఏకాదశి అంటేనే 11 అని అర్థం. మనకి ఉన్నటు వంటి ఐదు జ్ఞానేంద్రి యాలు ఐదు కర్మేంద్రియాలు వీటిని పని చేసేటు వంటి అంతరేంద్రియమైనటువంటి మనసు మొత్తం కలిపితే 11. ఈ 11 ఏకోన్ముఖంగా పనిచేసేటు వంటి సమయం ఏకాదశి. ఈ రోజు సూర్యుడు, చంద్రుడు భూమి లంబకోణంలో ఉంటారు. ఈ రోజు చేసేటువంటి సాధన ఏదైనా చక్కని ఫలితాన్ని ఇస్తుంది. 24 ఏకాదశులలో ఏదో ఒక రకంగా సాధన చేస్తే మనం పురోభివృద్ధి చెందడానికి సానుకూలంగా ఉంటాయి. పురాణాల ప్రకారం శ్రీ మహావిష్ణువు క్షీరసాగరంలో శేషతల్పముపై నాలుగు తలల పాటు శయనిస్తారు. తిరిగి మళ్లీ కార్తీకమాసంలో వచ్చే పౌర్ణమి రోజున మేటుకొంటారు. ఈ నాలుగు నెలలు కూడా దాతుర్మాసాలుగా వ్యవహరింస్తారు. ఈ నాలుగు నెలలు



స్వామి వారు పాతాళాలోకంలో బలి చక్రవర్తి వద్ద ఉండి తిరిగి వస్తారు. ఆషాడమాసం శుక్లపక్షం ఏకాదశి నాడు విష్ణుమూర్తి పాల కడలిపై యోగ నిద్రలోకి వెళ్లే సందర్భాన్ని తొలి ఏకాదశిగా చెప్పవచ్చు. స్వామి నిద్రించే రోజు కాబట్టి దీనిని శయన ఏకాదశి అని కూడా అంటారు. సతీసక్కుబాయి ఈ శయన ఏకాదశి నాడే మోక్ష ప్రాప్తి పొందింది. తొలి ఏకాదశికి సంబంధించినటు వంటి పురాణా కాలానికి సంబంధించి మరో కథ కూడా ఉంది. కృత యుగంలో మురాసురుడు అనే రాక్షసుడు బ్రహ్మ వరంతో దేవతలను రాక్షసు లను, ఋషులను చిత్రహింసలకు గురి చేసేవాడు. ఆ రాక్షసుడితో శ్రీ మహావిష్ణువు వెయ్యేళ్ల పోరాడి, పోరాడి అలసిపోయి ఓ గుహలో విశ్రాంతి తీసుకుంటుండగా శ్రీహరి శరీరం నుండి ఓ కన్య ఆవిర్భవించి ఆ రాక్షసుడిని అంతం చేసిందని పురాణాలు చెబుతున్నాయి. ఇందుకు సంతోషించిన శ్రీమహావిష్ణువు ఆ కన్యను వరం కోరుకోమనగా తాను విష్ణుప్రియగా లోకం చేత పూజలు అందుకునే విధంగా వరం అడిగింది. ఆనాటి నుండి ఆ కన్య ఏకాదశి తిథిగా ప్రచుర్యం పొందింది. అప్పటి నుండి సాధువులు, భక్తులు కూడా ఏకాదశి వ్రతం ఆచరించి విష్ణు సాన్నిధ్యాన్ని పొందారు. ఈ రోజు ఉపవాసం ఉండాలనుకునే వారు దశమిరోజు రాత్రి అల్పాహారం తీసుకోవాలి. ఇలా చేస్తే మన జీర్ణ వ్యవస్థ ఏకాదశి ఉపవాసానికి సిద్ధం చేయమే ఏకాదశి రోజు సూర్యోదయానికి ముందే నిద్ర లేచి ఇల్లు, వాకిళ్ల శుభ్రం చేసుకుని తల స్నానం చేయాలి. ఆ రోజంతా నిష్టగా ఉపవాసం ఉండటమే కాకుండా విష్ణు మూర్తిని ఆరాధించాలి. తులసి దళాలలతో స్వామిని పూజించి విష్ణు సహస్రనామం, నారాయణ కవచం వంటి స్తోత్రాలతో ఆరాధించాలి. ఉపవాసం ఉంటే మనసు నిశ్చలంగా మారిపోతుంది. ఇలా స్థిరంగా ఉన్న మనసుని మరింత జాగృతం చేసేందుకు ఈ రోజు రాత్రి జాగారం చేస్తే మంచిది. భగవన్నా మస్మరణలో ఈ ఉపవాస జాగారణ పూర్తయ్యాక మరుసటి రోజు ఉదయాన్నే తలస్నానం చేసి దగ్గర్లోని విష్ణువు ఆలయాన్ని కానీ వెకంటటేశ్వర స్వామి ఆలయాన్ని కానీ దర్శించుకోవాలి. ఆ తర్వాత పిండి వంటలతో షడ్రసోపేత భోజనం తయారు చేయాలి. పూజా మందిరం ముందు పసుపుగుడ్డ పరచి కూర్చోవాలి. స్వామివారి పటానికి పూలు, పసుపు, కుంకుమ, గంధంతో అలంకరించి పూజించాలి. మొదట పసుపు గణపతిని పూజించాలి. తులసి దళాలతో పూజ చేయాలి. ఆపై దూప, దీపం నైవేద్యాలు స్వామికి సమర్పించాలి. నైవేద్యంతోపాటు బెల్లం కలిపిన పేలాల పిండిని స్వామివారికి సమర్పించాలి. పేలాల పిండితో ఎన్నో ఆరోగ్య సూత్రాలు దాగి ఉన్నాయి. తింటే ఎంతో మంచిది. విష్ణు సహస్రనామం, అష్టోత్తర శతనామాలు చదువుతూ పూజ చేయాలి. నివేదన అనతరం భోజనం చేస్తే ఉపవాస దీక్ష పూర్తయి చక్కని సత్ఫలితాలు చేకూరతాయి.

**- పింగళి భాగ్యలక్ష్మి**

# వెజ్ రోల్స్



**కావలసిన పదార్థాలు :**
మైదా: అరకప్పు, కార్న్‌ఫ్లోర్: రెండు టేబుల్ స్పూన్లు, టమాట, క్యారెట్, ఆలుగడ్డ, క్యాప్సికమ్ ముక్కలు: రెండు టేబుల్ స్పూన్ల చొప్పున, పచ్చిమిర్చి: నాలుగు, ఉల్లిగడ్డ: ఒకటి, నూనె: పావు కప్పు, ఉప్పు: తగినంత, కారం: ఒక టీస్పూన్, అల్లం వెల్లుల్లి పేస్ట్: అర టీస్పూన్, గరం మసాలా: పావు టీస్పూన్, కొత్తిమీర తురుము: కొద్దిగా.

**తయారీ విధానం:** పాన్‌లోని నూనె వేడయ్యాక సన్నగా తరిగిన పచ్చిమిర్చి, ఉల్లిగడ్డ వేయాలి. అవన్నీ వేగాక క్యారెట్, ఆలు, క్యాప్సికమ్, టమాట ముక్కలు వేసి బాగా వేయించాలి. కారం, అల్లం వెల్లుల్లి పేస్ట్, ఉప్పు, గరం మసాలా, కొత్తిమీర తురుము జోడించి మరో మూడు నిమిషాలు వేయించి దించి చల్లార్చుకోవాలి. ఒక గిన్నెలో మైదా, కార్న్‌ఫ్లోర్, ఉప్పు, ఒక టేబుల్ స్పూన్ నూనె వేసి బాగా కలిపి, తగినన్ని నీళ్లు పోసుకుని ముద్దలా చేసుకుని పావు గంటపాటు నాన బెట్టాలి. పిండిని కొద్దికొద్దిగా తీసుకుని పలుచని చపాతీల్లా చేసుకోవాలి. స్టవ్ మీద పెనం పెట్టి చపాతీలను పది సెకన్లపాటు రెండు వైపులా కాల్చి తీసేయాలి. ఇప్పుడు ఒక్కో చపాతీ మధ్యలో కూరగాయల మిశ్రమం పెట్టి అన్నివైపులా మూసి రోల్స్‌లా చుట్టుకుని చివర్లను మైదా నీళ్లతో అంటించాలి. స్టవ్‌మీద కడాయి పెట్టి వేయించడానికి సరిపడా నూనె పోసి వేడయ్యాక చుట్టి ఉంచిన రోల్స్ వేసి దోరగా కాల్చుకుంటే కరకరలాడే వెజ్ రోల్స్ రెడీ. □

# యాక్టివ్ 'టీ'

. క్రీ.పూ. 59వ శతాబ్దంలోనే టీ గురించిన ప్రస్తావన ఉంది. పురాణాల ప్రకారం 2732 బిసిలో చక్రవర్తి షెన్‌నంగ్ ఒక అడవి చెట్టు నుండి ఆకులు తనవేడి నీటి కుండలోకి పడినప్పుడు వాటి రంగు, రుచి, వాసనలో తేడా రావడమే గాకుండా, వాటిని త్రాగినపుడు శారీరక, మానసిక ఉత్తేజన్ని కల్గిస్తుందని తెలుసుకున్నాడు.



దేశంలో అత్యధికులు తాగే పానీయం తేనీరు' 63% మంది ప్రజలు టీ త్రాగుతారు. దీనికి చారిత్రక నేపథ్యం ప్రత్యేక సంస్కృతి ఉందిఇండియాలో పశ్చిమబెంగాల్, అస్సాం, కేరళ, తమిళనాడు, హిమచలప్రదేశ్ అరుణాచలప్రదేశ్, కర్ణాటక ప్రాంతాల్లో విరివిగా పండిస్తారు. టీ ఆకుల్ని చదివే కళని టాస్సోగ్రఫీ అంటారు. 4వ శతాబ్దంలో ఒక చైనా వైద్యుడు మెదట టీ డికాక్షన్ తయారు చేస్తే 15వ శతాబ్దంలో దీనికి పాలు, చక్కెర కలిపి నాగరిక ప్రపంచంలోటీ త్రాగడం, ఫ్యాషన్‌గా అలవాటుగా మారింది. దేశాన్ని, ప్రాంతాన్ని బట్టి టీలోని ఇతర రకాలు. ఇవి చాలా పాపులర్ చెందినవి. తేయాకుని నీటిలో మరిగించి వచ్చిన ద్రావకాన్ని 'తేనీరు' అంటారు.

**ఆరోగ్య ప్రయోజనాలు :** దీనిలో 21% ఫ్లోరైడ్ తక్కువగా ఉండడం వల్ల దంతాలు, ఎముకలు ధృఢపడేందుకు సహాయపడుతుంది. దీని వల్ల దంతక్షయం, ఎనామిల్ (పంటిపైపొర) దెబ్బతినదు. టీలోని ఫేవనాయిడ్స్ గుండె ఆరోగ్యవంతంగా పనిచేయడానికి పనికొస్తాయి. రక్తం గడ్డకట్టకుండా కాపాడుతుంది. ఎల్ థయానైన్ ఒత్తిడిని తగ్గించి మెదడును ప్రశాంతంగా ఉంచుతుంది. ఆంటీ ఆక్సిడెంట్స్ కేన్సర్ రాకుండా చేస్తుంది. లివర్, రొమ్ము, ప్రొస్టేట్ కొలోరెక్టల్ కేన్సర్ రాకుండా కాపాడుతుంది. కేన్సర్ కారకాల్ని తగ్గిస్తుంది కణాలకి హాని కల్గించే ఫ్రీరాడికల్స్‌ని తగ్గిస్తుంది. పాడైన జీవకణాల్ని ఉత్తేజపరుస్తుంది. జీర్ణాశయ, లివర్ వ్యవస్థల పనితీరు మెరుగుపరు స్తుంది. ట్యూమర్స్ కల్గించే ఎంజైమ్స్‌ని తటస్థపరు స్తుంది. ఆంటి ఇన్‌ఫ్లమేటరీగా శ్వాస మార్గాల్ని శుభ్రపరు స్తుంది. షుగర్ వ్యాధిగ్రస్తుల్లో గ్లైసిమిక్ రెస్పాన్స్‌ని నియంత్రిస్తుంది డయాబెటిక్ రిస్కుని తగ్గిస్తుంది. బ్యాడ్ కలెస్ట్రాల్‌ని తగ్గించి కారిడయో వాస్కు లార్ హెల్త్‌ని ఇంప్రూవ్ చేస్తుంది. స్ట్రోక్, గుండె జబ్బులు తగ్గుతాయి. ఫ్లూ జ్వరాలు, వైరల్ ఫీవర్స్ త్వరగా రావు. డిప్రెషన్, అలసట రానీయదు. ఒత్తిడి, ఆందోళన తగ్గిస్తుంది. కొలెస్ట్రాల్. బ్లడ్ ప్రెషర్‌ని తగ్గిస్తుంది. బాడీపెయిన్స్‌ని తగ్గిస్తుంది. మలబద్ధకం, అజీర్తి అపానవాయువుల్ని, ఇరిటబుల్ బవల్‌సింద్రోమ్‌ని తగ్గిస్తుంది గట్‌హెల్త్‌ని కాపాడుతుంది. తలనొప్పి, మైగ్రేన్, పార్కిన్‌సన్, ఆల్జీమర్స్ డిసీజ్‌ని తగ్గిస్తుంది. బాక్టీరియా, వైరస్‌ల నుంచి కాపాడి రక్షణ వ్యవస్థని పటిష్టపరిచి రోగనిరోధక శక్తిని పెంపొందిస్తుంది. నీటిద్వారా వచ్చే ఇన్ఫెక్షన్స్‌ని తగ్గిస్తుంది. జలుబు, దగ్గుల్ని తగ్గిస్తుంది. బహిష్టు సమయంలో వచ్చే కడుపునొప్పి, నడుంనొప్పిని తగ్గిస్తుంది. ప్లేగువ్యాధి, ఎలర్జీలు తగ్గి రక్త ప్రసరణని ఇంప్రూన్ చేస్తుంది. చర్మ, కేశ సౌందర్యానికి మంచిది. చర్మం ముడతలు పడకుండా అకా వ్యార్థక్యాన్ని తగ్గిస్తుంది. కెఫిన్‌క్రాష్‌ని తగ్గిస్తుంది. ఎందుకంటే ఆంటి ఆక్సిడెంట్స్ కెఫిన్ శోషణని నెమ్మదించేలా చేస్తాయి. □



డాక్టర్ కె.ఉమాదేవి
తిరుపతి

# 'కర్మాఖ్య' ట్రైలర్ అద్భుతంగా ఉంది : లేడీ సూపర్ స్టార్ విజయశాంతి

సమైరా, సముద్రఖని, అభిరామి ప్రధాన పాత్రల్లో అభినయ కృష్ణ దర్శకత్వంలో రూపొందుతున్న థ్రిల్లింగ్ 'కర్మాఖ్య'. మై ఫిల్మ్ ప్రొడక్షన్స్ PVT LTD బ్యానర్ పై వడ్డేపల్లి శ్రీ వాణీనాథ్, యశ్వంత్ రాజ్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన ఫస్ట్ లుక్, టీజర్, సాంగ్స్‌కు అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది. జూలై 31న ఈ చిత్రం గ్రాండ్‌గా రిలీజ్ కానుంది. ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌లో లేడీ సూపర్ స్టార్ విజయశాంతి మాట్లాడుతూ... ఈ సినిమా టైటిల్ నాకు చాలా నచ్చింది. మొదట ఖికామాఖ్యఖి అనే టైటిల్ చెప్పినప్పుడు చాలా పవర్‌ఫుల్‌గా అనిపించింది. కామాఖ్య అమ్మవారు పవర్ ఫుల్. ఖచ్చితంగా విజయం సాధిస్తుందని అనుకున్నాను. మధు యాష్కీ మాట్లాడుతూ... లేడీ సూపర్ స్టార్ విజయశాంతిఈ కార్యక్రమానికి వచ్చి బ్లెస్సింగ్స్ అందించడం నిజంగా ఈ టీమ్ మొత్తానికి గొప్ప ప్రోత్సాహం. ఈ సినిమా చాలా ఇంట్రెస్టింగ్‌గా కనిపిస్తోంది. నేను సినిమాలను తరచుగా చూస్తుంటాను. నాకు సినిమా మంచి కాలక్షేపం. మంచి సినిమా వస్తే తప్పకుండా చూడాలని పిస్తుంది. 'కర్మాఖ్య' ట్రైలర్ చాలా ఇంట్రెస్టింగ్‌గా ఉంది. దర్శకుడు అభినయ కృష్ణకు, టీమ్ మొత్తానికి ఆల్ ది వెరీ బెస్ట్. దర్శకుడు అభినయ కృష్ణ మాట్లాడుతూ... మా లేడీ సూపర్ స్టార్ విజయశాంతికి ధన్యవాదాలు. 'కర్తవ్యం' సినిమా ఎన్నిసార్లు చూశానో లెక్కలేదు. ఆమె చిత్రాలు నాకు ఎంతగానో స్ఫూర్తినిచ్చాయి. అలాగే మధు యాష్కీ గారికి కూడా ధన్యవాదాలు. మీ అందరికీ ట్రైలర్ నచ్చడం చాలా ఆనందంగా ఉంది.సమైరా మాట్లాడుతూ... విజయశాంతి మేడమ్‌కి థ్యాంక్యూ. వారు మా సినిమా కార్యక్రమానికి వచ్చి మమ్మల్ని బ్లెస్ చేయడం చాలా ఆనందంగా ఉంది. ఇది నా తొలి సినిమా. నా తొలి ట్రైలర్ లాంచ్ కూడా. అందుకే ఇది నాకు చాలా స్పెషల్ మూమెంట్. నటి కావాలనేది నా కల. అది ఈ సినిమాతో నెరవేరినందుకు చాలా ఆనందంగా ఉంది.



# 'అబ్జెక్షన్ మై లార్డ్' ట్రైలర్ విడుదల



వినూత్నమైన కంటెంట్‌తో అన్నీ వర్గాల ప్రేక్షకులను మెప్పిస్తూ అందరి హృదయాల్లో తనదైన స్థానాన్ని దక్కించుకున్న మోస్ట్ పాపులర్ ఒటీటీ ఫ్లాట్‌ఫామ్ జీ5 నుంచి మరో ఒరిజినల్ ప్రేక్షకుల ముందుకు రానుంది. అదే అబ్జెక్షన్ మై లార్డ్. శ్రీకాంత్, అనన్యశర్మ, ముఖేష్ రుషి, స్నేహాల్, సమీర్ ప్రధాన పాత్రధారు లుగా నటించారు. 'నోటరీ పరశురాం' ట్యాగ్ లైన్. ఈ సిరీస్ ట్రైలర్‌ను మెగాస్టార్ చిరంజీవి విడుదల చేశారు.సంతోష్ అయ్యప్పన్ దర్శకత్వంలో డ్రీమ్ హౌస్ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై రాజ్‌కుమార్ ఆకెళ్ల ఈ సిరీస్‌ను రూపొందించారు. 7 ఎపిసోడ్స్‌తో ఎమోషనల్ కోర్ట్ రూమ్ డ్రామాగా రూపొందిన ఈ ఒరిజినల్ జూలై 31 నుంచి జీ5లో స్ట్రీమింగ్ కానుంది. కోర్ట్ డ్రామాగా రూపొందిన ఈ సిరీస్ ట్రైలర్‌ను గమనిస్తే..ఓ లేడీ వాయిస్‌తో ట్రైలర్ మొదలవుతుంది.. ఆయన ప్రాబ్లెమ్ ఏంటి సర్? అని యంగ్ లేడీ లాయర్ అనన్య శ్రీకాంత్ గురించి మరో లాయర్‌ను అడుగుతుంది. దానికి ఆయన ప్రాబ్లమ్ కేసు గురించి కాదు..ప్లేస్ గురించి.. ఆయన ప్రాణం పోయినా ఏ బ్లాక్ వైపు వెళ్లద్దు అని సమాధాన మిస్తాడు. మరో లాయర్ మాట్లాడుతాడు. నా 20 ఏళ్ల సర్వీసులో ఆ నోటరీని ఈ కోర్టులో ఎప్పుడూ చూడలేద్దు అంటాడు. ఈ క్రమంలోనే లాయర్ వేషధారణలోని శ్రీకాంత్ పాత్రకు సంబంధించిన కొన్ని సీన్స్‌ను చూపిస్తారు. తర్వాత సీన్‌లో కనిపించకుండా పోయిన కూతురు సమీర కోసం కోర్ట్ ప్రాంగణంలో నారాయణ అనే వ్యక్తి ఆత్మాహుతి చేసుకుం టాడు. దాంతో కోర్టులోని వారందరూ షాక వుతారు. నిజానికి నారాయ ణది సూసైడే కాదు మర్డర్ అంటుంటారు అనే విషయాలు తెలుసు కోవాలంటే.. అబ్జెక్షన్ మై లార్డ్ ఒరిజినల్ చూడా ల్సిందే నంటున్నారు మేకర్స్. ట్రైలర్‌తో సిరీస్‌పై అంచనాలు పెరిగాయి.

# తెర

## VenkyAnil5 ( NkrAR2)తొలి షెడ్యూల్ పూర్తి



విక్టరీ వెంకటేష్, నందమూరి కల్యాణ్ రామ్, బ్లాక్‌బస్టర్ దర్శకుడు అనిల్ రావిపూడి ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్న VenkyAnil5 ( NkrAR2) చిత్రం కోసం జతకట్టారు. 'షైన్ స్క్రీన్స్' బ్యానర్‌పై సాహు గారపాటి భారీ స్థాయిలో నిర్మిస్తున్న ఈ ప్రతిష్టాత్మక చిత్రాన్ని సురేష్ ప్రొడక్షన్స్, శ్రీమతి అర్చన, జీ స్టూడియోస్ సమర్పిస్తున్నాయి. ఈ సినిమా తొలి షెడ్యూల్ విజయవంతంగా పూర్తైంది. ఈ షెడ్యూల్ కోసం హైదరాబాద్‌లో ప్రత్యేకంగా సెట్‌లో నిర్మించారు. వెంకటేష్, నందమూరి కల్యాణ్ రామ్, కీర్తి సురేష్ కృతి శెట్టి షూటింగ్‌లో పాల్గొన్నారు.ఈ షెడ్యూల్‌లో కీలకమైన టాకీ పార్ట్‌తో పాటు ఓ అద్భుతమైన పాటను చిత్రీకరించారు. చాలా ముఖ్యమైన సన్నివేశాలను తెరకెక్కించారు. ఈ ఎపిసోడ్స్ సినిమాలో హైలైట్‌గా నిలవను న్నాయి. ఇప్పటికే విడుదల చేసిన కళ్యాణ్ రామ్ పోస్టర్ కి అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది. అలాగే అనిల్ రావిపూడి తనదైన క్రియేటివ్ ప్రమోషన్స్ ఇప్పటికే అంచనాలు పెంచారు. ఈ చిత్రంలో వెంకటేష్ సరసన కీర్తి సురేష్ కథానాయికగా నటిస్తుండగా, కల్యాణ్ రామ్ సరసన కృతి శెట్టి నటిస్తోంది.ఈ చిత్రానికి బలమైన సాంకేతిక బృందం పని చేస్తున్నారు. జి.వి. ప్రకాష్ కుమార్ సంగీతం సమకూరుస్తుండగా, సమీర్ రెడ్డి సినిమాటోగ్రఫీ, తమ్మిరాజు ఎడిటింగ్, ఎ.ఎస్. ప్రకాష్ ప్రొడక్షన్ డిజైనర్‌గా వ్యవహరిస్తున్నారు. ఎస్. కృష్ణ ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్.

# ఆగస్ట్ 1న 'రక్త చరిత్ర 2' రీ రిలీజ్



హీరో సూర్య బర్త్ డే సందర్భంగా రిలీజ్ అయిన ట్రైలర్ .మాఫియా, హారర్, సస్పెన్స్ చిత్రాలను తీయడంతో పాటు యథార్థ ఘటనల నేపథ్య చిత్రాలను తెరకెక్కించడంలో రామ్ గోపాల్ వర్మది ఓ ప్రత్యేక శైలి. ఒకప్పుడు రాయలసీమ ఫ్యాక్షనిజంలో బద్ధ శత్రువులైన రెండు వేర్వేరు గ్రూపులకు చెందిన పరిటాల రవి, మద్దెల చెరువు సూరిలకు సంబం ధించిన యథార్థ ఘటనల ఆధారంగా రామ్ గోపాల్ వర్మ గతంలో 'రక్త చరిత్ర' చిత్రాన్ని రెండు పార్ట్ లుగా తెరకెక్కించిన విషయం తెలిసిందే. అప్పట్లో ఎలాంటి ఒత్తిడులు, భయాలకు లొంగకుండా రామ్ గోపాల్ వర్మ తెరకెక్కించిన ఈ రెండు చిత్రాలు సంచలనం సృష్టించాయి. నటీ నటులు తమ, తమ పాత్రలలో ఒదిగిపోయిన విధానం, రామ్ గోపాల్ వర్మ టేకింగ్ , అప్పట్లో ఆయన ఉపయోగించిన లేటెస్ట్ టెక్నాలజీ ఈ చిత్రాలకు ఆయువు పట్టుగా నిలిచాయి. ఈ రెండు పార్ట్ చిత్రాలు ఒకే ఏడాది అనగా 2010లో వరుసగా విడుదలైన విషయం గుర్తుండే ఉంటుంది. దాదాపు 16 ఏళ్ల తర్వాత రక్త చరిత్ర పార్ట్1 చిత్రాన్ని ఇటీవలే రీ రిలీజ్ చేయగా...హౌస్ ఫుల్ కలెక్షన్స్‌తో మంచి స్పందన రావడంతో ఇప్పుడు రక్త చరిత్ర పార్ట్2 చిత్రాన్ని ఆగస్ట్ 1న థియేటర్స్‌లో రీ రిలీజ్ చేయబోతున్నారు. వివేక్ ఒబెరాయ్, సూర్య, రాధికా ఆప్టే, ప్రియమణి ప్రధాన పాత్రధారులుగా నటించిన ఈ చిత్రంలో రక్తసిక్త వర్ణమైన తరతరాల రక్తచరిత్ర అంటూ సాగే నేపథ్య గీతంతో పాటు కత్తులతో సావాసం నెత్తుటితో సమాప్తం అనే మరో పాటతో కలుపుకుని కథానుసారం సందర్భానుసారమైన రెండు పాటలు ఉన్నాయి. ఈ చిత్రాన్ని రీ రిలీజ్ చేయమని చాలా రోజులుగా ప్రేక్షకులు కోరుతుండటంతో పాటు నేటితరం యూత్ కు కూడా వాస్తవిక కథతో తెరకెక్కిన ఈ చిత్రాన్ని చూపించాలనే ఉద్దేశ్యంతో రామ్ గోపాల్ వర్మ రీ రిలీజ్ చేయాలని నిర్ణయించారు.

# '35 చిన్న కథ కాదు'కు ఉత్తమ బాలల చిత్రంగా జాతీయ అవార్డు రావడం సంతోషం:



నందకిశోర్ 2024 సంవత్సరానికి గాను '35 చిన్న కథ కాదు' చిత్రం ఉత్తమ బాలల చిత్రం విభాగంలో జాతీయ పురస్కారానికి ఎంపికైంది. అలాగే ఈ చిత్రంలో నటించిన అరుణ్‌దేవ్ పోతుల ఉత్తమ బాలనటుడు విభాగంలో జాతీయ అవార్డు సొంతం చేసుకున్నారు. 2024లో విడుదలైన '35 చిన్న కథ కాదు' చిత్రంలో నివేదా థామస్, ప్రియదర్శి, విశ్వ దేవ్ ప్రధాన పాత్రలు పోషించారు. నందకిశోర్ ఈమాని దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని సృజన యర్రబోలు, సిద్ధార్థ్ రాళ్లపల్లి నిర్మిం చారు. దర్శకుడు నందకిశోర్ మాట్లా డుతూ... 2018లో 35 చిన్న కథ కాదు ఒక ఆలోచనతో మొదలైంది. 2026కి ఇక్కడివరకు వచ్చింది. అప్పటి నుంచి ఇప్పటివరకు పడిన కష్టం, దాన్ని దాటుకుని వచ్చిన అనుభవం... కాలం గడిచే కొద్దీ మధుర జ్ఞాపకంగా మారు తుంది. ఇక్కడివరకు చేరుకోవడం చాలా ఆనందంగా ఉంది. హీరో విశ్వదేవ్ మాట్లా డుతూ... సురేష్ బాబుకి, స్పిరిట్ మీడియాకు, ప్రతి ఒక్కరికీ పేరుపేరునా ధన్యవాదాలు. రెండు సంవత్సరాల తర్వాత కూడా ఈ సినిమా గురించి ఇంతగా మాట్లాడు కుంటున్నారు అంటే, 35 చిన్న కథ కాదు చేసిన మ్యాజిక్ అది. నందకిశోర్ ఆలోచనతో మొదలైన ఈ ప్రయాణం ఈరోజు ఢిల్లీ వరకు వెళ్లింది. దర్శకుడు సజీవ్ మాట్లాడుతూ... మా సినిమా టీమ్ అందరికీ ఇది చాలా ప్రౌడ్ మూమెంట్.చైల్డ్ ఆర్టిస్ట్ అరుణ్ దేవ్ మాటాడుతూ... ఈరోజు చాలా ఆనందంగా ఉంది. నా తొలి సినిమాలోనే మోస్ట్ సీనియర్ భాగ్యరాజ్, గౌతమి మేడంతో కలిసి నటించడం చాలా హ్యాపీగా అనిపించింది. జాతీయ అవార్డు రావడం మరింత ఆనందంగా ఉంది. అందరికీ థ్యాంక్యూ సో మచ్.

# 'శ్రీ విష్ణు Xశ్రీరామ్ అబ్బరాజు2' లో సాక్షి మడోల్కర్



హిలేరియస్ బ్లాక్‌బస్టర్ సామజవరగ మనను అందించిన తర్వాత కింగ్ ఆఫ్ ఎంటర్‌టైన్‌మెంట్ శ్రీ విష్ణు, దర్శకుడు రామ్ అబ్బరాజు మరోసారి జతకట్టారు. ప్రతిష్టాత్మక పాన్‌ఇండియా నిర్మాణ సంస్థ మైత్రి మూవీ మేకర్స్ ఈ చిత్రాన్ని నిర్మిస్తోంది. ఈ చిత్రం షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. తాజాగా మేకర్స్ ఎక్సయిటింగ్ అప్డేట్‌ను షేర్ చేశారు. ఈ చిత్రంలో సాక్షి మడోల్కర్ హీరోయిన్‌గా నటిస్తున్నారు. ఆమెకు టీమ్‌లోకి వెల్‌కమ్ చెబుతూ విడుదల చేసిన వీడియోలో షూటింగ్ స్పాట్‌లోని ఫన్ వైబ్‌ను చూపించారు. టీమ్ మొత్తం సరదాగా గడిపిన మూమెంట్స్‌తో ఈ వీడియో ప్రేక్షకులను ఆకట్టుకుంటోంది. 'శ్రీ విష్ణు Xరామ్ అబ్బరాజు 2 కంప్లీట్ డిఫరెంట్ స్టయిల్ లో కొత్త కథాంశంతో కూడిన ఫ్రెష్ స్క్రిప్ట్. కాన్సెప్ట్, హైవోల్టేజ్ హ్యూమర్ ఎక్కువగా వుండే కథనంతో, ఈ చిత్రం నాన్‌స్టాప్ వినోదాన్ని అందించబోతోంది.నవీన్ యెర్నేని, వై రవిశంకర్ నిర్మిస్తున్న ఈ చిత్రంలో బలమైన తారాగణం, టాప్ టెక్నికల్ టీం పని చేస్తోంది.సామజవరగమనకి పని చేసిన రైటర్స్ భాను భోగవరపు, నందు సావిరిగణ మరోసారి స్క్రిప్ట్ రాయడానికి చేతులు కలిపారు. వారి కొలాబరేషన్ మరో మెమరబుల్ మూవీని అందించబోతోంది. త్వరలో మేకర్స్ మిగతా వివరాలు తెలియజేస్తారు.

25-7Pg8exHMNWJQE:25-7Pg8exHMNWJQE.qxd 7/24/2026 11:57 PM Page 1



# నెల రోజుల్లోగా 2 యూనిఫామ్‌ల చొప్పన ప్రతి విద్యార్థికి అందజేయాలి



శుక్రవారం సచివాలయం నుండి జిల్లా కలెక్టర్లు, సంబంధిత అధికారులతో ప్రభుత్వ ప్రధానకార్యదర్శి సంజయ్‌జాజు వీడియో కాన్ఫరెన్స్ నిర్వహిస్తున్న దృశ్యం

## మేజర్ రిజర్వాయర్లలోని నీటిని తాగునీటి కోసం నిల్వ చేయాల్సిందే

## రైతులు వరి మినహా ఇతర ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి సారించాలి

## స్కూల్ యూనిఫామ్‌లు, ఎల్‌నినో ప్రభావంపై సిఎస్ వీడియో కాన్ఫరెన్స్


**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్,జులై24:** ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు రాష్ట్రంలోని ప్రభుత్వ స్కూళ్ళు,రెసిడెన్షియల్ పాఠశాలలోని ప్రతి విద్యార్థికి రెండు యూనిఫార్మ్‌ల చొప్పున నెలరోజుల్లోగా యూని ఫారంలను అందజేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు జిల్లా కలెక్టర్లను అధికారులను ఆదేశించారు. స్కూల్ యూనిఫార్మ్‌ల తయారీ, పంపిణీ, ఎల్‌నినో నేపథ్యంలో చేపట్టిన ప్రత్యామ్నాయ ప్రణాళికపై శుక్రవారం రాష్ట్ర సచివాలయం నుండి సిఎస్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా కలెక్టర్లు, సంబంధిత అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. యూనిఫామ్‌లను కుట్టించడానికి 26 వేలమంది స్వయం సహాయక బృందాల మహిళలను గుర్తించామని అధికారులు తెలిపారు. స్కూల్ యూనిఫామ్‌ల నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ పడొద్దని, విద్యార్థులకు అందిన స్కూల్ డ్రెస్‌లు, షూస్ తదితర స్కూల్ కిట్స్‌ల నాణ్యతపై నేరుగా పాఠశాల విద్యార్థుల నుండే ఫీడ్ బ్యాక్ తీసుకోవాలని ముఖ్యమంత్రి ఆదేశించారని సిఎస్ ఈ సందర్భంగా గుర్తు చేశారు. సకాలంలో యూనిఫామ్‌లను కుట్టించడమే లక్ష్యంగా పెట్టుకోవాలని, దీనిపై జిల్లా, మండల స్థాయి పర్యవేక్షణ కమిటీలను ఏర్పాటు చేసుకొని నిరంతరం పర్యవేక్షించాలని ఆయా జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. ఐఎండి నివేదికల ప్రకారం దేశంలోనే ఎల్ నినో ప్రభావం అధికంగా ఉన్న రాష్ట్రాలలో తెలంగాణా ఒకటని, ఇప్పటివరకు రాష్ట్రంలో 27శాతం లోటు వర్షపాతం నమోదైందని అధికారులు తెలిపారు. కేవలం 7 జిల్లాల్లో మాత్రమే సాధారణ వర్షపాతం నమోదైందని, మిగతా 385 మండలాల్లో లోటు వర్షపాతం ఉందన్నారు. వాతావరణ వివరాలను రాష్ట్రంలోని రైతులకు ఎప్పటికప్పుడు వాట్సాప్ ద్వారా సమాచారం అందిస్తున్నామని తెలిపారు. కర్ణాటక, మహారాష్ట్రలలో కూడా వర్షాలు ఆశాజనకంగా లేవని, ప్రస్తుతం మేజర్ రిజర్వాయర్లలో ఉన్న నీటిని తాగునీటికి నిల్వ చేస్తున్నామని, ఈ నేపథ్యంలో రైతులు వరి మినహా ఇతర ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి సారించాలన్నారు. ఇప్పటి వరకు వరి సాగు 24 శాతం కంటే తక్కువ నమోదైందన్నారు. సెప్టెంబర్ మాసంలోనూ వర్షాలు అతి తక్కువగా ఉంటాయని భారత వాతావరణ శాఖ స్పష్టం చేసిందని తెలిపారు. వరికి బదులుగా ఇతర ప్రత్యామ్నాయ పంటలపై రైతులను ప్రోత్సహించే విధంగా వాటి ఉత్పత్తులకు కనీస మద్దతు ధర లభిస్తున్నందున ఆ దిశగా రైతులను చైతన్య పర్చాలని అధికారులను ఆదేశించారు.ప్రస్తుత సీజన్‌లో ఫామ్ పాండ్స్‌ల నిర్మాణం విస్తృతంగా చేపట్టాలని సిఎస్ సూచించారు. ప్రతీ 45 రోజులకు ఒకసారి ఖచ్చితంగా మండల సమావేశాలను నిర్వహించే విధంగా సంబంధిత అధికారులు ప్రణాళికలను రూపొందించుకోవాలని జిల్లా కలెక్టర్లను ఆయన ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో స్పెషల్ సిఎస్‌లు సవ్యసాచి ఘోష్, దాన కిషోర్, నీటిపారుదల శాఖ కార్యదర్శి శ్రీధర్, వ్యవసాయ శాఖ కార్యదర్శి సురేంద్ర మోహన్, డైరెక్టర్ గోపీ, పంచాయతీ రాజ్ శాఖ కమిషనర్ దివ్య, పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ నవీన్ నికోలస్‌లు పాల్గొన్నారు.

# 27న లోక్‌భవన్ వద్ద, కలెక్టరేట్ల ముందు నిరసనలు

## ఆగస్టు 6 నుండి 14 వరకు పాదయాత్రలు

## సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు

**హైదరాబాద్, జులై 24, ప్రభాతవార్త:** ఢిల్లీలో విద్యార్థుల ఉద్యమానికి సంఘీ భావంగా, శాంతియుత విద్యార్థి ఆందోళనపై క్రూరమైన అణచివేతకు నిరసనగా సిపిఐ దేశవ్యాప్త ఆందోళనలు చేపట్టాలని నిర్ణయించగా.. అందులో భాగంగా ఈ నెల 27న జిల్లా కలెక్టర్ కార్యాలయాల వద్ద, హైదరాబాద్‌లోని గవర్నర్ కార్యాలయం లోక్ భవన్ ముందు నిరసన కార్యక్రమాలు చేపడుతున్నట్లు సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు తెలిపారు. మహబూబ్ నగర్ జిల్లా పార్టీ కార్యదర్శి కామ్రేడ్ బి. బాలకిషన్ అధ్యక్షతన సిపిఐ రాష్ట్ర కార్యాలయం మగ్దూమ్ భవన్‌లో శుక్రవారం జరిగిన సిపిఐ రాష్ట్ర విస్తృత కార్యవర్గ సమావేశంలో సిపిఐ జాతీయ కార్యదర్శులు పల్లా వెంకటరెడ్డి, కె. రామకృష్ణ, సిపిఐ జాతీయ కంట్రోల్ కమీషన్ చైర్మన్ డాక్టర్ కె. నారాయణ పాల్గొని జాతీయ రాజకీయ పరిస్థితులు వివరించినట్లు సాంబశివరావు తెలిపారు. ఎన్‌టిఎ పరీక్షా పత్రాల లీకేజీలు, యువ అభ్యర్థులను నిరాశలోకి ఆత్మహత్యలకు పురిగొల్పి, దురదృష్టకర ప్రాణ నష్టానికి నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యా శాఖా మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని సాంబశివరావు డిమాండ్ చేశారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వ ప్రజా వ్యతిరేక పాలనను నిరసిస్తూ అన్ని జిల్లాల్లో ఆగస్టు 6 నుండి 14 వరకు పాదయాత్రలు చేయనున్నట్లు తెలపారు. సెప్టెంబరు 1న చలోఢిల్లీకి పిలుపు ఇచ్చామన్నారు. సెప్టెంబరు 11 నుండి 17 వరకు రాష్ట్రవ్యాప్తంగా తెలంగాణ సాయుధ పోరాట వార్షి కోత్సవాలను ఘనంగా నిర్వహించాలని, సెప్టెంబరు 17న పెద్దఎత్తున సభ ఏర్పాటు చేస్తున్నట్లు కూనంనేని సాంబశివరావు తెలిపారు.



# రైతులను ఆర్గానిక్ పంటల వైపు ప్రోత్సహిస్తాం

## హారేకృష్ణ ఫౌండేషన్ ద్వారా

## ప్రభుత్వ పాఠశాలల్లో అల్పాహార పథకం

## సిఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో దివీస్, అరబిందో

## రూ.22 కోట్ల సిఎస్ఆర్ ఫండ్స్ అందజేత

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జులై 24:** ప్రభుత్వ పాఠశాలల్లో బ్రేక్‌ఫాస్ట్ పథకం కోసం హారే కృష్ణ మూవ్‌మెంట్ చారిటబుల్ ఫౌండేషన్‌కు ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి సమక్షంలో దివీస్ లేబొరేటరీస్, అరబిందో ఫార్మా కంపెనీలు తమ కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (సిఎస్ఆర్) నిధులను అందించాయి. శుక్రవారం సాయంత్రం ఎంసీఆర్ హెచ్‌ఆర్‌డీలోని బోధి పెవిలియాన్‌లో హారే కృష్ణ ఫౌండేషన్ ప్రతినిధులు, దివీస్, అరబిందో ఫార్మా కంపెనీల ప్రతినిధులు ముఖ్యమంత్రిని కలిశారు. ప్రభుత్వ పాఠశా లల్లో బ్రేక్‌ఫాస్ట్ పథకం కోసం సీఎస్ఆర్ నిధుల కింద దివీస్ సంస్థ రూ. 12.18 కోట్లు, అరబిందో ఫార్మా రూ.10 కోట్లకు సంబంధించిన చెక్కులను ముఖ్యమంత్రి సమక్షంలో ఫౌండేషన్‌కు అందజేశారు.ప్రభుత్వ పాఠశాలల్లో హారే కృష్ణ మూవ్‌మెంట్ చారిటబుల్ ఫౌండేషన్ ద్వారా విద్యార్థులకు నాణ్యమైన బ్రేక్‌ఫాస్ట్, మధ్యాహ్న భోజనం అందిస్తోంది. ఈ పథకం కోసం సీఎస్ఆర్ నిధులను అందించిన దివీస్, అరబిందో సంస్థలను ఈ సందర్భం గా ముఖ్యమంత్రి అభినందించారు.ఆ పథకం అమలు కోసం హారే కృష్ణ ఫౌండేషన్ సెంట్రలైజ్డ్ కిచెన్‌లను ఏర్పాటు చేసిన చోట సమీప ప్రాంతాల రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం ఆలోచన చేస్తోందని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి ప్రతినిధులకు వివరించారు.

# గుత్తా సుఖేందర్‌రెడ్డికి అమెరికాలో సన్మానం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్,జులై24:** తెలంగాణ శాసన మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి అమెరికా పర్యటనకు వెళ్లారు. అక్కడ న్యూజెర్సీలో పాదురి అమరేందర్ రెడ్డి నివాసంలో, తెలంగాణ డెవలప్‌మెంట్ ఫోరం ఆధ్వర్యంలో తెలంగాణ శాసన మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డిని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆటా, టిడిఎఫ్ ప్రతినిధులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# బిసి గురుకులంలో ఫుడ్ పాయిజనింగ్ అంశం..

## సుమోటోగా మానవ హక్కుల కమిషన్ స్వీకరణ

**హైదరాబాద్, జులై 24, ప్రభాతవార్త:** మంచిర్యాల జిల్లాలోని బెల్లంపల్లిలో ఉన్న బీసీ బాలికల గురుకులంలో జరిగిన ఆహార విషప్రయోగ ఘటనను రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ సుమోటోగా స్వీకరించింది. ఛైర్మన్ డాక్టర్ జస్టిస్ షమీమ్ అక్తర్ నేతృత్వంలోని తెలంగాణ మానవ హక్కుల కమిషన్ (టీజీహెచ్‌ఆర్‌సీ) ఈ సంఘటన, బాధితులైన విద్యార్థులకు అందించిన చికిత్స, విచారణలో వెల్లడైన అంశాలు, తీసుకున్న నివారణ చర్యలపై జిల్లా అధికారుల నుండి సవివరమైన నివేదిక సమర్పించాలని ఆదేశించింది. నివేదిక సమర్పణ కోసం ఈ కేసును ఆగస్టు 25వ తేదీకి వాయిదా వేసింది. కాగా రాష్ట్రంలోని మంచిర్యాల జిల్లా బెల్లంపల్లిలోని బాలికల గురుకులంలో ఫుడ్ పాయిజన్‌తో విద్యార్థినులు అస్వస్థతకు గురయ్యారు. విద్యార్థులు, తల్లిదండ్రులు తెలిపిన వివరాల ప్రకారం ఉడకబెట్టిన బఠానీలను అల్పాహారంగా అందించారు. రాత్రి భోజనం చేసిన కొద్దిసేపటికే కడుపునొప్పి, వికారంతో 30 మంది విద్యార్థినులు వాం తులు చేసుకున్నారు. వెంటనే సిబ్బంది వారిని స్థానిక ప్రభుత్వ దవాఖానకు తరలించారు. కోలుకున్న కొందరిని గురుకులానికి తీసుకువచ్చారు. గురువారం ఉదయం మరికొందరు వాంతులు చేసుకోగా వారిని కూడా దవాఖానకు తరలించారు.ఈ సంఘటనపై మాన హక్కుల కమిషన్ స్పందించింది.

# ఆందోళన వద్దు.. అప్రమత్తంగా ఉండండి

## టిజిఎస్‌ఆర్టీసీ అద్దె బస్సు యజమానులకు

## యాజమాన్యం విజ్ఞప్తి

**హైదరాబాద్, జులై 24, ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస థ(టీజీఎస్ ఆర్‌టీసీ) పరిధిలో సేవలు అందిస్తున్న అద్దె బస్సు యజమానులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని సంస్థ యాజమాన్యం స్పష్టం చేసింది. ఆర్‌టీసీలో అద్దె బస్సుల కొనసాగింపు, నిర్వహణకు సంబంధించిన అన్ని నిర్ణయాలు ప్రభుత్వ ఆదేశాలకు, సంస్థ నిబంధనలకు లోబడి అత్యంత పారదర్శకంగా తీసుకోబడతాయని తెలిపింది. అద్దెబస్సు యజమానులు ఎటువంటి అభద్రతా భావానికి గురికావాల్సిన అవసరం లేదని పేర్కొంది. కొందరు తమ వ్యక్తిగత ప్రయోజనాల కోసం అద్దె బస్సు యజమానులను తప్పుదోవ పట్టించేలా అసత్య ప్రచారాలు వ్యాప్తి చేయడంతో పాటు ప్రభుత్వం, ఆర్‌టీసీలో అధికారులను మేనేజ్ చేయడానికి డబ్బు అవసరమని అద్దె బస్సు యజమానుల నుంచి డబ్బు వసూలు చేస్తున్నట్లు యాజమాన్యం దృష్టికి వచ్చిందని, ఇటువంటి వదంతులు, దుష్ప్రచారాల వల్ల యజమానుల ప్రయోజనాలకు తీవ్ర విఘాతం కలిగే ప్రమాదం ఉందని హెచ్చరించింది.ఆర్‌టీసీలో అన్ని నిర్ణయాలు అత్యంత పారదర్శకంగా తీసుకోవడం జరుగుతుందని, కాబట్టి అద్దె బస్సు యజమానులందరూ అప్రమత్తంగా ఉండాలని, అనధికారిక ప్రచారాలను గానీ, సంఘాల మాటలను గానీ నమ్మి ఎవరూ మోసపోవద్దని సంస్థ కోరింది. సంస్థ అధికారికంగా విడుదల చేసే సమాచారాన్ని మాత్రమే ప్రామాణికంగా పరిగణించాలని సూచించింది.

# బిసి నిరుద్యోగులకు గ్రూప్స్ కోసం ఉచిత కోచింగ్

## ఎస్ఎస్‌సి, బ్యాంకింగ్, ఆర్ఆర్‌బి ఉద్యోగాలకు కూడా..

## నేటి నుంచి దరఖాస్తుల స్వీకరణ

## ఆగస్టు 25 నుంచి శిక్షణా తరగతులు

## బిసి స్టడీ సర్కిల్ డైరెక్టర్ మామిడి హరికృష్ణ

**హైదరాబాద్, జులై 24, ప్రభాతవార్త:** తెలంగాణ ప్రభుత్వ వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలోని తెలంగాణ బీసీ ఉపాధి నైపుణ్యా భివృద్ధి, శిక్షణా కేంద్రం (టిజిబిసిఈఎస్‌డీటీసీ), హైదరాబాద్ ఆధ్వర్యంలో రాష్ట్రంలోని 12 టీజీ బీసీ స్టడీ సర్కిళ్లలో వివిధ గ్రూప్స్ పరీక్షలకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నారు. ఇందుకు సంబంధించి అభ్యర్థులను ఎంపిక చేయడం కోసం నేటి(శనివారం) నుంచి దరఖాస్తులను స్వీకరించనున్నట్లు బీసీ స్టడీ సర్కిల్స్ డైరెక్టర్ మామిడి హరికృష్ణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రూప్-1 గ్రూప్-2, గ్రూప్-3, గ్రూప్-4, బ్యాంకింగ్ సర్వీసెస్, స్టాఫ్ సెలక్షన్ కమిషన్ (ఎస్ఎస్‌సి), రైల్వే రిక్రూట్‌మెంట్ బోర్డు (ఆర్ఆర్‌బి), పోలీస్ నియామక పరీక్షలకు ఉచిత ఫౌండేషన్ కోర్సులలో ప్రవేశాల కోసం అర్హులైన బీసీ, ఎస్సీ, ఎస్టీ, ఇతర (ఈబీసీ/ అనాథలు) అభ్యర్థుల నుండి ఆన్‌లైన్ దరఖాస్తులు ఆహ్వా నిస్తున్నట్లు తెలిపారు. ఉచిత కోచింగ్ కార్యక్రమం 125 రోజుల పాటు నిర్వహించ బడుతుందన్నారు. శుక్రవారం పత్రిక ప్రకటన విడుదల చేయగా, దరఖాస్తులనే నేటి(శనివారం) స్వీకరించనున్నారు. ఆగస్టు 14 వరకు దరఖాస్తు లను స్వీకరించ నున్నారు. ఎంపికైన అభ్యర్థుల జాబితాను ఆగస్టు 18న విడుదల చేయనున్నారు. ఆగస్టు 20 నుంచి 24 వరకు ధ్రువపత్రాల పరిశీలన చేయనున్నారు. ఆగస్టు 25 నుంచి కోచింగ్‌ను ప్రారంభించ నున్నారు. అభ్యర్థి తప్పనిసరిగా డిగ్రీ ఉత్తీర్ణుడయి ఉండాలి. కుటుంబ వార్షిక ఆదాయం (2026-27 ఆర్థిక సంవత్సరానికి) గ్రామీణ ప్రాంతాలలో రూ.1.50 లక్షలు, పట్టణ ప్రాంతాలలో రూ.2 లక్షలు మించరాదు. రెగ్యులర్ కోర్సు చదువుతున్న వారు, ఉద్యోగంలో ఉన్న వారు గతంలో టీజీ బీసీ స్టడీ సర్కిళ్లలో ఉచిత కోచింగ్ పొందిన వారు అర్హులు కారు. ప్రతి నెల 75 శాతం అంతకంటే ఎక్కువ హాజరు ఉన్న అభ్యర్థులకు ఐదు నెలల పాటు నెలకు రూ. 1,000 చొప్పున (పుస్తక నిధి, రవాణా భత్యంతో కలిపి) స్టైఫండ్ మంజూరు చేయబడుతుందని తెలిపారు. డిగ్రీలో సాధిం చిన మార్కులు, రిజర్వేషన్ నిబంధనలు, ఆయా స్టడీ సర్కిళ్లలో అందుబాటులో ఉన్న సీట్ల ఆధారంగా ఎంపిక జరుగుతుందని డైరక్టర్ తెలిపారు. దరఖాస్తులను బీసీ స్టడీ సర్కిల్ అధికారిక వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాలని, మరిన్ని వివరాలకు టీజీ బీసీ స్టడీ సర్కిల్, రోడ్ నెం.8, లక్ష్మీ నగర్ కాలనీ, సైదాబాద్, హైదరాబాద్‌లో, 040-24071178, 778035 9322 ఫోన్ నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

# గ్లోబరీనాలో కెటిఆర్ హస్తం ఉన్నట్లు అనుమానాలు

## పిసిసి అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్

**హైదరాబాద్,జులై 24,ప్రభాతవార్త:** గ్లోబరినాలో కెటిఆర్ హస్తం ఉన్నట్లు అనుమానాలు బలపడుతున్నాయని పిసిసి అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ ఆరోపించారు. గాంధీభవన్‌లో మీడియాతో మాట్లాడుతూ బిఆర్ఎస్ పాపాల చిట్టా పెద్దది గ్లోబరిన సంస్థ ఆ నాడు ఇంటర్మీడియట్ విద్యార్థుల చావుకు కారణం అయ్యిందనీ గుర్తుచేశారు. 20 పైగా విద్యార్థులు ప్రాణాలు పోవడానికి గ్లోబరిన సంస్థ కారణం కాదా? అని నిలదీశారు. గ్లోబరిన సంస్థ రిపోర్టును బిఆర్ ఎస్ ఎందుకు బయటపెట్టలేదు? అని ప్రశ్నించారు. గ్లోబరిన సంస్థ పేరు మార్చుకొని విద్యార్థుల జీవితంతో ఆటలు ఆడుతోందనీ ఆవేదన చెందారు. ధర్నా చౌక్ ఎత్తేసిన చరిత్ర బిఆర్ ఎస్ పార్టీ ధర్నా చేసే హక్కు కెటిఆర్ కి ఎక్కడిది? అని అన్నారు. ధర్నా చౌక్ లో ముక్కు నెలకు రాసి కెటిఆర్ క్షమాపణలు చెప్పాలనీ డిమాండ్ చేశారు. ధర్నా చౌక్ లో ఏ విధముగా ధర్నా చేస్తున్నారో కెటిఆర్ అర్థం చేసుకోవాలనీ కోరారు. ఎఐసిసి అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఈ వయస్సులో విద్యార్థుల పక్షాన పోరాడు తుంటేమీ అయ్యా కెసిఆర్ ఫామ్ హౌస్ కి పరిమితమయ్యారనీ, ప్రతిపక్ష నేతగా కెసిఆర్ ఎందుకు ఢిల్లీ కి వెళ్లలేదు? అని అడిగారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కొడంగల్ లో నిరసనలో పాల్గొన్నారనీ, బిఆర్ఎస్ హయంలో లీకుల పర్వం సాగిందనీ తెలిపారు. 14 వందల కోట్లు బిఆర్ ఎస్ ఖాతాలో మూలుగుతున్నాయనీ అందులోనుంచి చనిపోయిన విద్యార్థుల కుటుంబాలకు ఆర్థిక సహాయం చేయండి అని కోరారు. మే 12 నీట్ పరీక్ష లీక్ అయితే కెటిఆర్ ఇప్పుడు మొద్దునిద్ర లేచాడనీ అన్నారు. రాహుల్ గాంధీకి మైలేజ్ వస్తుందని మోడీ తో కుట్ర పన్ని కెటిఆర్ బట్ట కాల్చి మీద వేసే ప్రయత్నం ఇదే అని అన్నారు. బిఆర్ఎస్ డ్రామాలో విద్యార్థులు భాగం కావొద్దని విజ్ఞప్తి చేశారు. బిఆర్ఎస్ హయంలో ఒక్క నోటిఫికేషన్ ఇవ్వలేదని ఆరోపించారు.





శుక్రవారం గాంధీభవన్‌లో మీడియాతో మాట్లాడుతున్న పిసిసి అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్

# ఎల్‌నినో పరిస్థితుల్లో మరింత వేగంగా ఆయిల్‌పామ్ విస్తరణ

## వ్యవసాయ మంత్రి

## తుమ్మల నాగేశ్వరరావు

**హైదరాబాద్, జులై 24, ప్రభాతవార్త:** ఎల్ నినో పరిస్థితుల నేపథ్యంలో రాష్ట్రంలో మరింత వేగంగా ఆయిల్‌పామ్ సాగు విస్తరణ చేపట్టాలని వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరావు సూచించారు. రైతు ప్రయోజనాలకు సంబంధిం చిన ప్రతి అంశంలో అధికారులు బాధ్యతా యుతంగా వ్యవహరించాలని స్పష్టం చేశారు. హైదరాబాద్‌లోని తెలంగాణ స్టేట్ ఆయిల్‌ఫెడ్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ ప్రస్తుతం రాష్ట్రం ఎల్ నినో ప్రభావాన్ని ఎదుర్కొనే పరిస్థితులు నెలకొన్నాయని, వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని రైతులకు ప్రత్యామ్నాయంగా నిలబడగల పంటలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఎలాంటి కఠిన పరిస్థితులనైనా తట్టుకుని నిలబడగల సామర్థ్యం ఉన్న పంటల్లో ఆయిల్‌పామ్ ఒకటని పేర్కొన్నారు. అందువల్ల రాష్ట్రంలో ఆయిల్‌పామ్ సాగు విస్తరణపై దృష్టిసారించాలని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా రైతుల నుంచి ఆయిల్‌పామ్ సాగుపై ఆసక్తి రోజురోజుకూ పెరుగుతోందన్నారు. ముఖ్యంగా ప్రస్తుతం ఆయిల్‌పామ్ తాజా గెలలకు మార్కెట్లో మంచి ధర లభిస్తోందని, ఈ కారణంగా పెద్ద సంఖ్యలో రైతులు ఆయిల్‌పామ్ సాగు వైపు మొగ్గుచూపుతున్నారని చెప్పారు. ఈ అవకాశాన్ని పూర్తిగా వినియో గించుకునేలా అధికారులు ముందస్తు ప్రణాళికతో పనిచేయాలని సూచించారు. రైతులు నర్సరీలకు వెళ్లినప్పుడు మొక్కలు అందుబాటులో లేవని చెప్పే పరిస్థితి ఎట్టి పరిస్థితుల్లోనూ రాకూడదని స్పష్టం చేశారు. రైతుల అవసరాలను ముందుగానే అంచనా వేసి, అవసరమైన మేరకు నాణ్యమైన పామాయిల్ మొక్కలను నర్సరీలలో సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు. ప్రతి జిల్లాలో, ప్రతి ఆయిల్‌పామ్ విస్తరణ ప్రాంతంలో రైతుల డిమాండ్‌కు అనుగుణంగా మొక్కల ఉత్పత్తి చేపట్టాలని పేర్కొన్నారు. భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకొని తక్కువ ఎత్తు పెరిగే, తక్కువ నిడివి గల ఆకులు కలిగి, అధిక దిగుబడులు ఇచ్చే ఆధునిక రకాల ఆయిల్‌పామ్ మొలకలను అధిక సంఖ్యలో దిగుమతి చేసుకోవాలని తెలిపారు. ఈ రకాల మొక్కలు రైతులకు నిర్వహణ సులభతరం చేయడమే కాకుండా అధిక దిగుబడులు, మెరుగైన ఆదాయాన్ని అందిస్తాయన్నారు. అదేవిధంగా ఆయిల్‌పామ్ సాగులో కీలకమైన డ్రిప్ ఇరిగేషన్ విషయంలో కూడా ఎలాంటి జాప్యం ఉండకూడదన్నారు. డ్రిప్ పరికరాల కోసం దరఖా స్తు చేసుకున్న ప్రతి రైతుకు సకాలంలో పరికరాలు అందేలా డ్రిప్ కంపెనీలతో సమన్వయం చేసుకోవాలని చెప్పారు.



తండ్రి కెసిఆర్‌సహా కుటుంబసభ్యులతో కలిసి బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ శుక్రవారం జన్మదినం సందర్భంగా మొక్కను నాటి నీరు పోస్తున్న దృశ్యం

# పుట్టినరోజు సందర్భంగా కెటిఆర్‌ను ఆశీర్వదించిన కెసిఆర్

## మొక్క నాటిన కెటిఆర్

## జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన సిఎం రేవంత్‌రెడ్డి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్,జులై24:** ఎర్రవల్లి ఫామ్‌హౌజ్‌లో మాజీ మంత్రి, బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, తన తనయుడు కె.టి. రామా రావుకు అధినేత కేసీఆర్ జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. నిండు నూరేళ్ల ఆయురారోగ్యాలతో జీవించాలని కుమారుణ్ణి కేసీఆర్ దంపతులు దీవించారు. అనంతరం వ్యవసాయ క్షేత్రంలో కెటిఆర్ కలియతిరిగారు. తండ్రి కేసీఆర్ సహా తన కుటుంబసభ్యులతో కలిసి జన్మదినం సందర్భంగా కేటీఆర్ మొక్కను నాటారు. గ్రీన్ ఇండియా ఛాలెంజ్ ఫౌండర్ మాజీ ఎంపీ జోగినపల్లి సంతోష్ కుమార్ కోరిక మేరకు మొక్కను నాటి కేటీఆర్ సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా కేటీఆర్ సతీమణి శైలిమ, కుమారుడు హిమాన్షు కూతురు రియాన్షి ఇంకా కుటుంబసభ్యులు, ముఖ్యు లు పాల్గొన్నారు. కాగా.. ఢిల్లీ జంతర్‌మంతర్ వద్ద ఉద్యమిస్తున్న యువతకు మద్దతుగా, వారిపైన జరుగు తున్న నిర్బంధాన్ని నిరసిస్తూ, కేంద్ర ప్రభుత్వ మొండివైఖరికి వ్యతిరేకంగా.. తన పుట్టినరోజు వేడుకలకు కేటీఆర్ దూరంగా ఉన్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ఇందిరాపార్క్ ధర్నాచౌక్ వద్ద నీట్ పేపర్ లీకేజీకి బాధ్యత వహించి, కేంద్ర విద్యా శాఖ మంత్రి తక్షణమే రాజీనామా చేయాలనే డిమాం డుతో, బిఆర్ఎస్ విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో నీట్ లీకేజీ బాధిత విద్యా ర్థులకు మద్దతుగా ధర్నా కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కేటీఆర్ అక్కడినుండి నేరుగా ఎర్రవెల్లి కేసీఆర్ నివాసానికి చేరుకున్నారు. కాగా, బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్,సిరిసిల్ల ఎమ్మెల్యే కల్వ కుంట్ల తారక రామారావుకు ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి హార్ధిక జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. నిత్యం ప్రజాసేవలో నిమగ్నమవుతూ రాష్ట్రాభివృద్ధికి పాటుపడటంలో భగవంతుడు వారికి సంపూర్ణ ఆయురారోగ్యాలు ప్రసాదిం చాలని సిఎం ఆకాంక్షి ంచారు

### తెలంగాణ భవన్‌లో కెటిఆర్ రెజ్లింగ్ ఛాంపియన్‌షిప్ పోటీలు

తెలంగాణ భవన్‌లో అట్టహాసంగా కెటిఆర్ 50వ పుట్టినరోజును పురస్కరిం చుకుని కెటిఆర్ రెస్లింగ్ ఛాంపియన్‌షిప్(కుస్తీ పోటీలు) నిర్వహణ జరిగింది. ఈ సందర్భంగా మాజీ మంత్రి,డిప్యూటీ ఫ్లోర్ లీడర్ తలసాని శ్రీనివాస్ యాదవ్ ఇతర నేతలు హాజరయ్యారు.

# నేడు హెచ్ఎండిఎ ఆధ్వర్యంలో వనమహోత్సవం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జులై 24:** రాష్ట్ర ప్రభుత్వం ప్రతి ష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న 'వన మహోత్సవం-2026' కార్యక్రమంలో భాగంగా హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ (హెచ్ఎం డిఏ) ఆధ్వర్యంలోని అర్బన్ ఫారెస్ట్రీ విభాగం ప్రజల భాగస్వామ్యంతో నగర హరితాభివృద్ధిని ప్రోత్సహించే కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది.ఈ కార్యక్రమంలో భాగంగా శనివారం సాయంత్రం 4.00 గంటలకు తార్నాకలోని మర్రి లక్ష్మారెడ్డి ఫంక్షన్ హాల్ లో తారక సేవా సమాఖ్య (ఎన్‌జీఓ) సహకారంతో ప్రతి కుటుంబానికి ఐదు ఉచిత మొక్కలు (పండ్ల, ఔషధ, అలంకరణ మొక్కలు) పంపిణీ చేయనున్నట్లు హెచ్ఎండిఏ ఉద్యానవన శాఖ సహాయ సంచాలకులు చక్రపాణి శుక్రవారం ప్రకటనలో తెలిపారు.ఈ కార్యక్రమం ద్వారా నగరంలో పచ్చదనాన్ని పెంపొందించడం, వాతావరణ మార్పుల ప్రభావాన్ని తగ్గించడం, భూగర్భ జలాల పరిరక్షణ, జీవ వైవిధ్య సంరక్షణతో పాటు ప్రతి ఇంటిలో ఆరోగ్యకరమైన ఇంటి తోటల ఏర్పాటును ప్రోత్సహించడం లక్ష్యంగా పెట్టుకున్నారు.

# డిజిటల్ అడ్వర్టైజింగ్ హబ్‌లుగా మీసేవ కేంద్రాలు

## చిన్న వ్యాపారాలకు డిజిటల్ మార్కెటింగ్ సేవలు అందుబాటులోకి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జులై 24:** తెలంగాణ ప్రభుత్వం ఎలక్ట్రానిక్ సర్వీస్ డెలివరీ (మీ సేవ) ఆధ్వర్యంలో, అంతర్జాతీయంగా పేరొందిన మెటా సంస్థ సహకారంతో రాష్ట్రంలోని మీ సేవ కేంద్రాలను డిజిటల్ అడ్వర్టైజింగ్ హబ్‌లుగా తీర్చిదిద్దే వినూత్న కార్యక్రమాన్ని ప్రారంభించింది. దీని ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా చిన్న, మధ్య తరహా వ్యాపార సంస్థలకు తక్కువ వ్యయంతో డిజిటల్ ప్రకటనల సేవలు అందుబాటులోకి రానున్నాయి. శుక్రవారం హైదరాబాద్ లో నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో క్యూర్ ప్రాంతానికి చెందిన 150 మందికి పైగా మీ సేవా విలేజ్ లెవల్ ఎంటర్ ప్రెన్యూర్స్ (విఎల్‌ఈ) పాల్గొన్నారు. మెటా ప్లాట్‌ఫారమ్‌లలో (ఫేస్బుక్, ఇన్‌స్టాగ్రామ్, వాట్సప్) ప్రకటనలను రూపొందించడం, వాట్సప్ బిజినెస్ ఎకౌంట్ ను క్రియేట్ చేయటం, తమ ఉత్పత్తులను ఆ ఎకౌంట్ ద్వారా ప్రచారం చేయడం, వినియోగదారులను గుర్తించడం, డిజిటల్ ప్రచార కార్యక్రమాలను నిర్వహించడం వంటి అంశాలపై వారికి శిక్షణ అందించారు. ఈ కార్యక్రమం ద్వారా కిరాణా షాప్స్, పండ్ల వ్యాపారులు, స్వీట్ షాపులు, రెస్టారెంట్లు, మెడికల్ షాపులు, ఆసుపత్రులు, పాఠశాలలు, సెలూన్లు, మెకానిక్‌లు, ఎలక్ట్రీషియన్లు, ప్లంబర్లు, స్టార్టప్‌లు, ఎంఎస్ఎంఈలు, పెద్ద సంస్థలు తదితర అన్ని రకాల వ్యాపారాలు తమ సమీపంలోని మీ సేవా కేంద్రాన్ని సంప్రదించి మెటా ప్లాట్‌ఫారమ్‌లలో ప్రొఫెషనల్ డిజిటల్ ప్రకటనలను రూపొందించి ప్రచారం చేసుకునే అవకాశం పొందుతాయి.మీ సేవా నిర్వాహకులు ప్రకటనల రూపకల్పన, ప్రచార కంటెంట్ తయారీ, సరైన వినియోగదారుల ఎంపిక, ప్రకటనల ప్రచురణ తదితర అంశాల్లో పూర్తి సహాయాన్ని అందిస్తారు. దీంతో వ్యాపార సంస్థలు తమ ఉత్పత్తులు, సేవలకు మరింత ప్రచారం కల్పించుకొని, ఎక్కువ మంది వినియోగదారులను చేరటం ద్వారా వ్యాపారాన్ని అభివృద్ధి చేసుకునే అవకాశం ఉంటుంది.ఈ సందర్భంగా మీ సేవ కమిషనర్ టి. రవి కిరణ్ మాట్లాడుతూ.. ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు నేతృత్వంలో తెలంగాణ ప్రభుత్వం సాంకేతికత ద్వారా పారిశ్రామికవేత్తలు, చిన్న వ్యాపారుల అభివృద్ధికి కృషి చేస్తోందని అన్నారు. మెటా సంస్థకు ఉన్న ప్రపంచ స్థాయి డిజిటల్ అడ్వర్టైజింగ్ నైపుణ్యాన్ని, రాష్ట్రవ్యాప్తంగా విస్తరించి ఉన్న మీ సేవా కేంద్రాల నెట్‌వర్క్‌తో అనుసంధానం చేయడం ద్వారా ఇప్పటివరకు డిజిటల్ మార్కెటింగ్‌కు దూరంగా ఉన్న చిన్న, గ్రామీణ వ్యాపారాలకు కూడా నాణ్యమైన సేవలు అందుబాటులోకి వస్తాయని తెలిపారు.ఈ వినూత్న భాగస్వామ్యంతో మీ సేవా కేంద్రాలు ఇకపై కేవలం పౌర సేవలకే పరిమితం కాకుండా డిజిటల్ అడ్వర్టైజింగ్ హబ్‌లుగా రూపాంతరం చెంది, చిన్న, మధ్య తరహా వ్యాపారాల అభివృద్ధికి తోడ్పడటంతో పాటు మీ సేవ కేంద్రాలను నడిపేవారికి కూడా అదనపు ఉపాధి, ఆదాయ అవకాశాలను కల్పిస్తూ తెలంగాణ డిజిటల్ ఆర్థిక వ్యవస్థ బలోపేతానికి దోహదపడనున్నాయని ప్రభుత్వం ఓ ప్రకటనలో తెలిపింది.

